- ముడాపై హైకోర్టులో సిద్దరామయ్యకు షాక్
- నటిపై రేప్ కేసులో కేరళ ఎమ్మెల్యే అరెస్ట్
- రద్దైన సాగు చట్టాలు మళ్లీ చేయాలి: కంగనా
- అదానీ పవర్ కోసం టెండర్ రూల్స్ మార్పు
- కోల్‌కతాలో ట్రామ్ సేవలకు స్వస్తి!

..లోపలి పేజీల్లో



# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA





బుధవారం WEDNESDAY 25.9.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4+8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం Pages: 12+4+ 8 Pages NIPUNA supplement | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 111 ‖ వెల (Price) రూ.6.50

అష్టమి

బుధవారం, సూర్యోదయం: 6-05, సూర్యాస్తమయం: 6-09. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం కృష్ణ పక్షం తిథి: అష్టమి పగలు 12-11 వరకు. నక్షత్రం: ఆరుద్ర రాత్రి 10-24 వరకు. వర్జ్యం: ఉదయం 6-24 నుంచి ఉదయం 8-07 వరకు. రాహుకాలం: పగలు 12-07 నుంచి పగలు 1-37 వరకు. దుర్ముహూర్తం: పగలు 11-43 నుంచి పగలు 12-31 వరకు. అమృతకాలం: పగలు 12-11 నుంచి పగలు 1-49 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD


www.ntnews.com /ntdailyonline




**అలైన్‌మెంట్ మారిస్తే ఒప్పుకోం** | ట్రిపుల్ ఆర్ సౌత్ అలైన్‌మెంట్ మార్పుపై రైతులు రోడ్డెక్కారు. ప్రభుత్వ నిర్ణయంతో 200 ఎకరాల పట్టా భూములు కోల్పోతున్నామని ఆందోళన వ్యక్తంచేస్తూ మంగళవారం వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట రైతులు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. అలైన్‌మెంట్ మార్పును ఉపసంహరించుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# అసైన్డ్ భూంఫట్!

## నిబంధనలకు పాతరేసి అసైన్డ్, సీలింగ్ భూములకు ఎసరు




ప్రత్యేక కథనం - 7

- సూట్‌కేస్ కంపెనీల పేరిట నాల్గో నగరంలో భూముల చెర
- ఫ్యూచర్ సిటీ, ట్రిపుల్‌ఆర్ గ్రామాల్లో బెంజ్ కార్ల చక్కర్లు
- 99 ఏండ్ల లీజుపై చేతులు మారుతున్న వందల ఎకరాలు
- బెదిరించి, భయపెట్టి, ఎంతోకొంత ముట్టజెప్పి ఒప్పందాలు
- తిలాపాపం తలా పిడికెడు!.. సర్వీస్, రిటైర్డ్ ఆఫీసర్లకూ భాగం
- రికార్డుల్లో పట్టాలుగా మార్చేందుకు కదులుతున్న పావులు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబరు 24 (నమస్తే తెలంగాణ): అవి మారుమూలన రాళ్లు, గుట్టలు, ఏనెలతో నిండిన భూములు.. తొండలు కూడా గుడ్లుపెట్టని నేలలు.. అందుకే దశాబ్దాల కిందట ప్రభుత్వాలు ఆ భూములను భూమిలేని నిరుపేదలకు సాగు చేసుకునేందుకు ఇచ్చాయి. దశాబ్దాలుగా ఆ రైతులు తమ కండల్ని కరిగించి, వాటిని చదును చేసుకుని సాగు చేసుకుంటున్నారు. ఇప్పుడు ఆ భూములకు దశ తిరిగింది. పాలకులు ప్రకటిస్తున్న ఫోర్త్ అలియాస్ ఫ్యూచర్ సిటీలు ఆ భూముల పక్కనే వెలుస్తున్నాయి. సర్కారు పెద్దలు గీస్తున్న ట్రిపుల్‌ఆర్ రింగులు.. గ్రీన్ ఫీల్డ్ రోడ్లు వాటి సమీపంలో › 3వ పేజీలో

# ట్రిపుల్ ఆర్ బాధితుల పక్షాన పోరాడుతం



మంగళవారం హరీశ్‌రావును కలిసి వినతిపత్రం అందజేస్తున్న ట్రిపుల్ ఆర్ ఉత్తరభాగం బాధితులు

- ఎన్నికల్లో చేసిన వాగ్దానాలను సర్కార్ అమలు చేయాలి
- భువనగిరిలో ఇచ్చిన హామీని ప్రియాంక నిలబెట్టుకోవాలి
- భూ బాధితులకు మెరుగైన నష్ట పరిహారం అందించాలి
- ఉత్తరం వైపూ 40 కి.మీ. జంక్షన్.. హరీశ్ డిమాండ్
- మాజీ మంత్రిని కలిసి గోడువెళ్లబోసుకున్న బాధితులు

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తేతెలంగాణ): 'ట్రిపుల్ ఆర్ బాధితులు, రైతులు అధైర్య పడొద్దు.. బీఆర్‌ఎస్ అండగా ఉంటది..ప్రభుత్వం దిగిరాకుంటే పార్టీ తరపున పోరాడుతం' అంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టంచేశారు. ట్రిపుల్ ఆర్ బాధితులు, రైతులు హరీశ్‌రావును మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. ఎన్నికల ముందు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సహా మంత్రులెవరూ పట్టించుకోవడంలేదని వాపోయారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ ఉత్తరం దిక్కు ట్రిపుల్ ఆర్ బాధితులకు న్యాయం చేస్తామని అసెంబ్లీ ఎన్నికల › 3వ పేజీలో



# ఓట్లేయలేదనే కూల్చివేతలు

## నిరుపేదలపై కాంగ్రెస్ సర్కారు ప్రతాపం

- తిరుపతిరెడ్డికి ఇచ్చినట్టు గరీబోళ్లకు టైమ్ ఇయ్యలే
- దమ్ముంటే మీ నేతల ఫామ్‌హౌస్‌లను కూల్చండి
- అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోండి
- పేదలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా నిలబడుతుంది
- రేవంత్‌రెడ్డి కుటుంబం రాష్ట్రాన్ని పంచుకున్నది
- బీఆర్‌ఎస్ కన్‌స్ట్రక్షన్ చేస్తే రేవంత్‌రెడ్డిది డిస్ట్రక్షన్
- మాదాపూర్‌లో తిరుపతిరెడ్డి కమీషన్ల దుకాణం
- శేరిలింగంపల్లి బీఆర్‌ఎస్ సమావేశంలో కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): హైడ్రా పేరుతో పేదల బతుకులను రోడ్డున పడేస్తున్నారని, పేదోళ్ల గూడు కూల్చుతున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. గరీబోళ్లకు ఒక న్యాయం, సీఎం అన్న తిరుపతిరెడ్డికి మరో న్యాయమా? అని ప్రశ్నించారు. పేదల ఇండ్లను కూల్చేస్తామంటే బీఆర్‌ఎస్ ఊరుకోదని హెచ్చరించారు. వారికి అండగా ఉంటామని తెలిపారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన శేరిలింగంపల్లి పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రాన్ని పంచుకొని దోచుకుంటున్నదని ఆరోపించారు. మాదాపూర్‌లో తిరుపతిరెడ్డి దుకాణం తెరిచాడని గతంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అన్నారని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా ఇవ్వలేదనే ఆటో డ్రైవర్లు, బస్తీవాసులు, పేదలపై సీఎం పగబట్టాడని విమర్శించారు. బీఆర్‌ఎస్ వాళ్లు అడుగుతున్నారని తిరుపతిరెడ్డికి ఒక › 2వ పేజీలో



రాజ్యసభ సభ్యత్వానికి

# కృష్ణయ్య రాజీనామా

గ్రామ స్థాయి నుంచి బీసీ ఉద్యమం నిర్మిస్తాం

సమగ్ర కులగణనకు చట్టబద్ధతే లక్ష్యం: కృష్ణయ్య › 5

# డీఎస్సీ 2008 అభ్యర్థులకు తీపికబురు

2,367 మందికి కాంట్రాక్ట్ ఉద్యోగాలు

27 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్

ఉమ్మడి జిల్లాలవారీగా పోస్టింగ్‌లు

విద్యాశాఖ ఉత్తర్వులు జారీ › 6

# 'మెగా'పై దగా!



- ప్రైవేటు కోసం సర్కారు డెయిరీని బలిపెట్టే చర్యలు
- పొరుగు రాష్ట్రం పెద్దల కోసం తెరవెనుక పావులు
- నిర్వీర్యం దిశగా 8 లక్షల లీటర్ల ప్రాసెసింగ్ యూనిట్
- నిర్వహణ గాలికి.. కనీస సమీక్ష చేయని ప్రభుత్వం
- మెగా డెయిరీలో 9 నెలలుగా నో మెయింటనెన్స్

రాష్ట్రంలో పాడిరంగాన్ని అభివృద్ధి చేసి తద్వారా పాడి రైతులకు మేలు చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం విజయ డెయిరీ ఆధ్వర్యంలో 'మెగా డెయిరీ'ని నిర్మించింది. రూ.250కోట్ల భారీ పెట్టుబడితో ప్రతిరోజు 8 లక్షల లీటర్ల పాలను ప్రాసెసింగ్ చేసే సామర్థ్యంతో ఈ మెగా డెయిరీని అత్యంత సాంకేతికతతో నిర్మించారు. కానీ ఇప్పుడు ఈ మెగా డెయిరీ లక్ష్యం నీరుగారుతున్నది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని మెగా డెయిరీని క్రమంగా 'ప్రైవేటు'కు ధారాదత్తం చేసేందుకు తెరవెనుక ప్రయత్నాలు జరుగుతున్నట్టుగా తెలిసింది. పొరుగు రాష్ట్రం 'పెద్దల' కంపెనీకి కట్టబెట్టేందుకు ప్రభుత్వ పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నట్టుగా సమాచారం. ఇందులో భాగంగానే ఓ ప్రణాళిక ప్రకారం విజయ డెయిరీని నిర్వీర్యం చేసే పనిలో పడినట్టుగా విమర్శలు వినిపిస్తున్నాయి.

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పాడి రైతుల నుంచి ఎక్కువ మొత్తంలో పాలను సేకరించాలని నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. పాల సేకరణ పెరిగితే శుద్ధి చేసేందుకు ఇబ్బంది రావొద్దనే ఉద్దేశంతో మెగా డెయిరీ నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో 40 ఎకరాల భారీ విస్తీర్ణంలో రూ.250కోట్ల భారీ పెట్టుబడితో మెగా డెయిరీని నిర్మించింది. నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు(ఎన్‌డీడీబీ) సహకారంతో అత్యంత అధునాతనంగా, సాంకేతికంగా ఈ డెయిరీని నిర్మించారు. ప్రతి రోజు 8 లక్షల లీటర్ల పాలను శుద్ధి చేయడంతోపాటు 5వేల లీటర్ల ఐస్‌క్రీం తయారీ, లక్ష టెట్రా పాల ప్యాకెట్ల తయారీకి ప్రణాళికలు రూపొందించారు. ఈ డెయిరీని నాటి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ 2023 అక్టోబర్ 5న ప్రారంభించారు. కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా విజయ మెగా డెయిరీని నిర్మిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నిర్లక్ష్యం చేస్తుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మెగా డెయిరీ నిర్వహణకు ప్రభుత్వం నుంచి కనీస సహకారం కరువైనట్టుగా సంస్థ అధికారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఏడాది కిందట ప్రారంభించిన మెగా డెయిరీలో ఇప్పటికీ పూర్తిస్థాయిలో పాల శుద్ధి ప్రారంభంకాకపోవడం గమనార్హం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు పూర్తయినా ఇప్పటికీ మెగా డెయిరీ నిర్వహణపై ఆరా తీయకపోవడంపై › 2వ పేజీలో

# 16న కోర్టుకు రేవంత్ రావాల్సిందే

నాంపల్లి ఈడీ కోర్టు ఆదేశాలు

ఓటుకు నోటు కేసు విచారణకు నిందితులు రాకపోవడంపై అసహనం

నాంపల్లి కోర్టులు, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చే నెల 16న జరిగే విచారణకు తప్పక హాజరుకావాలంటూ నాంపల్లి ఈడీ కోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. రేవంత్‌రెడ్డి ఏ-1 నిందితుడిగా ఉన్న ఓటుకు నోటు కేసు విచారణ నాంపల్లి ఈడీ కోర్టులో మంగళవారం కొనసాగింది. విచారణకు మత్తయ్య మినహా మిగతా నిందితులు రేవంత్‌రెడ్డి, ఉదయ్ సింహ, వేం కృష్ణకీర్తన్, సండ్ర వెంకట వీరయ్య, సెబాస్టియన్ హాజరు కాలేదు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న కోర్టు.. తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. నిందితులు ప్రతి వాయిదాకూ హాజరుకావడం లేదని, ఇదేం పద్ధతి అంటూ జడ్జి అసంతృప్తి వ్యక్తంచేశారు. విచారణకు నిందితులు ఎందుకు హాజరుకావడం లేదని ప్రశ్నించారు. వచ్చే నెల 16కు కేసును వాయిదా వేశారు. ఆ రోజు నిందితులు తప్పనిసరిగా హాజరుకావాలని నిందితుల › 3వ పేజీలో





# రుణమాఫీపై ఎమ్మెల్యే నిలదీత

- మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరికి నిరసన సెగ.. 6 గ్యారెంటీలపై అడ్డగించిన స్థానికులు
- రుణమాఫీ ధోకాపై రైతుల ఆగ్రహం.. జగిత్యాల జిల్లాలో రైతువేదికకు తాళం

అమరచింత, సెప్టెంబర్ 24 : మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి నిరసన సెగ తగిలింది. రుణమాఫీపై రైతులు, ఆరు గ్యారెంటీల అమలుపై మహిళలు, ఇతరులు నిలదీశారు. వనపర్తి జిల్లా అమరచింత మండలం నాగల్‌కడ్మూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సబ్సిడీ సిలిండర్ల ధ్రువపత్రాలను మంగళవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల రుణమాఫీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందజేస్తున్నామని చెప్పారు. దీంతో గ్రామస్థుడు తన ఇంటికి ఉచిత విద్యుత్తు రావడం లేదని, తనతో బిల్లు కట్టించుకున్నారని చెప్పాడు. అలాగే రుణమాఫీ అమలు కాలేదని పలువురు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కౌలు రైతులకు కూడా › 5వ పేజీలో

## ఇద్దరు రైతుల ఆత్మహత్య

దిగుబడి రాక.. అప్పులు తీర్చలేక మనస్తాపం

జనగామ, రంగారెడ్డి జిల్లాల్లో బలవన్మరణాలు › 5





# లెబనాన్‌పై బాంబుల వర్షం

- దక్షిణభాగం లక్ష్యంగా విరుచుకుపడిన ఇజ్రాయెల్
- భీకర దాడితో పూర్తిస్థాయి యుద్ధం దిశగా అడుగులు
- ఆశ్రయం కోసం దేశవ్యాప్తంగా బాధితుల అవస్థలు

**550** మంది మృతి › 7

**1558** మందికి గాయాలు

# ఊరూరా లిక్కర్ మాల్స్?



- రాష్ట్రంలో పెరగనున్న మద్యం షాపులు
- ఆదాయం పెంపునకు సర్కార్ యోచన
- 14 వేల మందికి ఒకటి ఉండేలా ప్లాన్?
- ప్రత్యామ్నాయ మార్గాలపై అధ్యయనం
- ఒకటీ రెండు రోజుల్లో ఎక్సైజ్ నివేదిక › 2



తలుపులను ఊడదీస్తున్న బ్యాంకు అధికారి

# దర్వాజలు ఊడబీకి దౌర్జన్యం

అప్పు చెల్లించలేదని రైతు ఇంటి తలుపులు తొలగించిన డీసీసీబీ

స్థానికుల ఆగ్రహంతో వెనుదిరిగిన అధికారులు › 5

# ధాన్యం దించుకోం! › 2

- ప్రభుత్వానికి మిల్లర్ల అల్టిమేటం
- అన్ని జిల్లాల్లో కలెక్టర్లకు వినతిపత్రాలు
- సన్న ధాన్యంతో 67% సీఎంఆర్ ఇవ్వలేం
- మిల్లులపై దాడులు, వేధింపులు ఆపాలి
- సమస్యల పరిష్కారానికి మిల్లర్ల డిమాండ్

## తెలంగాణ బిడ్డలకు సీఎం క్షమాపణ చెప్పాలి

### కేటీఆర్ డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణ బిడ్డల స్థానికతను ప్రశ్నార్థకం చేసిన సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థుల అడ్మిషన్ల విషయంలో ప్రభుత్వం ఇంకా మొద్దు నిద్ర ప్రదర్శిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అనాలోచితంగా తెచ్చిన జీవో 33పై ప్రతిష్ఠంభన నెలకొన్నదని విమర్శించారు. ఇతర రాష్ట్రాల్లో మెడికల్ అడ్మిషన్ల ప్రక్రియ చివరి దశకు చేరినా రాష్ట్రంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొన్నదని పేర్కొన్నారు. అక్టోబర్ 31లోపు అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేయకపోతే విద్యార్థులకు తీరని నష్టం జరుగుతుందన్న సోయి కూడా కాంగ్రెస్ సర్కారుకు లేకపోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య విద్యార్థుల అడ్మిషన్ల విషయంలో కాంగ్రెస్ సర్కారు క్షమించరాని నేరం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కండ్లు తెరిచి అడ్మిషన్ల ప్రక్రియను యుద్ధప్రాతిపదికన చేపట్టి నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే అడ్మిషన్ల ప్రక్రియను అస్తవ్యస్తం చేసిందని ధ్వజమెత్తారు. అనాచితంగా, అనవసరంగా తెచ్చిన జీవో 33పై విద్యార్థులకు సీఎం క్షమాపణ చెప్పాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్య వైఖరి వల్ల ఒక్క విద్యార్థికి నష్టం జరిగినా బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

#### దొంగలు పడ్డ ఆరు నెలలకు

అమృత్ పథకం టెండర్ల అవినీతిపై కేంద్రమంత్రి బండి సంజయ్ స్పందన 'దొంగలు పడ్డ ఆరు నెలలకు..' అన్నట్టు ఉన్నదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఎక్స్‌వేదికగా బండికి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బండి సంజయ్ హోం శాఖ మంత్రి అన్న విషయాన్నీ మరచారని ఎద్దేవా చేశారు. అమృత్ స్కీంలో అవినీతి జరిగిందని బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి మొత్తుకుంటే బండి సంజయ్ పాలు తాగుతున్న దొంగపిల్లిలా కన్వీనియంట్‌గా కండ్లు మూసుకున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని అన్ని విధాలా వెనుకేసుకొస్తున్న బీజేపీ తీరును, కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారనే విషయం గుర్తుంచుకోవాలని సూచించారు.



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో సబితా ఇంద్రారెడ్డి, మాధవరం కృష్ణారావు, మాగంటి గోపీనాథ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

## కేసీఆర్ విజన్‌తోనే అభివృద్ధి

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో కేసీఆర్ విజన్‌తోనే అభివృద్ధి సాధ్యమైందని తెలిపారు. రాష్ట్రమంతా కేసీఆర్ నాయకత్వం కావాలని ప్రజలకు కోరుకుంటున్నారని అన్నారు. హైడ్రా బాధితులు ఏడుస్తున్నారని, పేద వారిని పగబట్టినట్టుగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, మాగంటి గోపీనాథ్, బీఆర్ఎస్ నేత పీ కార్తీక్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సాయిబాబా, నాగేందరగౌడ్, కార్పొరేటర్లు సింధుఆదర్శ్‌రెడ్డి, జూపల్లి సత్యనారాయణ, పురుషోత్తం యాదవ్, రవియాదవ్, హరీశ్, కిరణ్‌యాదవ్ పాల్గొన్నారు.

> ప్రభుత్వానికి దమ్ముంటే ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న పట్నం మహేందర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీల ఇండ్లు, ఫామ్‌హౌస్‌లు కూలగొట్టాలి. పేదలకు ఎవరూ అండగా లేరని వారిపై దౌర్జన్యాలు చేస్తారా?
> -కేటీఆర్

# ఓట్లేయలేదనే కూల్చివేతలు

మొదటిపేజీ తరువాయి...

నోటీసు ఇచ్చినట్టు డ్రామా ఆడి స్టే తెచ్చుకునేటట్టు చేశారని పేర్కొన్నారు. కానీ, గరీబోళ్ల సామాన్లు, పుస్తకాలు తీసుకుంటామంటే మాత్రం వారికి సమయం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ కన్‌స్ట్రక్షన్ చేస్తే ఈయన (రేవంత్‌రెడ్డి) డిస్ట్రక్షన్ చేస్తున్నాడని విమర్శించారు. తాము డబుల్ బెడ్రూంలు, ఫ్లై ఓవర్లు, ఎస్టీపీలు కడితే ముఖ్యమంత్రి 9 నెలల్లో బెదిరింపులు, కూలగొట్టుడు, బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని మండిపడ్డారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రూ. 12వేల కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేశామని గుర్తుచేశారు.

#### అనుమతులు ఇచ్చిన వారిపై కేసులు పెట్టాలి

సినీ నటుడు నాగార్జునకు సంబంధించిన నిర్మాణాన్ని కూల్చివేయడం మంచిదే కానీ, దానికి అనుమతులు ఇచ్చినదెవరని కేటీఆర్ ప్రశ్నించారు. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వమే దానికి అనుమతులు ఇచ్చిందని తెలిపారు. అనుమతి ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో చెరువులను మాయం చేసింది కాంగ్రెస్ కాదా? అని ప్రశ్నించారు. ఆక్రమణలను బీఆర్ఎస్ ప్రోత్సహించిందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వానికి దమ్ముంటే ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న పట్నం మహేందర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీల ఇండ్లు, ఫామ్‌హౌస్‌లు కూలగొట్టాలని సవాలు విసిరారు. పేదలకు అండగా ఉండేందుకు త్వరలోనే హైదరాబాద్ ఎమ్మెల్యేలతో మీటింగ్ పెడతామని తెలిపారు.

#### ఉప ఎన్నికల్లో గెలుపు పక్కా

ప్రతిపక్షంలో ఉన్నా శేరిలింగంపల్లి కార్యకర్తల్లో ఎంతో కసి కనిపిస్తున్నదని, ఇక్కడ వచ్చే ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాల్సిన అవసరం ఉన్నదని కేటీఆర్ పేర్కొన్నారు. పార్టీ ఏం తక్కువ చేసిందని పార్టీ మారావని గాంధీని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొట్టుకున్నారని మంత్రి శ్రీధర్‌బాబు అతి తెలివి ప్రదర్శిస్తున్నారని, మరి శేరిలింగంపల్లి ఎమ్మెల్యేకు కాంగ్రెస్ కండువా కప్పిందెవరని ప్రశ్నించారు. మనమూ కాదని, వారూ కాదని.. చివరికి పార్టీ మారిన ఎమ్మెల్యేల బతుకు ఎటూ కాకుండా పోయిందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇంటింటికీ తిరిగి వారి కాళ్లు పట్టుకుని పార్టీలో చేర్చుకున్న సన్నాసి ఎవరో చెప్పాలని శ్రీధర్‌బాబును ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో చేరిన 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బతుకు జూబ్లీ బస్టాండ్ అయిందని పేర్కొన్నారు. హైకోర్టు తీర్పుతో వారికి దడ మొదలైందని తెలిపారు. అందుకే నీతి బాహ్యమైన పనులు చేస్తున్నారని, దమ్ము, ధైర్యముంటే తాము ఎమ్మెల్యేలను చేర్చుకున్నామని చెప్పాలని సవాలు విసిరారు. ఉప ఎన్నికలు రాకుం డా చేస్తున్న దిక్కుమాలిన రాజకీయాలను ప్ర జలు, ఢిల్లీ కాంగ్రెస్ నేతలు చూస్తున్నారని తెలిపారు.

#### సీఎం సీటుకే భరోసా లేదు

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అవ్వాతాతల పెన్షన్‌ను రూ.4 వేలు చేస్తానని చెప్పారని, కానీ ఉన్న రెండువేలకే దిక్కులేకుండా పోయిందని కేటీఆర్ పేర్కొన్నారు. గెలిచిన మరుసటి రోజే 2 లక్షల రుణమాఫీ చేస్తానని, 49 వేల కోట్ల రుణమాఫీని రూ.12 వేల కోట్లతో సరిపెట్టే ప్రయత్నం చేసున్నాడని సీఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసా అన్నాడని, కానీ అసలు సీఎం కుర్చీకే భరోసా లేని పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. ఖమ్మం బాంబో.. నల్లగొండ బాంబో.. ఏది వచ్చి మీదపడుతుందో తెలియక భయంతో బతుకుతున్నాడని పేర్కొన్నారు. ఆడపిల్లల పెండ్లికి తులం బంగారం అన్నాడని.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పెండ్లి చేసుకున్న ఆడపిల్లలందరికీ బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. యువకులకు తాము ఉద్యోగాలు ఇవ్వలేదన్నట్టుగా ఒకే అబద్ధాన్ని వందలసార్లు చెప్పి యువతను నమ్మించాడని, రాహుల్‌గాంధీని అశోక్‌నగర్‌కు తీసుకొచ్చి ఏటా 2 లక్షల ఉద్యోగాలంటూ నమ్మబలికారని, కానీ బీఆర్ఎస్ ఇచ్చిన ఉద్యోగాలను తామే ఇచ్చామంటూ నోటికి వచ్చిన సంఖ్య చెబుతున్నాడని పేర్కొన్నారు. నోటిఫికేషన్ ఎప్పుడు ఇచ్చావంటే కేసీఆర్‌ను తిడుతూ దబాయించి బెదిరిస్తున్నాడని తెలిపారు.

#### ఎటుచూసినా కేసీఆర్ ఆనవాళ్లే

కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని మాట్లాడుతున్నారని, సచివాలయం, అంబేద్కర్ విగ్రహం, కమాండ్ కంట్రోల్ సెంటర్, 36 ఫ్లై ఓవర్లు, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి ఇలా ఎక్కడ చూసినా కేసీఆర్ ఆనవాళ్లే కనిపిస్తాయని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ ఉన్నన్ని రోజులు కేసీఆర్ కనిపిస్తూనే ఉంటాడు బాబూ చిట్టినాయుడూ అని ఎద్దేవా చేశారు. అయ్యప్ప సొసైటీలో తిరుపతిరెడ్డి ట్యాక్స్ వసూలు చేస్తున్నారని, 500 గజాలకు రూ.10 లక్షలు, 1000 గజాలకు రూ.18 లక్షలు వసూలు చేస్తున్నారని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ గతంలో చెప్పాడని గుర్తుచేశారు. తిరుపతిరెడ్డి ఆఫీసుకు వెళ్తే కమిషన్లు, సెటిల్‌మెంట్ల దందా నడిపిస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యేనే చెప్పాడని అన్నారు. చిట్టినాయుడు అన్నదమ్ములు ఏడుగురు మొత్తం తెలంగాణను పంచుకున్నారని, చిట్టినాయుడుకు సంబంధించిన వాళ్లంతా తెలంగాణలో స్వైరవిహారం చేస్తూ దోచుకుంటున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి బంధువులు, సీఎం చేస్తున్న దౌర్జన్యాలతో తెలంగాణలో రియల్ ఎస్టేట్ ఢమాల్ అన్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి, ఆయన కుటుంబ సభ్యులు చేస్తున్న ఘాతుకాలు, భూదందాలు, బిల్డర్లను బెదిరించడం, హైడ్రా పేరు మీద వసూళ్లు చేస్తున్నారని అన్నారు. ఇప్పటి వరకు ఈ సీఎం ఢిల్లీకి 22 సార్లు పోయాడని, రాష్ట్రంలో మాత్రం ఒక్క కొత్త పథకం కూడా పెట్టలేదని, వందరోజుల్లో అన్ని హామీలు అమలు చేస్తానని చెప్పాడని, మరి ఒక్కటైనా చేశాడా అని ప్రశ్నించారు.

#### కేసీఆర్ కావాలంటున్నారు

శేరిలింగంపల్లి కార్యకర్తలు బాధపడాల్సిన అవసరం లేదని, శేరిలింగంపల్లిలో ఉప ఎన్నిక వస్తదని, మీ దాంట్లో నుంచే ఒకరు ఎమ్మెల్యే అవుతారని, కొత్తగా ఎవరు రారని కేటీఆర్ పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకులకు ఏ బాధ వచ్చినా ఒక్క ఫోన్‌కాల్‌తో వస్తామని, కొత్తగా కమిటీలు వేసుకుందామని, పార్టీ మారిన వాళ్లు బాధపడుతూ మళ్లీ వస్తామని చెబుతున్నారని, కేసీఆర్ యాదికి వస్తున్నాడని అని ఒక ముస్లిం సోదరుడు మాట్లాడుతున్నాడని తెలిపారు. జేసీబీ వచ్చి ఇండ్లు కొట్టేస్తుంటే కేసీఆర్ నువ్వు రావాలని మరొక సోదరుడు అంటున్నాడని చెప్పారు. రాష్ట్రం మొత్తం మళ్లీ కేసీఆర్ రావాలని కోరుకుంటున్నారని, ఆ సం దర్భం ఎంతో దూరంలో లేదని పేర్కొన్నారు. పదేండ్లు మత కల్లోలాలు లేకుండా, పేదవాళ్లను కడుపులో పెట్టుకొని చూసుకున్నామని చెప్పారు.

### తిరుపతిరెడ్డీ.. ఆ కిటుకేందో పేదలకు చెప్పు

'అనుముల తిరుపతిరెడ్డి గారు.. ఎల్‌కేజీ చదివే వేదశ్రీకి తన పుస్తకాలు తీసుకునే సమయం కూడా హైడ్రా ఇవ్వలేదు. 50 ఏండ్ల కస్తూరిబాయి తన జీవనాధారమైన చెప్పుల దుకాణం కోల్పోయింది. 72 గంటల క్రితమే కొన్న ఇల్లు నేలమట్టమైంది. వారం ముందు గృహ ప్రవేశం చేసుకున్న ఇల్లు అన్ని కాగితాలు ఉన్నా పేక మేడలా కూలింది. తిరుపతిరెడ్డి గారు.. క్షణం కూడా సమయం ఇచ్చే ప్రసక్తే లేదన్న హైడ్రా మీ విషయంలో నోరు మెదపలేదు. వాల్టా అనుకుంటా.. ఏకంగా మీకు 30 రోజుల టైం ఇచ్చింది. కోర్టులో స్టే సంపాదించుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న కూల్చివేతల రావణకాష్టంలో మట్టి కూడా అంటనిది బహుశా మీకు మాత్రమేనేమో! మీ సోదరుడి బుల్డోజర్ల కింద నలిగిపోతున్న సామాన్యులకు ఆ కిటుకేదో చెప్పండి! నాకు తెలిసి అతీతశక్తి మీకేదైనా ఉందా? లేక ఏదైనా రహస్య ఆయుధాన్ని కలిగి ఉన్నారా అనుముల తిరుపతిరెడ్డి గారు! మీకు ఉన్న అతీంద్రియ శక్తుల గురించి పేదలకు కూడా చెప్పండి. ఇప్పటికైతే ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగమే అత్యంత శక్తివంతమైందని మేము మాత్రం బలంగా విశ్వసిస్తున్నాం' అని కేటీఆర్ ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు.

> చిట్టినాయుడు అన్నదమ్ములు ఏడుగురు మొత్తం తెలంగాణను పంచుకున్నారు. చిట్టినాయుడుకు సంబంధించిన వారంతా తెలంగాణలో స్వైరవిహారం చేస్తూ దోచుకుంటున్నారు.
> -కేటీఆర్

> బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇంటింటికీ తిరిగి వారి కాళ్లు పట్టుకుని పార్టీలో చేర్చుకున్న సన్నాసి ఎవరో శ్రీధర్‌బాబు చెప్పాలి. కాంగ్రెస్‌లో చేరిన పదిమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బతుకు జూబ్లీ బస్టాండ్ అయింది. హైకోర్టు తీర్పుతో వారి గుండెల్లో దడ మొదలైంది.
> - కేటీఆర్

### పేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాలి

పేదవాళ్లకు ఎవరూ అండగా లేరని వారిపై దౌర్జన్యం చేస్తారా? ఆ పేదలే దిక్కులేక నాలాలపై ఇండ్లు కట్టుకుంటారు. మానవత్వం ఉన్న ప్రభుత్వమైతే తొలుత వారికి నోటీసులు ఇవ్వాలి. లేదంటే వారికి వేరే చోట ఇండ్లు ఇవ్వాలి. తెలంగాణలో శిఖం పట్టాలు, ఏక్ ఫస్లా పట్టాలు ఉంటాయి. హైదరాబాద్ పరిధిలో మేం లక్ష డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టిచ్చినం. అందులో 40 వేల ఇండ్లు ఖాళీగా ఉన్నాయి. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే హైడ్రా బాధిత పేదలకు వాటిని ఇవ్వాలి. – కేటీఆర్

> హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా ఇవ్వలేదనే ఆటోడ్రైవర్లు, బస్తీవాసులు, పేదలపై సీఎం పగబట్టి ఇండ్లు కూల్చేస్తున్నడు.
> -కేటీఆర్

## అధిక పాలసేకరణ ధరతోనే నష్టాలు

### పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి



ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 24: ఇతర డెయిరీలతో పోలిస్తే విజయ డెయిరీలో పాల సేకరణ ధర కనీసం రూ.పది ఎక్కువగా ఉందని, దానితోనే నష్టాలని రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి పేర్కొన్నారు. సమాఖ్య చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం లాలాపేటలో విజయడెయిరీ ప్రధాన కార్యాలయంలో ఆయన తొలిసారిగా విలేకరులతో మాట్లాడారు. పాడి రైతుల శ్రేయస్సే తన ప్రథమ ప్రాధాన్యమని, విజయ డెయిరీని అగ్రగామిగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇటీవలే రూ.50 కోట్లను విజయ డెయిరీకి మంజూరు చేసిందని, రైతులకు ఉన్న బకాయిలను త్వరలోనే చెల్లిస్తామని చెప్పారు. యాభై ఏళ్లకుపైగా ఉన్న డెయిరీ చరిత్రలో ప్రభుత్వం నుంచి ఒకేసారి రూ.50 కోట్లు సొమ్ము విడుదల కావడం మొదటిసారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, దవాఖానలు, దేవాలయాలు, జైళ్లు, సింగరేణి, ఐసీడీఎస్ తదితర అన్ని ప్రభుత్వ సంస్థలలో విజయ డెయిరీ పాల ఉత్పత్తులే వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించిందని తెలిపారు. తిరుపతి ప్రసాదంలో నెయ్యి వివాదం తలెత్తిన నేపథ్యంలో, తాము నాణ్యమైన నెయ్యిని సరఫరా చేసేందుకు ఆసక్తి వ్యక్తం చేస్తూ టీటీడీ బోర్డుకు లేఖ రాశామని చెప్పారు. రూ.750 కోట్లుగా ఉన్న విజయ డెయిరీ టర్నోవర్‌ను రూ.1500 కోట్లకు పెంచడమే లక్ష్యంగా పనిచేస్తానని మరోసారి స్పష్టంచేశారు.




## బకాయిల విడుదల ఉత్తమాటే

### ఒక్క పైసా కూడా రైతులకు చెల్లించని వైనం

### రేపు ఇందిరాపార్క్ వద్ద పాడి రైతుల ధర్నా

హైదరాబాద్, సెప్టెంబర్ 24(నమస్తే తెలంగాణ): పాడిరైతులకు మంగళవారం రూ. 50 కోట్ల పాల బకాయిలను చెల్లిస్తామని విజయ డెయిరీ చేసిన ప్రకటన ఉత్తమాటగానే మిగిలిపోయింది. విజయ డెయిరీ ఎండీ ఇచ్చిన మాట ప్రకారం మంగళవారం రాత్రి వరకు నయా పైసా కూడా రైతుల ఖాతాల్లో జమ కాలేదు. పాడి రైతులకు సుమారు 150 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న పాడి రైతులు ఇందిరాపార్క్ వద్ద ధర్నాకు పిలుపునిచ్చారు. దీంతో దిగొచ్చిన ప్రభుత్వం 50 కోట్లు చెల్లించేందుకు నిర్ణయించింది. ఎలాంటి ఆందోళనలో పాల్గొనవద్దని రైతులకు సూ చించింది. ధర్నాకు రైతులు రాకుండా చేయాలనే కుట్రతో ఈ తప్పుడు ప్రకటన చేశారని పాడిరైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ప్రకటనలు మానుకోవాలని, వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

## 'మెగా'పై దగా!

మొదటిపేజీ తరువాయి...

విమర్శలు వస్తున్నాయి. మెయింటనెన్స్ నిధులివ్వడం లేదని తెలిసింది.

#### ప్రైవేటుకు ధారాదత్తం

అత్యంత సాంకేతికతతో నిర్మించిన విజయ మెగా డెయిరీపై పొరుగు రాష్ట్రం పెద్దల కన్ను పడినట్టుగా తెలిసింది. రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదువనా అన్నట్టుగా మెగా డెయిరీని సదరు పెద్దలకు రాసిచ్చేందుకు ప్రయత్నాలను మొదలుపెట్టారు. కుక్కను చంపేముందు పిచ్చిదని ముద్ర వేస్తే దాన్ని చంపడం తేలిక అనే నానుడిని మెగా డెయిరీకి వర్తింప చేస్తున్నట్టుగా తెలిసింది. మెగా డెయిరీ బాగా పని చేస్తే విజయ డెయిరీ కూడా అభివృద్ధిలోకి వస్తుంది. అప్పుడు మెగా డెయిరీని వారికి రాసివ్వడం కుదరకపోవచ్చు. ఈ నేపథ్యంలో మెగా డెయిరీని నిర్లక్ష్యం చేసి అది పని చేయకుండా కుట్రలు చేస్తున్నట్టుగా తెలిసింది. అదే జరిగితే విజయ డెయిరీకి ఉపయోగపడాల్సిన మెగా డెయిరీ భారీ భారమై కూర్చుంటుంది. దీన్ని సాకుగా చూపి నష్టాల్లో ఉందనే సాకుతో తమ వారికి కట్టబెట్టేలా పావులు కదుపుతున్నట్టుగా జోరుగా చర్చ జరుగుతున్నది.

# ఇక ఊరూరా లిక్కర్ మాల్స్?

- ప్రతి 14 వేల మందికో దుకాణం
- ఆదాయం పెంచుకోవడం, పార్టీ నేతలను సంతృప్తి పరచడమే లక్ష్యం
- ఒకట్రెండు రోజుల్లో ప్రభుత్వానికి ఎక్సైజ్ నివేదిక?
- ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న మద్యం షాప్‌లు 2,620
- మరో 10,680 దుకాణాల ఏర్పాటుకు సన్నాహాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 24(నమస్తే తెలంగాణ): మద్యం ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచుకోవడంతోపాటు అధికార పార్టీ నాయకులను సంతృప్తి పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఎత్తులు వేస్తున్నది. అడిగిందే తడవుగా లేదనకుండా ఏ4 ఎలైట్ మద్యం మాల్స్‌కు లైసెన్స్‌లు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నది. ఇప్పటికే ఎక్సైజ్ శాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం మధ్య సమాలోచనలు పూర్తి అయ్యాయి. ఇందుకోసం ఎక్సైజ్ నిబంధనల్లో ఉన్న జాతీయ నిష్పత్తి అనే అంశాన్ని అధికారులు తెరమీదకి తెచ్చారు. ఈ నిష్పత్తిని అమల్లోకి తెస్తే రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా పదివేలకు పైగా మద్యం దుకాణాలు తెరచుకోనున్నాయి. గత ప్రభుత్వం 2023 ఆగస్టులోనే ఏ4 మద్యంషాపులకు లైసెన్స్‌ల జారీ కోసం నోటిఫికేషన్ ఇచ్చి టెండర్లు కూడా ఖరారు చేసింది. గత సంవత్సరం డిసెంబర్ ఒకటో తేదీ నుంచి ఏ4 లైసెన్స్‌లు అమల్లోకి వచ్చాయి. ఇదే నెలలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. కొత్త మద్యం దుకాణాలు తెరవకుండా ఆపడానికి కొత్త ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేసింది కానీ, పాలసీ నిబంధనలు అంగీకరించలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడేనాటికే పాలసీ అమల్లోకి వచ్చింది కాబట్టి, నిబంధనల ప్రకారం 2025 నవంబర్ 31 వరకు పాత పాలసీ అమలులో ఉంటుంది. అప్పటివరకు కొత్తం మద్యం దుకాణాల ఏర్పాటుకు అవకాశం లేదు. దీంతో అధికారం చేతులో ఉండి కూడా మద్యం వ్యాపారం చేసుకోలేకపోతున్నామనే అంతర్మథనం అధికార పార్టీ నాయకుల్లో రోజురోజుకు పెరిగిపోతూ వచ్చింది. ఇదే అంశాన్ని ముఖ్య నేత దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గాలపై కసరత్తు చేయాలని 'ముఖ్య' నాయకుడు ఎక్సైజ్ అధికారులను ఆదేశించినట్టు సమాచారం. నిబంధనలు తిరగేసిన అధికారులు ఇప్పుడున్న ఎక్సైజ్ చట్టాలప్రకారం ఒక్క దుకాణం కానీ, ఒక్క బార్ కానీ అదనంగా ఇవ్వడానికి అవకాశం లేదని తేల్చి చెప్పినప్పటికీ, తమకు దుకాణాలు ఇవ్వాల్సిందేనని అధికార పార్టీ నేతలు పట్టుబడుతున్నట్టు తెలిసింది.

#### న్యాయపరమైన చిక్కులు లేకుండా..

ఈ నేపథ్యంలో అధికారులు ఎక్సైజ్ నిబంధనల్లో ఉన్న జాతీయ నిష్పత్తి అంశాన్ని తెరమీదకు తెచ్చారు. దీని ప్రకారం ప్రతి 14 వేల మంది జనాభాకు ఒక మద్యం దుకాణాలు ఏర్పాటు చేయొచ్చని ఎక్సైజ్ అధికారులు నిర్ధారించారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ పాలసీని రూపొందించాల్సిన అవసరం కానీ, క్యాబినెట్ సబ్ కమిటీ ఆమోదం కానీ అవసరం లేకుండా నేరుగా మద్యం దుకాణాలను అనుమతించవచ్చు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర జనాభా 3.5 కోట్లు. ఈ లెక్కల ప్రకారం 13,300 మద్యం దుకాణాల ఏర్పాటుకు అర్హత ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 2,620 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఇవి పోనూ కొత్తగా 10,680 మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడానికి అవకాశం ఉన్నట్టు ఎక్సైజ్ శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి ఒక రహస్య నివేదిక ఇచ్చినట్టు సమాచారం. ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం న్యాయ సలహా కోసం పంపగా వారు కొన్ని సూచనలు చేసినట్టు తెలిసింది.

- బెల్ట్ షాపులు బంద్ చేయాలంటూ ధర్నా



బెల్టు షాపులు బంద్ చేయాలని డిమాండ్ చేస్తూ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం కోసిని గ్రామ మహిళలు మంగళవారం ప్రధాన రోడ్డుపై ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రమేశ్, పోలీసు అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామస్థులు, బెల్టు షాపు నిర్వాహకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. – కాగజ్‌నగర్

### ఎక్సైజ్ లక్ష్యం 45 వేల కోట్లు

మరోవైపు, గతంలో ఎక్సైజ్‌శాఖ ఆదాయ వనరుల సమీకరణపై ఏర్పాటైన మంత్రివర్గం ఉపసంఘం నిధులు ఎలా పెంచాలనే అంశంపై సుదీర్ఘంగా చర్చించింది. ఆరు గ్యారెంటీలకు సంబంధించిన నిధులు కూడా మద్యం నుంచే రాబట్టాలని ఎక్సైజ్ అధికారులకు దిశానిర్దేశం చేసినట్టు తెలిసింది. ప్రస్తుతం రాష్ట్రంలో 2,620 ఏ4 మద్యం దుకాణాలు, 1,200 బార్లు, క్లబ్బులు ఉన్నాయి. వీటి ద్వారా మద్యం క్రయ విక్రయాలు, అన్ని రకాల సుంకాలు కలుపుకొని రాష్ట్ర ఖజానాకు 2022లో రూ.32 వేల కోట్లు, 2023లో రూ.35 వేల కోట్ల ఆదాయం సమకూరింది. ప్రభుత్వం ఈ లక్ష్యాన్ని అదనంగా రూ.10 వేల కోట్లకు పెంచి.. రూ.45 వేల కోట్లు రాబట్టాలని మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది.



### సీఎం ఇలాకాలో బాలికల అవస్థలు

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం కుదురుమల్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లను నిర్మించారు. బిల్లు మంజూరు కాలేదని కాంట్రాక్టర్ మంగళవారం మరుగుదొడ్లకు తాళం వేయడంతో విద్యార్థినులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. సీఎం ఇలాకాలో ఈ దుస్థితి నెలకొనడంపై విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు. – కొడంగల్



# ధాన్యం దించుకోం!

### ప్రభుత్వానికి మిల్లర్ల అల్టిమేటం

- అన్ని జిల్లాల్లో కలెక్టర్లకు వినతిపత్రాలు
- సన్న ధాన్యంతో 67% సీఎంఆర్ ఇవ్వలేం
- మిల్లులపై దాడులు, వేధింపులు ఆపాలి
- సమస్యల పరిష్కారానికి మిల్లర్ల డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 24(నమస్తే తెలంగాణ): రైతుల నుంచి వానకాలం ధాన్యం కొనుగోలుకు ఇబ్బందులు తప్పేలా లేవు. సివిల్ సప్లై సేకరించిన ధాన్యాన్ని మిల్లుల్లో దించుకోబోమని రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. సన్న బియ్యం సీఎంఆర్, బకాయిలతో పాటు వేధింపుల సమస్యలు పరిష్కరించే వరకు ఎట్టిపరిస్థితుల్లోనూ ధాన్యం తీసుకోబోమని స్పష్టంచేశారు. ఈ మేరకు అన్ని జిల్లాల్లో రైస్ మిల్లర్ల అసోసియేషన్ తరుపున కలెక్టర్లకు వినతిపత్రాలు అందిస్తున్నారు. ఇప్పటికే తమ సమస్యలను సివిల్ సప్లై ఉన్నతాధికారులకు విన్నవించామని, కానీ ఎలాంటి పరిష్కారం లభించలేదని మిల్లర్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ధాన్యం దించుకోవద్దనే నిర్ణయానికి వచ్చినట్టుగా చెబుతున్నారు. మిల్లర్ల అల్టిమేటం నేపథ్యంలో అక్టోబర్ మొదటివారం నుంచి ప్రారంభమయ్యే కొనుగోలుపై ప్రభావం చూపే అవకాశం ఉంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ధాన్యం కొనుగోళ్లు కష్టమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నా యి.

#### 67శాతం సీఎంఆర్ ఇవ్వలేం

సన్నధాన్యం దించుకోవడం, సన్నధాన్యానికి 67శాతం సీఎంఆర్ ఇవ్వడంపై మిల్లర్లు ప్రధానంగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ సీజన్ నుంచి సన్న ధాన్యానికి రూ. 500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. జనవరి నుంచి రేషన్‌లో సన్నబియ్యం పంపిణీ చేస్తామని కూడా హామీ ఇచ్చింది. ఇక్కడే అసలు సమస్య ప్రారంభమైంది. రైతుల నుంచి సేకరించిన సన్న ధాన్యాన్ని సివిల్ సప్లై మిల్లర్లకు ఇస్తుంది. నిబంధనల ప్రకారం మిల్లర్లు సన్నధాన్యం రా రైస్‌కు 67శాతం సీఎంఆర్(100 కిలోల ధాన్యానికి 67కేజీల బియ్యం) ఇవ్వాలి. కానీ సన్న ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తే 55-58 కేజీలు మాత్రమే బియ్యం వస్తాయని మిల్లర్లు చెబుతున్నారు. మిగిలిన 9 నుంచి 12 కేజీల సన్న బియ్యంను తాము ఏ విధంగా ఇవ్వాలని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో 17శాతం తేమతో సన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తారని, 45 రోజులకు మించి నిల్వ చేయలేమని చెబుతున్నారు.

## రైస్ మిల్లులపై సివిల్ సప్లై దాడులు

జనగామ, సెప్టెంబర్ 24 (నమస్తేతెలంగాణ)/గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని అప్పరాజుపల్లి, జనగామలోని దేవరుప్పుల మండలం మన్‌పహాడ్‌పల్లిలోని రైస్ మిల్లులపై సివిల్ సప్లై అధికారులు మంగళవారం దాడులు జరిపారు. ఈ దాడుల్లో మొత్తం రూ.14.67 కోట్ల సీఎంఆర్ గల్లంతైనట్టు గుర్తించి, క్రిమినల్ కేసులకు సిఫారసు చేశారు. అప్పరాజులపల్లి శ్రీరాజరాజేశ్వరి మిల్లులో సివిల్ సప్లై అధికారులతోపాటు గూడూరు తహసీల్దార్, టాస్క్‌ఫోర్స్ ఎస్సైలు తనిఖీ చేసి రూ.9 కోట్ల 56 లక్షల 73 వేల ధాన్యం దుర్వినియోగమైనట్టు ప్రాథమికంగా గుర్తించారు. మన్‌పహాడ్ శ్రీసాయిరాం మాడ్రన్ బిన్నీ రైస్‌మిల్లులో రూ.5.67 కోట్ల విలువైన 1,774.071 మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్లింగ్‌ను దారి మళ్లించినట్టు తేల్చారు. జిల్లా అధికారుల తనిఖీలో రైస్ మిల్లుల్లో ధాన్యం నిల్వలు మాయమైనట్టు తేలడంతో యజమాని పీ చంద్రశేఖర్‌రెడ్డిపై మంగళవారం దేవరుప్పుల పోలీస్ స్టేషన్‌లో అధికారులు ఫిర్యాదు చేశారు. రైస్ మిల్లర్, అతని కుటుంబసభ్యుల పేరిట ఉన్న ఆస్తులపై లావాదేవీలను అనుమతించవద్దని జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్లకు లేఖ రాశారు. దాడుల్లో టీసీఎస్‌వో ప్రేమ్‌కుమార్, జిల్లా సివిల్ సప్లై అధికారి కృష్ణవేణి, తహసీల్దార్ శ్వేత, ఏఎస్‌వో రమేశ్, టాస్క్‌ఫోర్స్ ఎస్సై కృష్ణ, ఆర్ఐ మల్లయ్య పాల్గొన్నారు.

# అసైన్డ్ భూంఫట్!

మొదటిపేజీ తరువాయి...

నుంచే దూసుకుపోనున్నాయి. మరి.. పడావు పడిన ఆ భూముల్లో ఇప్పుడు సిరులు పండి పేదోళ్లు పెద్దోళ్లు కావాలి. అదే జరిగితే బ్రహ్మాండం బద్దలై... భూమి–ఆకాశం ఏకమవుతుంది కదా. అందుకే ఆ విపత్తు రాకుండా పెద్దోళ్లు రంగంలోకి దిగారు. పేదోళ్ల చేతుల్లో భూములను మాయం చేస్తున్నారు. అడ్డికి పావుసేరులా అనధికారికంగా కొనుగోలు చేస్తున్నారు. ఇలా ఒకటీ అరా కాదు సుమా! గత నాలుగైదు నెలల్లోనే వందల ఎకరాల అసైన్డ్, సీలింగ్ భూములను కొందరు పెద్దలు బినామీ పేర్లతో పాటు సూట్‌కేస్ కంపెనీల పేరిట చెరపడుతున్నారు. ఒకవైపు హైదరాబాద్‌లో రియల్ రంగం వెలవెలబోతూ, హైడ్రా బుల్డోజర్లు హడావుడి చేస్తుంటే.. మరోవైపు పాలకులు ప్రకటించిన ఫోర్త్ సిటీ పరిధిలో మాత్రం నిబంధనలకు పాతర వేస్తూ పేదోళ్ల భూముల్లో పెద్దలు వాలిపోతున్నారు. ఇందుకు సర్వీసులో ఉన్న వారితో పాటు పదవీ విరమణ పొందిన పలు శాఖల ఉన్నతాధికారులూ అతీతం కాకపోవటం శోచనీయం.

### పేదోళ్ల భూములన్నీ పెద్దోళ్లపరం

గత 9 నెలలుగా రాష్ట్రంలో రియల్–నిర్మాణ రంగం కుదేలైందని సర్వేలు ఘోషిస్తున్నాయి. ట్రై సిటీల్లో ఒక్క మెగా నిర్మాణ ప్రాజెక్టు మొదలైన దాఖలాలు లేవు. ఇక్కడ రియల్–నిర్మాణ రంగం దివాలా తీస్తే.. ఫోర్త్ సిటీలో మాత్రం అనధికారిక రియల్ రంగం మాత్రం జోరు మీదున్నది. గత నాలుగైదు నెలలుగా గుట్టుగా సాగుతున్న ఈ భూ దందాలో పేదోళ్ల భూములన్నీ పెద్దోళ్ల పరం అవుతున్నాయి.

- ఫోర్త్ సిటీ పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబరు 9లో వందల ఎకరాల్లో అసైన్డ్ భూములు ఉన్నాయి. వీటికి ఇప్పటికే రేటు నిర్ధారించి, అడ్వాన్స్ కూడా చెల్లించినట్టు తెలిసింది. ప్రభుత్వ పెద్ద ఒకరు ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారనే ప్రచారం స్థానికంగా ఉన్నది. బాండ్ పేపరుపై 99 ఏండ్ల లీజు ప్రాతిపదికన భూమి ఇస్తున్నట్టు అసైన్డ్‌దారుల నుంచి ఒప్పంద పత్రం రాయించుకున్నట్టు సమాచారం.
- లేమూరు గ్రామ పరిధిలో 65 ఎకరాల అసైన్డ్ భూములను మాజీ పోలీస్ ఉన్నతాధికారి ఒకరు రూ.కోటికి ఎకరం చొప్పున కొనుగోలు చేసినట్టు తెలిసింది. ఇక్కడే మరో 80 ఎకరాల వరకు అందుబాటులో ఉండటంతో బ్రోకర్లు ఎకరా కోటిన్నరకు ఇప్పించేందుకు బేరసారాలు సాగిస్తున్నారు.
- మహేశ్వరం మండలం సరస్వతిగూడ–లేమూరు దారిలో వంద ఎకరాలకు పైగా అసైన్డ్ భూములు చేతులు మారినట్టు తెలిసింది. ఇక్కడ ఎకరాకు రూ.40–60 లక్షలకు కొంటున్నారు.
- కందుకూరు మండలం మంఖాల్ పరిధిలో ఇప్పటికే 47 ఎకరాల లావణి పట్టా చేతులు మారి పట్టాగా రూపాంతరం చెందిన విషయం తెలిసిందే. వీటికి సమీపంలోనే ఉన్న మరికొన్ని అసైన్డ్ భూములకు కూడా కొందరు పెద్దలు అడ్వాన్స్ ఇచ్చినట్టు తెలిసింది.
- హర్షగూడ, సర్దార్‌నగర్ గ్రామాల్లో కూడా ఇప్పటికే అసైన్డ్ భూములు చేతులు మారాయి.
- ఫోర్త్ సిటీ పరిధిలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ పెద్దకు చెందిన సమీప బంధువు (ఎన్నారై)కు ఏకంగా 600 ఎకరాల భూములు ఉన్నట్టు తెలుస్తున్నది. ఇందులో అసైన్డ్ భూములు కూడా ఉన్నాయి.

### నెమ్మదిగా మారుతున్న రికార్డులు

**కొందరు** ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోనే అసైన్డ్ భూముల కొనుగోళ్ల ప్రక్రియ జోరుగా సాగుతున్నట్టు ఆరోపణలున్నాయి. తొలుత గ్రామంలోని ఒకరిద్దరు బ్రోకర్లను రంగంలోకి దింపి.. రోడ్డువైపున ఉన్న అసైన్డ్ భూముల వారిని మచ్చిక చేసుకుంటున్నారు. వారికి కొంత రేటు ఎక్కువ ఇచ్చి ఒప్పందం చేసుకుంటున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన వెంటనే దాని వెనక భూముల వారిని బ్రోకర్లు సంప్రదిస్తున్నారు. వీరికి తక్కువ ధర చెప్తున్నారు. ఎవరైనా రైతులు ఇవ్వబోమంటే బెదిరింపులకు పాల్పడుతున్నారని రైతులు తెలిపారు. దీంతో తప్పని పరిస్థితుల్లో అమ్ముకోవాల్సి వస్తున్నదని రైతులు వాపోయారు. ఈ ప్రక్రియ 99 ఏండ్ల లీజు ఒప్పందంపై చేస్తున్నారు. అనంతరం రెవెన్యూ కార్యాలయాల్లో ఆ సర్వే నంబర్‌కు సంబంధించిన రికార్డులను మాయం చేస్తున్నట్టు సమాచారం. ఇందులో కొన్ని ఏండ్లుగా పట్టాగా నమోదు అయ్యాయని చూపి.. దాన్ని ఆసరాగా చేసుకొని ఆ భూములన్నీ పట్టాగా మార్చేందుకు పావులు కదుపుతున్నారు.

# కొత్త అలైన్‌మెంట్ వద్దే వద్దు

## ట్రిపుల్ ఆర్ పట్టా భూముల మీదుగా వెళ్తే తీవ్ర నష్టమని రైతుల ఆవేదన

- సుమారు 200 ఎకరాలపాటు కోల్పోతున్నామని ఆందోళన
- అలైన్‌మెంట్ మార్చకపోతే ఉధృతంగా ఉద్యమిస్తామని హెచ్చరిక
- వికారాబాద్ జిల్లా కలెక్టర్‌కు నవాబుపేట్ అన్నదాతల వినతి



ఆర్‌ఆర్‌ఆర్ కొత్త అలైన్‌మెంట్ మార్చాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు వినతిపత్రం ఇస్తున్న నవాబుపేట్ మండల రైతులు

వికారాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): వికారాబాద్ జిల్లా మీదుగా వెళ్లనున్న రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) కొత్త అలైన్‌మెంట్ వద్దేవద్దని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కొత్త అలైన్‌మెంట్‌తో పెద్ద మొత్తంలో పట్టా భూములు కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పాత అలైన్‌మెంట్ 75 శాతం మేర ప్రభుత్వ, బీడు భూముల మీదుగా వెళ్తే.. కొత్త అలైన్‌మెంట్ వల్ల ఒక్క నవాబుపేట్ మండలంలోనే 200 ఎకరాల వరకు పట్టా భూములను కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొందని మండిపడుతున్నారు. కేవలం ప్రభుత్వ పెద్దల కోసం, వెంచర్ల యజమానులకు నష్టం రాకుండా పాత అలైన్‌మెంట్‌ను మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతులకు అన్యాయం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం వికారాబాద్ కలెక్టరేట్ వద్ద నవాబుపేట్ మండల రైతులు ధర్నా చేపట్టారు. ఆర్‌ఆర్‌ఆర్ కొత్త అలైన్‌మెంట్ ప్రకారం ఒకట్రెండు ఎకరాలున్న రైతులు పూర్తిగా భూములను కోల్పోవాల్సి వస్తుందని, వెంటనే కొత్త అలైన్‌మెంట్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కొత్త అలైన్‌మెంట్ ప్రకారం.. వికారాబాద్ జిల్లాలోని పూడూర్, వికారాబాద్, నవాబుపేట్, మోమిన్‌పేట్ మండలాల మీదుగా రీజినల్ రింగ్ రోడ్డు వెళ్లనుందని, ఈ గ్రామాల్లో భూముల ధరలు ఎకరం రూ.కోట్లలో ఉన్నాయని, భూములు కోల్పోతే ప్రభుత్వం అందజేసే అరకొర సాయంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. నవాబుపేట్ మండలంలోని పులిమామిడి, లింగంపల్లి, చీమలదరి, మాదిరెడ్డిపల్లి, నారాగూడెం, పూలపల్లి గ్రామాల్లో ఎకరం రూ.2 కోట్లకుపైగా ఉండటంతో కొత్త అలైన్‌మెంట్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ కొత్త అలైన్‌మెంట్‌ను ఒప్పుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఇక నవాబుపేట్ మండలంలో పూలు, కూరగాయలను అధికంగా సాగు చేస్తారని, పులిమామిడి, లింగంపల్లి, చీమలదరి, మాదిరెడ్డిపల్లి, నారాగూడెం, పూలపల్లి గ్రామాల్లో పండించే కూరగాయలను హైదరాబాద్‌కు తరలిస్తారని, ఈ గ్రామాల్లో ఐదెకరాలలోపు ఉన్న రైతులంతా కూరగాయల సాగుపైనే ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొన్నారు. ఒకవేళ ట్రిపుల్ ఆర్‌లో భూములు కోల్పోతే ఆయా గ్రామాల రైతులు రోడ్డున పడటంతో పాటు హైదరాబాద్‌కు కూరగాయల కొరత కూడా ఏర్పడుతుందని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొత్త అలైన్‌మెంట్‌ను మార్చాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



### మేం ఒప్పుకునేది లేదు

ట్రిపుల్ ఆర్ కొత్త అలైన్‌మెంట్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ ఒప్పుకునేది లేదు. ప్రభుత్వం ముందుకెళ్తే మేం తీవ్రంగా ఉద్యమిస్తాం. పాత అలైన్‌మెంట్ ప్రభుత్వ భూముల మీదుగా వెళ్లింది. ఏం జరిగిందో ఏమో తూర్పువైపు మార్చడంతో పట్టా భూములు కోల్పోవాల్సి వస్తుంది. ఏడాదికి మూడు పంటలు పండే భూములున్నాయి. బావులు, బోర్లు ఉన్నాయి. కేవలం రైతులకే కాదు.. హైదరాబాద్‌కు కూరగాయల కొరత ఏర్పడుతుంది.

*-భూపతిరెడ్డి, పులిమామిడి*



### రోడ్డున పడుతాం

రింగ్‌రోడ్డు పాత అలైన్‌మెంట్‌తో ప్రభుత్వ భూములు, బీడు భూములు పోయేవి. కొత్త అలైన్‌మెంట్‌తో పట్టా భూములు, బోర్లు, బావులు కోల్పోతాం. మాకు వేరే దగ్గర భూము లు లేవు. ఈ భూముల మీదనే ఆధారపడి బతుకుతున్నాం. మాకు ఉన్న ఐదెకరాల భూమిని ట్రిపుల్ ఆర్‌తో కోల్పోతే మా కుటుంబమంతా రోడ్డున పడుతుంది. కొత్త అలైన్‌మెంట్‌ను మార్చి పాత అలైన్‌మెంట్‌ను కొనసాగించాలి.

*-గవ్వల మొగలయ్య, మాదిరెడ్డిపల్లి, నవాబుపేట్ మండలం*



### మాకేం ఆధారం లేదు

మా భూమి దగ్గర సర్వే నంబర్ 172 అని గుర్తు వేశారు. మాకున్న మొత్తం ఐదెకరాల భూమి పోతదని ఇంటిల్లిపాది తిండితిప్పలు లేకుండా ఆందోళనతో ఉన్నాం. చదువుకున్నాం కానీ ప్రభుత్వ ఉద్యోగాలు రాలేదు. మాకు ఉన్న ఐదెకరాలపైనే మా కుటుంబమంతా ఆధారపడి జీవిస్తున్నది. ఏటా మూడు పంటలు పండిస్తున్నాం. ఈ భూములు పోతే మాకేం ఆధారం లేదు. పాత అలైన్‌మెంట్‌ను అమలు చేయాలి.

*-కల్వగురి రాఘవేందర్, మాదిరెడ్డిపల్లి, నవాబుపేట్ మండలం*



### రైతుల జోలికి రావొద్దు


ట్రిపుల్ ఆర్ కోసం పూలపల్లిలో ఎస్–168 నుంచి ఎస్–174 వరకు గుర్తులు వేశారు. మాకు ఆందోళనగా ఉంది. కొత్త అలైన్‌మెంట్‌కు కొద్ది దూరం నుంచే ప్రభుత్వ భూములున్నాయి కాబట్టి.. ప్రభుత్వ భూముల మీదుగా వెళ్తే అందరం ఆహ్వానిస్తాం. పట్టా భూములున్న రైతుల జోలికి రావొద్దు. ఒకవేళ మా డిమాండ్‌ను కాదని సర్కారు ముందుకెళ్తే.. రైతులమంతా ఏకమై పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం.

*-మాణిక్‌రెడ్డి, పూలపల్లి, నవాబుపేట్ మండలం*

# సమస్యల సాధనకు రెండు జేఏసీలు

- ఏకమైన గురుకుల టీచర్ల సంఘాల నాయకులు
- పరిష్కారం కోసం సర్కారుతో సంప్రదింపులు
- వేర్వేరు పద్ధతుల్లో డిమాండ్లు సాధించుకుంటామంటున్న ఇరువర్గ జేఏసీ నాయకులు

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని సంక్షేమ శాఖ గురుకులాల్లో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి గురుకుల టీచర్ల సంఘాలన్ని ఏకమయ్యాయి. వేర్వేరు పద్ధతుల్లో డిమాండ్లు సాధించుకునేందుకు రెండు జేఏసీలుగా ఏర్పడ్డాయి. సమస్యల పరిష్కారానికి సొసైటీలవారీగా పలుమార్లు సెక్రటరీలకు సంఘం సభ్యులు వినతి పత్రాలు అందజేశారు. కాని రాష్ట్రప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుండడంతో, వాటిని సాధించుకునేందుకు గురుకుల టీచర్ల జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ)ని ఏర్పాటు చేసుకుని ప్రభుత్వంతో ఫైట్ చేయాలని నిర్ణయించాయి. ఇక నుంచి ఉమ్మడి పోరాటం చేయనున్నట్టు సంకేతాలు ఇస్తున్నాయి. తెలంగాణ గురుకుల సొసైటీతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లోని సమస్యల పరిష్కారానికి ఒకటి కాదు.. ఏకంగా రెండు జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ)లు ఏర్పాటు కావడం విశేషం. ఇందులో లెఫ్ట్ పార్టీలకు చెందిన వర్గం ఒకటైతే, నాన్ లెఫ్ట్ పార్టీలకు చెందిన వర్గం మరొకటిగా చెప్పుతున్నారు. ఈ సందర్భంగా ఓ వర్గానికి చెందిన జేఏసీ నాయకులు బాలరాజు, రుషికేశ్‌కుమార్, కే సంజీవ్, సైదులు, బాలరాజ్ మాట్లాడుతూ డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వానికి, సంబంధిత శాఖ అధికారులకు వినతి పత్రాలు అందజేస్తామని తెలిపారు.. రెండో జేఏసీ వర్గానికి చెందిన నాయకులు మాట్లాడుతూ.. డిమాండ్ల సాధనకు నిరసన కార్యక్రమాలు చేపడుతామని, అందు లో భాగంగా ఈ నెల 28న 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. కొనసాగింపుగా హైదరాబాద్‌లో 'మహాధర్నా' నిర్వహిస్తున్నట్టు ఆ జేఏసీ తరఫున యూటీఎఫ్–గురుకుల టీచర్ల జేఏసీ నాయకులు జంగయ్య, చావ రవి, గురుకుల టీచర్ల జేఏసీ తరఫున మామిడి నారాయణ, మధుసూదన్ తెలిపారు.



హైదరాబాద్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన ట్రిపుల్ ఆర్ బాధితులు, రైతులు. ఈ సందర్భంగా ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీని, ఎన్నికల తర్వాత మాట తప్పిన వైఖరిని హరీశ్‌రావుకు వివరించారు.

# ట్రిపుల్ ఆర్ బాధితుల పక్షాన పోరాటం

మొదటిపేజీ తరువాయి...

వేళ భువనగిరి సభలో ప్రియాంకతో ఇప్పించిన హామీని కూడా విస్మరించడం బాధాకరమని చెప్పారు. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్, రాజగోపాల్‌రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ తీరు 'ఓడ దాటేదాకా ఓడ మల్లన్న..ఓడ దాటినంక బోడ మల్లన్న' చందంగా ఉన్నదని ఎద్దేవా చేశారు. ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగాన 40 కిలోమీటర్లకు బదులు 28 కిలోమీటర్లతో జంక్షన్ ఏర్పాటు చేయడం, 78 ఎకరాల్లో ఉన్న జంక్షన్ రింగురోడ్డును 184 ఎకరాలకు పెంచడంతో చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. మున్సిపాలిటీ రెండుగా చీలిపోతుందని చెప్పారు. రైతులు రెండు పంటలు పండే భూములు, విలువైన ప్లాట్లు కోల్పోవాల్సి వస్తుందని వాపోయారు. బాధితులకు ప్రభుత్వం తక్కువ పరిహారం ఇస్తున్నదని విమర్శించారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని అప్పటి ఎంపీ, ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రాయగిరి, చౌటుప్పల్ రైతులతో కలిసి ధర్నాలు చేశారని గుర్తుచేశారు. కానీ అధికారం రాగానే అదే రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు.

### కోమటిరెడ్డికి మతిమరుపు ఎక్కువైంది..

'కోమటిరెడ్డికి కొంతకాలంగా మతిమరుపు ఎక్కువైనట్టున్నది..ఆయన ఇచ్చిన హామీల వీడియోలు పంపుతున్నా..చూసుకోండి' అంటూ చురకలంటించారు. 'కోమటిరెడ్డి.. ఇప్పటికైనా స్పందించు..ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పించి నల్లగొండ వాసులకు న్యాయం చేస్తావా? లేదంటే చరిత్ర హీనుడిగా మిగిలిపోదల్చుకున్నావా? తేల్చుకోవాలని సూచించారు. దక్షిణాన ట్రిపుల్ ఆర్‌కు ఏ విధంగానైతే 40 కిలోమీటర్లను పరిగణనలోకి తీసుకున్నారో, ఉత్తర దిక్కున కూడా 40 కిలోమీటర్లను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల ముందు ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చుతామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్, ఇప్పుడు పోలీసు బలగాల మధ్య సర్వే చేయించి బాధిత రైతులతో దుర్మార్గంగా ఒప్పంద పత్రాల మీద సంతకాలు పెట్టించారని ధ్వజమెత్తారు. 'ఎన్నికల ముందు ఓ మాట? ఎధికారంలోకి వచ్చాక మరో మాటనా? ఇదెక్కడి న్యాయం' అని ప్రశ్నించారు. ఫార్మాసిటీ విషయంలోనూ ఇదేవిధంగా మాట మార్చారని విమర్శించారు. 'మాట మార్చడమే మీ విధానామా? మభ్యపెట్టడమే కాంగ్రెస్ పద్ధతా?' అని నిలదీశారు. పరిహారం ఇవ్వాలని ప్రశ్నించిన ట్రిపుల్ ఆర్ బాధిత రైతులపై ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తూ మానసిక క్షోభకు గురిచేస్తున్నదని చెప్పారు. ప్రియాంక గాంధీ చొరవ చూపి ట్రిపుల్ ఆర్ బాధితుల సమస్యలు పరిష్కరించేలా సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి కోమటిరెడ్డికి ఆదేశాలివ్వాలని హరీశ్ విజ్ఞప్తిచేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కారు కళ్లు తెరిచి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# నేడు రేవంత్ కేసు విచారణ



నాంపల్లి కోర్టులు, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): రిజర్వేషన్లపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో సీఎం రేవంత్‌రెడ్డిపై నమోదైన కేసును నాంపల్లిలోని ప్రజాప్రతిధుల కోర్టు బుధవారం విచారించనున్నది. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రూపుమాపేందుకు బీజేపీ కంకణం కట్టుకున్నదని మే 4న కొత్తగూడెం బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి ఆరోపించడంపై బీజేపీ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు కోర్టును ఆశ్రయించారు. బీజేపీ ప్రతిష్ఠకు కలిగేలా వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్తగూడెం సభలో రేవంత్ ప్రసంగానికి సంబంధించిన క్లిప్పింగ్‌లను కోర్టుకు సమర్పించారు. దీంతో ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 499, 125 సెక్షన్ల కింద రేవంత్‌రెడ్డిపై కేసు నమోదైంది. దీనిపై విచారణకు సీఎం రేవంత్ లేదా ఆయన తరఫు న్యాయవాది హాజరు కావాలని గత నెల 25న కోర్టు ఆదేశించింది.

# 16న కోర్టుకు రేవంత్ రావాల్సిందే

మొదటిపేజీ తరువాయి...

తరుపు న్యాయవాదిని ఆదేశించారు. ఇదిలాఉండగా నిందితుల తరుపు న్యాయవాది గైర్హాజర్ పిటిషన్లు దాఖలు చేయడంతో కోర్టు అంగీకరించింది. 2015 మే 31న ఓటుకు నోటు కేసులో అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి మరో ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌కు నోట్ల కట్టలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయినట్టు అభియోగాలున్నాయి. దీనిపై ఏసీబీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. రేవంత్‌రెడ్డితోపాటు సెబాస్టియన్, ఉదయ్‌సింహ, సండ్ర వెంకటవీరయ్యతోపాటు రూ.50 లక్షలు సమకూర్చారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వేం కృష్ణకీర్తన్ తదితరులపై కేసు నమోదు చేసింది. ఈ కేసు విచారణ కొనసాగుతుండగానే ఓటుకు నోటు కేసులో మనీ లాండరింగ్ జరిగినట్టు గుర్తించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా నాంపల్లిలోని ఈడీ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. అయితే, ఈడీ కోర్టు విచారణకు నిందితులు కొంతకాలంగా హాజరు కావడం లేదు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో మిగతా నిందితులు సైతం కోర్టుకు హాజరుకాకుండా, గైర్హాజరీ పిటిషన్లు దాఖలు చేస్తున్నారు. దీనిని న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. నిందితులు కోర్టుకు హాజరు కాకుండా దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నారంటూ మండిపడింది. మరోవైపు, ఏసీబీ నమోదుచేసిన ఓటుకు నోటు కేసు విచారణ కూడా నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో కొనసాగుతున్నది. ఈ కేసులో ఏ–1 నిందితుడిగా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారని, ఈ కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని కోరుతూ ఇటీవల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు



# ఉదండాపూర్ భూనిర్వాసితుల ఆందోళన

- మూకుమ్మడిగా జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌కు చేరిక
- 'మల్లన్నసాగర్' ప్యాకేజీలా ఇవ్వాలని డిమాండ్
- ఆ తర్వాతే పనులు చేపట్టాలని రైతుల సూచన
- నేడు ఉదండాపూర్ పరిశీలనకు మంత్రులు



జడ్చర్ల పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న ఉదండాపూర్ రిజర్వాయర్ ముంపు గ్రామాల నిర్వాసితులు

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'పాలమూరు–రంగారెడ్డి' ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న ఉదండాపూర్ రిజర్వాయర్ భూనిర్వాసితులు మంగళవారం ఆందోళన చేపట్టారు. వల్లూరు, ఉదండాపూర్‌కు చెందిన ముంపు నిర్వాసితులు మూకుమ్మడిగా మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ప్రభుత్వం ఇస్తామన్న ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి సంబంధించి డబ్బులు, ప్లాట్లు ఇచ్చిన తర్వాతే రిజర్వాయర్ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. బుధవారం ఉదండాపూర్ రిజర్వాయర్‌తోపాటు నార్లాపూర్, వట్టెం రిజర్వాయర్ల పనుల పరిశీలనకు ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రానున్నారు. మంత్రుల పర్యటనను అడ్డుకుంటారన్న అనుమానంతో పోలీసులు నిర్వాసితులను పోలీస్‌స్టేషన్‌కు రావాలని సీఐ ఆదిరెడ్డి సూచించారు. దీంతో వారంతా పోలీస్‌స్టేషన్‌కు చేరారు. తమకు ఎందుకు పిలిచారని ఆందోళన చేపట్టడంతో.. వారందరినీ ప్రభుత్వ గెస్ట్‌హౌస్ వద్దకు రావాలని పోలీసులు సూచించడంతో అక్కడికి వెళ్లారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రస్తుత ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చెప్పిన విధంగా మల్లన్నసాగర్ ముంపు బాధితులకు ఇచ్చిన ప్రకారం పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. గ్రామ కంఠంలో లేకుండా.. ఇతర భూముల్లో ఉన్న ఇండ్లకూ షరతుల్లేకుండా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలు ఇవ్వాలని కోరారు. పరిహారం చెల్లించాకే పనుల వద్దకు రావాలని సూచించారు. మంత్రుల పర్యటన విజయవంతం అయ్యేందుకు సహకరించాలని మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు నిర్వాసితులను కోరారు. సమస్యలుంటే మంత్రులకు వినతిపత్రాలు ఇవ్వాలని సూచించారు.

# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

## సిద్ధరామయ్యకు ఎదురుదెబ్బ

**కర్ణాటకలోని** కాంగ్రెస్ ప్రభుత్వం ఒకటి వెనుక ఒకటిగా అవినీతి కుంభకోణాల్లో చిక్కుకుంటున్నది. సీఎం సిద్ధరామయ్య పేరు పలు కేసుల్లో ప్రముఖంగా వినిపిస్తున్నది. ముఖ్యంగా మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ (ముడా) భూమి కుంభకోణం ఆయన మెడకు బలంగానే చుట్టుకుంటున్నది. ఆయనను అవినీతి కేసులో ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోత్ ఇదివరకే అనుమతి ఇచ్చారు. దీని రద్దుకు హైకోర్టులో సీఎం సిద్ధరామయ్య వేసిన పిటిషన్ వీగిపోవడం ఆయనకు పెద్దదెబ్బ అనే చెప్పాలి. ముడా లేఔట్ల ద్వారా సీఎం సతీమణి పార్వతి, ఆయన బావమరిది లబ్ధి పొందారనేది ప్రధాన ఆరోపణ. ముడాకు సమర్పించిన భూముల విలువను మించిన ప్లాట్లను తిరిగి పొందారనేది ఫిర్యాదుదారుల కథనం. పిటిషన్‌లో ప్రస్తావించిన అంశాలపై దర్యాప్తు జరపాల్సిందేనంటూ జస్టిస్ ఎం.నాగప్రసన్న అభిప్రాయపడటం గమనార్హం. గవర్నర్ అనుమతి మంజూరులో తొందరపాటును ప్రదర్శించారన్న వాదననూ తిరస్కరించారు.

హైకోర్టు తీర్పుతో సిద్ధరామయ్యపై దర్యాప్తునకు, తదనంతరం ప్రాసిక్యూషన్‌కు మార్గం సుగమమవుతుంది. కనీసం రెండు వారాల స్టే ఇవ్వాలని ఆయన తరఫు న్యాయవాది కోరినప్పుడు 'నా తీర్పుపై నేనే స్టే ఇవ్వలేను' అని జస్టిస్ నాగప్రసన్న ప్రకటించడం గమనార్హం. దీంతో ప్రాసిక్యూషన్‌ను ఆపేందుకు సిద్ధరామయ్య ముందున్న దారులన్నీ మూసుకుపోయాయి. ముడా ప్లాట్ల వ్యవహారంలో ప్రభుత్వానికి రూ.45-55 కోట్ల మేర నష్టం వాటిల్లిందంటున్నారు. నిజానికి ఆయన కుటుంబ సభ్యులు ముడాకు అభివృద్ధి నిమిత్తం ఇచ్చిన భూములు వారి పేరు మీదకు రావడం వెనుక కూడా అనుమానాస్పదమైన పరిణామాలు జరిగాయన్న సంగతి కూడా వెలుగులోకి వచ్చింది. మరోవైపు వాల్మీకి గిరిజనాభివృద్ధి సంస్థ నిధుల మళ్లింపు కేసులోనూ సిద్ధరామయ్య పాత్రపై అనుమానాలున్నాయి. ఆర్థికశాఖను స్వయంగా నిర్వహిస్తున్న సీఎం నిర్ణయం మేరకే నిధులు మళ్లించారని ఆరోపణలున్నాయి. అయితే ఆ వ్యవహారం ఇంకా ఒక కొలిక్కి రాలేదు. వాల్మీకి సంస్థ నిధులను వేర్వేరు ఖాతాలు తెరిచి చిన్నచిన్న మొత్తాలుగా రూ.94 కోట్లు దారిమళ్లించారు. ఇందులో కొంత మొత్తం కర్ణాటకలో, మరికొంత మొత్తం తెలంగాణలో కాంగ్రెస్ ఎన్నికల ఖర్చులకు వినియోగించారని అప్పట్లో బలంగా వినిపించింది.

*ఈ తరహా అధికార దుర్వినియోగం, అవినీతి ఆరోపణల కారణంగానే ఏఐసీసీకి కర్ణాటక ప్రభుత్వం ఏటీఎంగా మారిందనే మాట వినిపిస్తున్నది. ఈ రెండు కుంభకోణాలపై విపక్ష బీజేపీ సహజంగానే హంగామా చేస్తున్నది. ఈ నేపథ్యంలో బీజేపీ తమ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కుట్రలు పన్నుతున్నట్టు సిద్ధరామయ్య చేసిన ఆరోపణ బేలగా ధ్వనిస్తున్నది. మరోవైపు అధిష్ఠానం ఒత్తిడి మేరకు బీజేపీ పాలనలో జరిగిన వివిధ కుంభకోణాలపై సీఎం సిద్ధరామయ్య ప్రభుత్వం ఇదివరకే మూడు జ్యుడీషియల్ కమిషన్లు వేసింది. కుంభకోణాల దర్యాప్తు ప్రగతిని సమీక్షించేందుకు సీఎం ఇటీవలే మంత్రుల కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఇలా ఒకరి గురించి మరొకరు బయట పెట్టుకుంటుండటంతో కుంభకోణాల్లో జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందేననే అభిప్రాయం సామాన్య ప్రజలకు కలగడంలో వింతేమున్నది.*

# తల్లి నేలను తస్కరించిన దొంగలు

**తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 'ఇచ్చింది సోనియమ్మ' అని కాంగ్రెస్, 'తెచ్చింది కేసీఆర్' అని తెలంగాణ సమాజం ఇరువైపులా మోహరించాయి. ఉద్యమకారులు ఒక అడుగు ముందుకేసి 'దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందంటే విక్టోరియా మహారాణి వల్ల అంటామా? గాంధీజీ వల్ల అంటామా?' అని ఎదురు ప్రశ్న వేశారు. ప్రజలు కూడా ఇచ్చినవాళ్ల కంటే తెచ్చినవాళ్లకే ఆ ఎన్నికల్లో పట్టం కట్టారు. ఇన్నాళ్లకు మళ్లీ అలాంటి సందర్భమే ఎదురైంది. తెలంగాణ రాష్ట్ర సచివాలయం ఎదురుగా తెలంగాణ తల్లి విగ్రహం కోసం కేసీఆర్ ప్రభుత్వం ఎంపిక చేసిన స్థలంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోట్లాది ప్రజల భావోద్వేగాల, భక్తి విశ్వాసాల ప్రతిరూపం తెలంగాణ తల్లి విగ్రహం ప్రతిష్ఠించకుండా తెలంగాణతో ఏ రకమైన ప్రత్యేకానుబంధం లేని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తెచ్చిపెట్టారు. తెలంగాణ ఉద్యమ చరిత్ర తెలియని అర్భక కాంగ్రెస్ నేతలు కేరింతలు కొట్టారు. తెలంగాణ ఉద్యమ కారులకు మాత్రం ఎక్కడో పేగు కదిలింది. గుండె ద్రవించింది.**



**డాక్టర్ అయాచితం శ్రీధర్**
**9849893238**



స్వర్గీయ రాజీవ్‌గాంధీ చిరస్మరణీయుడే. కానీ, తెలంగాణ తల్లి విగ్రస్థాపనకు ఉద్దేశించిన స్థలంలో పంతానికి పోయి రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ప్రతిష్ఠించడం, పరిహారంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో ప్రతిష్టిస్తామని నష్ట నివారణ ప్రకటనలు చేయడం ఒక ప్రహసనాన్ని తలపించింది. ఇంతకీ తెలంగాణ తల్లి రూపురేఖలు అట్లాగే ఉంటాయా? లేదా వచ్చే డిసెంబర్ 6న ఇంకో తల్లి రూపురేఖలను పోలిన విగ్రహాన్ని ప్రతిష్ఠించి అదే అసలైన తెలంగాణ తల్లి విగ్రహం అని దబాయిస్తారా? అన్న సందేహం తెలంగాణ ప్రజలను వెంటాడుతున్నది. అందుకు కారణమూ ఉన్నది. 40 ఏండ్ల కిందట హైదరాబాద్ ట్యాంకుబండ్ మీద కొలువైన విగ్రహాల రూపురేఖలు నాటి ముఖ్య నేత ముఖ కవళికలను తలపిస్తున్నాయని ఆ రోజుల్లో చాలా మంది చెవులు కొరుక్కున్నారు. ఇప్పుడేం జరుగుతుందో చూడాలి.

తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఉద్దేశించిన చోటే ప్రతిష్ఠించాలని ప్రొఫెసర్ హరగోపాల్ సహా ఎందరో మేధావులు, రచయితలు, కళాకారులు విన్నవించుకున్నా ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. కానీ, తెలంగాణ ప్రజల భావోద్వేగాలు కాలం కలిసి రానప్పుడు నివురు గప్పిన నిప్పు కణికల్లా అవకాశం కోసం ఎదురుచూస్తాయి. గాలి తోడైనప్పుడు ఎగిసిపడే అగ్నికీలలవుతాయి. అది చరిత్ర. 1956 నుంచి 2001 దాకా వివిధ సందర్భాల్లో ఎగిసిపడ్డ ఉద్యమ నిప్పు కణికలను ఆరిపోకుండా కాపాడుకుంటూ ఒక్కొక్కరికి అందించుకుంటూ వచ్చింది నాటి తరమైతే, కేసీఆర్ స్వరాష్ట్ర సాధన జెండా ఎత్తినరోజు నుంచే తెలంగాణ సమాజం ఏకంగా ఎక్కడికక్కడ నిప్పును సృష్టించడమే నేర్చుకుంది. అగ్నితో చెలగాటం కూడదని నేటి పాలకులకు తెలియదా?

తెలంగాణ అస్తిత్వ ఆత్మగౌరవ భావోద్వేగాల అగ్గి రవ్వ ఎక్కడ పుడుతుందో ఎలా విస్తరిస్తుందో సమైక్య పాలకులు ఎవరూ కనిపెట్టలేకపోయారు. ఎక్కడో పాల్వంచ ఉద్యోగుల్లో తలెత్తిన ప్రశ్న 1969 ప్రత్యేక తెలంగాణ మహోద్యమానికి బీజం వేసి 1971 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను చావుదెబ్బ తీసింది. సమైక్య రాష్ట్ర ముఖ్యమంత్రి టి.అంజయ్య తన ప్రోటోకాల్ పక్కనపెట్టి కేవలం లోకసభ సభ్యుని హోదాలో వస్తున్న రాజీవ్‌గాంధీని స్వాగతించడానికి బేగంపేట విమానాశ్రయానికి వెళ్లినప్పుడు జరిగిన అవమానం 1983లో సమైక్య రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల చరిత్రలో తొలిసారిగా కాంగ్రెస్ ఘోర పరాజయానికి దారితీసింది. చంద్రబాబు మొదలుకొని కిరణ్‌కుమార్‌రెడ్డి దాకా సమైక్య రాష్ట్ర ముఖ్యమంత్రులు అధికారం అండతో, ధన కనక వస్తు వాహనాల ప్రలోభాలతో గెలవాలనుకున్న రాజకీయ తులాభారంలో కేసీఆర్ సమర్పించిన తెలంగాణ అస్తిత్వ ఆత్మగౌరవమనే తులసీదళంతో అవేవీ సరితూగలేకపోయాయి. మహాత్మాగాంధీ కుటుంబం సంగతేమో కానీ, ఇందిరాగాంధీ కుటుంబ భజన మరీ తెలంగాణలో శ్రుతిమించిపోయింది. అది కాంగ్రెస్ పార్టీ వరకే పరిమితమైతే అభ్యంతరం లేదు కానీ, ప్రజల భావోద్వేగాల మీద ప్రభుత్వ వేదికలపై దాడిచేసే స్థాయికి రావడం ఆందోళనకరం. ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా ఈ వైపరీత్యం కనిపించదు. విశేషమేమంటే ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీల సొంత రాష్ట్రం ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో అంతర్జాతీయ విమానాశ్రయానికి 2008లో అదే రాష్ట్రానికి చెందిన రైతు నేత, మాజీ ప్రధాని స్వర్గీయ చౌదరి చరణ్‌సింగ్ పేరు పెట్టారు. కారణం? అప్పుడు ఆ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నది కాంగ్రెస్సేతర ప్రభుత్వం. అదే ఏడాది హైదరాబాద్‌లో కూడా అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమైంది. అప్పటికే తెలంగాణ బిడ్డ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు దివంగతులైనప్పటికీ వారి పేరు పెట్టలేదు. సరి కదా రాజీవ్‌గాంధీ పేరు పెట్టారు. కారణం? అప్పుడు సమైక్య రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం. అది అంతటితో ఆగలేదు. రాజీవ్ రహదారి, రాజీవ్ ఆరోగ్యశ్రీ, రాజీవ్ ట్రిపుల్ ఐటీ వంటి పేర్లతో రాష్ట్రం తడిసి ముద్దయి తరించింది. పేర్లు విగ్రహాలు పెట్టాలనుకుంటే కాంగ్రెస్ పార్టీకే చెందిన స్వాతంత్ర్య సమరయోధులు, మహనీయులు, త్యాగధనులు ఎంత మంది లేరు?.

> **తెలంగాణ రాష్ట్రం వచ్చాక ముఖ్యమంత్రి కేసీఆర్ అందర్నీ గౌరవించారు. కొత్త వాటికి మాత్రమే స్థానిక దేవతల పేర్లు, తెలంగాణ మహనీయుల పేర్లు పెట్టారే తప్ప ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలకు అపచారం తలపెట్టలేదు. తెలంగాణ ప్రజలూ అంతే. సంస్కారమంటే అది. చరిత్రలోకి వెళ్తే కాంగ్రెస్ ప్రధానులు నెహ్రూ పాలనలో, కేంద్రంలో గాని కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో గాని పేర్లు, విగ్రహాల విషయంలో వల్లమాలిన కుటుంబారాధన లేదు. వారి హయాంలో నిర్మించిన బహుళార్థసాధక నీటి ప్రాజెక్టులకు, ప్రతిష్ఠాత్మక సంస్థలకు ఆ మకిలి అంటలేదు.**

ట్యాంక్ బండ్ మీద ఉన్న 34 విగ్రహాల్లో కేవలం 8 మాత్రమే తెలంగాణ ప్రముఖులవి ఉన్నప్పటికీ మిగతా విగ్రహాలను ఎక్కడో ప్రతిష్ఠించాలని ప్రత్యేక రాష్ట్రం వచ్చాక ప్రజలు కోరనూ లేదు. కేసీఆర్ ప్రభుత్వం కొత్త వివాదాన్ని సృష్టించనూ లేదు. ఢిల్లీలో గుంటెడు జాగ దక్కనీయకుండా మాజీ ప్రధాని పీవీ నరసింహారావు భౌతికకాయాన్ని హైదరాబాద్‌కు తరలించిన కాంగ్రెస్ కనీసం ఆయన భౌతిక కాయం పూర్తిగా కాలని దుస్థితిలో దహన సంస్కారాలు కూడా సవ్యంగా జరపకపోవడం కంటే... మా తెలంగాణ తల్లి విగ్రహం కోసం అనుకున్న జాగ ఇది. వదిలేయండి. రాజీవ్ గాంధీ విగ్రహం మరి ఎక్కడైనా మంచి చోట ప్రతిష్ఠించండి. నగరంలో, రాష్ట్రంలో ఎన్నో చోట్ల ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ విగ్రహాలున్నాయి. ఈ ఒక్కచోటే మీకు తక్కువైందా అని ఉద్యమకారులు వేడుకోవడం మహాపరాధమైంది. తెలంగాణ తల్లి విగ్రహం బదులుగా రాజీవ్‌గాంధీ విగ్రహం అక్కడే ఉండాలని ప్రజలెవరూ కోరలేదు. వారు ఆకాంక్షించని, ఆమోదించని, లేనిపోని వివాదాన్ని తెరపైకి తెచ్చి పైగా పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వం ఏం చేసిందనే వితండవాదాన్ని కాంగ్రెస్ నేతలు ముందుకుతెచ్చారు. రాజీవ్‌గాంధీ మరణానంతరం 15 ఏండ్లు కాంగ్రెస్సే కదా పరిపాలించింది. మరి అప్పుడెందుకు రాజీవ్‌గాంధీ గుర్తుకురాలేదు? అన్న ఉద్యమకారుల ప్రశ్నకు సమాధానం లేదు. కానీ, పదేండ్లలోనే ఆ పరిసరాల్లో ఒక అద్భుత సచివాలయం, అమరులజ్యోతి, అంబేద్కర్ మహా విగ్రహం నిర్మించింది కేసీఆర్ ప్రభుత్వం. వాటిమధ్యలో చరిత్రలో నిలిచిపోయే తెలంగాణ తల్లి దేవాలయాన్ని నిర్మించాలని కేసీఆర్ సంకల్పించారు. అది అందరికీ తెలుసు. ప్రజలు, పర్యాటకులు హాయిగా వచ్చిపోయే స్థలంలో, చుట్టూ అద్భుత దృశ్యం ఆవిష్కృతమయ్యే ప్రాంతంలో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టకుండా నిరంతరం పోలీసు పహారాలో ఆంక్షలు, తనిఖీలతో కొనసాగే ప్రాంగణంలో కుదించడం కుట్ర కాదా! సామాన్యులకు తెలంగాణ తల్లిని దూరం చేయడం కాదా? కావాలని రెచ్చగొట్టడం తప్ప దీన్నేమనాలి?

అధికారం కోసం జరిగే పోరాటాలు వేరు. వాటి వేదికలు, సందర్భాలు, స్థల కాలాలు వేరు. భావోద్వేగాలు, విశ్వాసాలు వేరు. ఈ తేడా తెలియక రాష్ట్ర ప్రభుత్వం ప్రతీకారేచ్ఛతో కాకతీయ శిలాతోరణం, చార్మినార్‌ను ముట్టుకొని చేతులు కాల్చుకున్నది. అంతటితో ఆగకుండా తెలంగాణ తల్లి నేలనే ఆక్రమించే సాహసానికి తెగించింది. అదేదో వ్యాపార ప్రకటనలో అన్నట్టు మరక మంచిదే. ఉద్యమ సమయంలో తెలంగాణ వ్యతిరేక శక్తులు తూలిన మాటలు, నిందలు, వెక్కిరింతలు, దొంగ దీక్షలు, ఉత్తుత్తి ఉద్యమాలు, ఒకరకంగా తెలంగాణ భావోద్వేగాలకు మరింత ఆజ్యం పోశాయి. ఇదీ అందుకేనేమో. అయితే, కాలం కలిసిరావాలి. కేటీఆర్ అన్నట్టు నాలుగేండ్లు ఆగాలి. అంతవరకు కాళోజీ చెప్పినట్టు..

**'కసితోనే ఉండాలె- బుస కొట్టుతుండాలె**
**కాలమ్ము రాగానే- కాటేసి తీరాలె'**

# బీసీ కోటా 42 శాతం సాధ్యమయ్యేనా?

**రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ వెనుకబడిన తరగతులకు స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపాలిటీలు, గ్రేటర్ మున్సిపాలిటీల్లో 42 శాతం రిజర్వేషన్లను ఐదు గ్రూపులుగా వర్గీకరించి అమలుచేస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో, ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చింది. రాజ్యాంగంలో బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన అధికరణల్లోని లోపాల ఆధారంగా వెలువడుతున్న సుప్రీంకోర్టు తీర్పులు బీసీ కులాలకు శాపంగా మారాయి.**



**కోడెపాక కుమారస్వామి**
**94909 59625**



ప్రజాస్వామ్యం ముసుగులో నడుస్తున్న నిచ్చెన మెట్ల కుల వ్యవస్థలో, వెనుకబడిన కులాలను కాస్త వెనుకబడిన తరగతులుగా/వెనుకబడిన పౌరులుగా రాజ్యాంగంలో చిత్రీకరించిన పరిస్థితి. ఇప్పటికిప్పుడు బీసీ కోటా 42 శాతం అమలుచేయలేమనేది. కాంగ్రెస్ పార్టీ పెద్దలకు తెలియని అంశం కాదు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం 42 శాతం రిజర్వేషన్లను స్థానిక ఎన్నికల్లో అమలుచేయాలని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మరోవైపు బీసీ నాయకులు ఆమరణ నిరాహార దీక్షలకు సైతం పూనుకున్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందికరంగా ఉన్నాయి. ఇటీవల బీసీ గణాంకాలు, స్థానిక సంస్థల్లో బీసీ కోటా అమలు కోసం చైర్మన్, ముగ్గురు సభ్యులతో కూడిన డెడికేటెడ్ బీసీ కమిషన్‌ను ప్రభుత్వం నియమించింది.

భారత రాజ్యాంగ రచనలో, తదనంతరం బీసీ రిజర్వేషన్లపై జరిగిన సవరణల్లో తీరని అన్యాయం జరిగింది. కేంద్ర ప్రభుత్వం 1992లో 73, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా రాజ్యాంగంలో 243 (డీ) 243 (టీ) అధికరణలను చేర్చి ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా పద్ధతిలో, మహిళలకు 33.33 శాతంగా, బీసీలకు స్పష్టమైన కోటా శాతాన్ని తెలుపకుండా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలని తెలిపింది. అందులో భాగంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1994 నుంచి వెనుకబడిన తరగతులకు 34 శాతం రిజర్వేషన్లను స్థానిక సంస్థల్లో కల్పిస్తున్నారు. కానీ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2019 నుంచి సుప్రీంకోర్టు తీర్పులను సాకుగా చూపిస్తూ, మొత్తం నిలువు రిజర్వేషన్లు 50 శాతం మించవద్దనే నిబంధనతో 34 శాతం నుంచి 23 శాతానికి తగ్గించి బీసీ కోటా అమలుచేస్తున్నారు. ఫలితంగా గత పంచాయతీ ఎన్నికల్లో సుమారు వెయ్యికిపైగా సర్పంచ్ స్థానాలను బీసీలు కోల్పోయారు. మున్సిపాలిటీలు, గ్రేటర్ మున్సిపాలిటీల్లో మాత్రం బీసీ కోటా 34 శాతంగా అమలు జరుగుతుంది. అందుకు కారణం ఎస్సీ, ఎస్టీల జనాభా తక్కువగా ఉండి మొత్తం నిలువు రిజర్వేషన్లు 50 శాతానికి మించడం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో 1994 నుంచి స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా బీసీ రిజర్వేషన్ల వర్గీకరణ ద్వారా అమలు చేయాలని అత్యంత వెనుకబడిన కులాలు డిమాండ్ చేస్తున్నాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న కాంగ్రెస్ పార్టీ సార్వత్రిక ఎన్నికల కంటే ముందు బీసీ కోటా 42 శాతానికి పెంచి వర్గీకరణ ద్వారా అమలు చేస్తామని బీసీ ప్రజలకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు న్యాయపరంగా, సుప్రీంకోర్టు తీర్పుల ఆధారంగా చూసినట్టయితే అసలు బీసీ గణాంకాలు లేనట్టయితే 42 శాతం దేవుడెరుగు ప్రస్తుతం అమలుచేస్తున్న 23 శాతం రిజర్వేషన్లు కూడా అమలుచేసే పరిస్థితి లేదని తెలిసింది. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక డెడికేటెడ్ బీసీ కమీషన్‌ను నియమించింది.

దేశవ్యాప్తంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులను పరిశీలించినట్టయితే, సుప్రీంకోర్టు ఐదుగురు జడ్జిల రాజ్యాంగ ధర్మాసనం 2010లో కే.కృష్ణమూర్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా మధ్య జరిగిన కేసు తీర్పులో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల అమలుపై ప్రత్యేకమైన మూడు నిబంధనలను పెట్టింది. వాటిలో మొదటిది వెనుకబడిన తరగతుల పౌరుల వెనుకబాటుకు సంబంధించి ప్రత్యేక బీసీ కమిషన్ ద్వారా ఆమోదయోగ్యమైన లెక్కలు తీయాలి. రెండవది అట్టి లెక్కల ద్వారా బీసీ కోటాను నిర్ధారించాలి. మూడవది ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లతో కలిపి 50 శాతం నిలువు రిజర్వేషన్లు దాటకూడదని తెలిపింది. ఇదే తీర్పులో అసలు సామాజికంగా వెనుకబడిన తరగతుల జాబితా విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల అమలుకు, స్థానిక సంస్థల్లో వెనుకబడిన పౌరుల జాబితా వేరుగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వాలను తప్పుపట్టింది. ఎందుకంటే భారత రాజ్యాంగం ఆర్టికల్ 15(4), 15(5),16(4) ప్రకారం బీసీ కులాలను సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులుగా గుర్తించారు. అదే స్థానిక సంస్థల్లో ఆర్టికల్ 243 ప్రకారం బీసీ కులాలను వెనుకబడిన పౌరులుగా గుర్తించారు. భారత రాజ్యాంగంలో బీసీ కులాలను గుర్తించేవిధంగా అధికరణలు లేకపోవడం నేడు బీసీ కులాల పాలిట శాపంగా మారింది. ఈ సమస్యలన్నీ పాలకులకు తెలియనివి కావు. సుప్రీంకోర్టు 2021లో మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి వికాస్ కిషన్‌రావు గవలి వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసు తీర్పులో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలంటే ట్రిపుల్ టెస్ట్ ద్వారా మాత్రమే అమలుచేయాలని, లేనట్లయితే బీసీ రిజర్వేషన్లు లేకుండానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

సురేష్ మహాజన వర్సెస్ స్టేట్ ఆఫ్ మధ్యప్రదేశ్ కేసు తీర్పులో మధ్యప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ట్రిపుల్ టెస్ట్ ద్వారా మాత్రమే స్థానిక సంస్థల్లో బీసీ కోటా అమలుచేయాలని, మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని, బీసీ గణాంకాలు లేకపోతే బీసీ రిజర్వేషన్లు అమలుచేయవలసిన అవసరం లేదని, ప్రతి ఐదేండ్లకు రాజ్యాంగ నిబంధనల ప్రకారం తప్పనిసరిగా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వంతో సహా దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను, కేంద్రపాలిత ప్రాంతాలను 2022లో సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఆదేశించింది. అంటే 2022 నుంచి దేశంలో నిర్వహిస్తున్న స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీ కోటా అమలుచేయాలంటే బీసీ గణాంకాలు తప్పనిసరి, అదేవిధంగా మొత్తం నిలువు రిజర్వేషన్లు ఎస్సీ, ఎస్టీ కోటాతో కలిపి 50 శాతానికి మించి అమలు చేసే అవకాశం లేదు.

కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లను వర్గీకరణ ద్వారా అమలు చేయవలసిన అవసరం ఉన్నది. అందుకోసం సుప్రీంకోర్టు 1992లో 9 మంది జడ్జిల రాజ్యాంగ ధర్మాసనం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 27 శాతం ఓబీసీ రిజర్వేషన్లకు సంబంధించిన మండల్ కమిషన్ తీర్పులోప్రధానంగా నిలువు రిజర్వేషన్లు 50 శాతం మించరాదని నిబంధన విధిస్తూ, ఒకవేళ బీసీ గణాంకాలు ఆమోదయోగ్యంగా ఉండి ప్రత్యేక పరిస్థితులు, బీసీల ప్రాతినిధ్యం లేనట్లయితే 50 శాతానికి మించి కూడా రిజర్వేషన్లు అమలుచేసుకోవచ్చని అదే తీర్పులో తెలిపింది.

> **2010 నుంచి 2023 వరకు స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ అమలుపై మండల కమిషన్ తీర్పును ఆధారంగా చేసుకొనే సుప్రీంకోర్టు తీర్పులు వెలువరిస్తున్నది. అంటే బీసీ కులాల లెక్కలు శాస్త్రీయబద్ధంగా లెక్కించి కోర్టులు ఆమోదించినట్టయితే స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను జనాభా దామాషా పద్ధతిలో అమలుచేయడం అసాధ్యం కాదు. అంటే, రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో సాధారణ పరిపాలన విభాగం, ప్లానింగ్ విభాగం ప్రత్యేక చట్టం ద్వారా రాష్ట్రంలో జనాభా లెక్కలు చేసి డెడికేటెడ్ బీసీ కమిషన్ భాగస్వామ్యంతో కార్యాన్ని పూర్తిచేసి బీసీ కోటాను 42 శాతంగా వర్గీకరణ ద్వారా అమలుచేయవచ్చు.**

కానీ, ఇంతటి కార్యాన్ని పూర్తిచేయాలంటే రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి అవసరం. ఇదంతా కూడా పూర్తిచేసినా రేపు హైకోర్టు, సుప్రీంకోర్టులో కూడా రాష్ట్ర ప్రభుత్వం చేసిన జనాభా లెక్కలను అందులో బీసీ గణాంకాలను శాస్త్రీయబద్ధంగా చూపిస్తూ, స్థానిక సంస్థల్లో బీసీల ప్రాతినిధ్యం లేదు కాబట్టి 42 శాతం రిజర్వేషన్లు తప్పనిసరిగా అమలుచేయాలని రుజువు చేయవలసిన అవసరం ఉన్నది.

బీసీ రిజర్వేషన్లపై న్యాయ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చొరవ తీసుకొని భారత రాజ్యాంగాన్ని సవరించవలసిన అవసరం ఉన్నది. రాజ్యాంగంలో విద్య, ఉద్యోగ ఇతర అంశాలకు సంబంధించిన అధికరణల్లో బీసీ తరగతులను సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన కులాలుగా గుర్తించాలి. అదేవిధంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన అధికరణలో కూడా సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన కులాలుగా గుర్తించాలి. లేనట్టయితే దేశంలో బీసీ రిజర్వేషన్ల అమలు సమస్య, సమస్యగానే మిగిలిపోతుంది.

**(వ్యాసకర్త: రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ విద్యుత్తు బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం)**

*ఒకనాడు ప్రపంచ బ్యాంకు పేరు ఎత్తితే చాలు ఎరుపు మెరుపు గానాలు... 'వీధి'నాటకాలు... రచ్చబండ ముచ్చట్లతో పల్లెలు, కదం తొక్కేవి. సర్కారు భూములు... పడావుపడ్డ శిఖం భూముల్లో గుడిసెలు వేయించి గూడు లేని పేదోళ్ల గుండె ధైర్యంగా నిలబడిన పిడికిళ్లు కుర్చీలను సర్దుబాటు చేసుకుంటున్నాయి. పొత్తుల సంసారంలో పోరు బాటను మరిచిపోయాయనే వాదనకు మరింత బలం చేకూరేలానే రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీలు వ్యవహరిస్తున్నాయి. ప్రభుత్వం ప్రపంచ బ్యాంకును ఎత్తుకొని ముద్దాడుతుంటే ముందు నిలిచి ఎర్ర జెండా స్వాగత గీతం ఆలపిస్తున్నట్టుగానే ఉన్నది.*

# చల్లబడ్డ పిడికిళ్లు!



**నూర శ్రీనివాస్**



కాంగ్రెస్ సర్కార్‌తో అధికార భాగస్వామ్యం కాగానే కమ్యూనిస్టులు తమ పూర్వ రూపాన్ని కోల్పోయారు. సర్కార్ విసురుతున్న పదవుల వలలో కమ్యూనిస్టులు తరించిపోతున్నారు. తన అమెరికా పర్యటనలో భాగంగా ప్రపంచబ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగాను కలిశానని, రాష్ట్రాభివృద్ధికి రుణం ఇచ్చేందుకు అంగీకరించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గోల్కొండ కోట సాక్షిగా స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో వెల్లడించారు. దీనిపై రాష్ట్రంలోని సీపీఐ, సీపీఎం పార్టీలు సర్కారు తీరుపై ఎటువంటి వైఖరిని ప్రకటించకపోవటంతో, అనంతర పరిణామాల్లో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు ప్రభుత్వ ప్రతినిధులతో వరుస భేటీలవుతున్నారు. 'సమీప భవిష్యత్తులో సెక్రటేరియేట్‌లో వరల్డ్ బ్యాంకు చాంబర్ కూడా ఏర్పాటు చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు' అని రాష్ట్రంలో వేగంగా జరుగుతున్న పరిణామాలు చెప్తున్నాయి.

కమ్యూనిస్టు పార్టీల నాయకులు అధికార పీఠానికి, ధూపదీప నైవేద్యాలకు దగ్గరగా చేరి ప్రజా పోరాటాలకు ఎప్పుడో దూరమయ్యారనే విమర్శలున్నాయి. కాంగ్రెస్ పార్టీతో చెట్టా పట్టాలేసుకొని ఊరేగుతుండటం వల్లే ప్రజా పోరాటాలకు, ప్రజాస్వామిక ఆకాంక్షలకు కమ్యూనిస్టులు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. సీపీఐ, సీపీఎం పార్టీల్లో సీపీఐ కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకోవటం, ఒక ఎమ్మెల్యే గెలవటం తెలిసిందే. కాంగ్రెస్ సర్కార్ యథేచ్ఛగా తీసుకున్న ప్రజావ్యతిరేక విధాన నిర్ణయాలను ఆ పార్టీ ఖండించకపోగా, గత ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తున్నారు. దీని వెనుక ఉన్న కారణం ఏమంటే... ఇప్పటికే దక్కిన ఒక కార్పొరేషన్ పదవితోపాటు, త్వరలో వెలువడే పదవుల కోసం ఆ పార్టీ ఎదురుచూస్తున్నదని ప్రజలు అనుకుంటున్నారు. ఇక అసెంబ్లీ ఎన్నికల సమయంలో పొత్తుల ఒరలో లేకపోయినా సీపీఎం కాంగ్రెస్‌తో సఖ్యతను ప్రదర్శిస్తూ 'జీ హుజూర్' తనాన్ని అనుసరిస్తున్నదనే విమర్శలు వినిపించాయి. ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజల హక్కుల రక్షణ తమ ప్రథమ కర్తవ్యం అని బయటికి గంభీర ప్రకటనలే చేస్తాయి తప్ప వాటికి కార్యాచరణ ఉండదని అనేక సంఘటనలు రుజువు చేశాయి.

> **ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు పాలనలో ప్రపంచబ్యాంకు విధానాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలు దేశానికే దిక్సూచిగా మారిన సందర్భాలున్నాయి. డంకెల్ ప్రతిపాదనలు, ప్రపంచబ్యాంకు షరతులు, విద్యుత్తు సంస్కరణలు, సహజ వనరులు కొల్లగొట్టడం వంటి అనేక విషయాల్లో కమ్యూనిస్టు పార్టీలు ప్రజా చైతన్యాన్ని కూడగట్టడంలో ముందు నిలిచాయి. విద్యుత్తు సంస్కరణల పేరు మీద చంద్రబాబు హయాంలో సాగిన పోరాటాలు, బషీర్‌బాగ్ కాల్పులు కమ్యూనిస్టుల పోరాటానికి కొండగుర్తులు.**

కార్మికలోకపు కల్యాణానికి ఖరీదు కట్టే షరాబు లేడని ఎలుగెత్తి చాటిన ఎరుపు గొంతుకల్లో ఉన్నపళంగా 'పదవుల ఎర' వచ్చిపడింది. కాంగ్రెస్ సర్కార్ ప్రపంచ బ్యాంకుతో చేసుకున్న వ్యవహారం ఓ వైపు. కొనసాగుతున్న కూల్చివేతలతో పేదల కన్నీటిచాళ్లు పారుతున్న దృశ్యం మరోవైపు కనిపిస్తున్నా ఉభయ కమ్యూనిస్టులు తమ విధానపరమైన వైఖరిని ఇప్పటికీ వెల్లడించకపోవడం పట్ల సర్వత్రా అనుమానాలు కలుగుతున్నాయి. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సాధించుకున్న తెలంగాణపై ప్రపంచబ్యాంకు పిడుగు ఏ రూపంలో పడుతుందోననే ఆందోళనా వ్యక్తమవుతున్నది. నీళ్లు... నిధులు... నియామకాలు అనే ట్యాగ్‌లైన్‌లో ఏ వనరుకు ప్రపంచబ్యాంకు ఎసరు పెట్టనుందోననే భయం వెంటాడుతున్నది.



## బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్ పోరాటం

**పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

హైదరాబాద్,సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ):కాంగ్రెస్ ఇచ్చిన బీసీ హామీ అమలయ్యే వరకు బీఆర్ఎస్ పోరాడుతుందని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. బీసీల నాయకత్వాన్ని ప్రోత్సహించింది బీఆర్ఎస్సేనని గుర్తుచేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం బీసీ ముఖ్యనాయకులతో కేటీఆర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తమిళనాడులో వారి పర్యటనపై చర్చించి సూచనలు చేశారు. బీసీలకు చట్టసభల్లో, స్థానిక సంస్థల్లో అత్యధిక అవకాశాలు కల్పించామని, రాబోయే రోజుల్లోనూ మంచి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రులు వీ శ్రీనివాస్‌గౌడ్, జోగు రామన్న, నేతలు రవీందర్‌సింగ్, మాజీ ఎమ్మెల్యేలు భిక్షమయ్యగౌడ్, గౌరీశంకర్, శుభప్రదపటేల్, కిశోర్‌గౌడ్, అంజనేయగౌడ్, ఉపేంద్రాచారి, పల్లె రవికుమార్‌గౌడ్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, చిరుమల్ల రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ స్థాయి నుంచి బీసీ ఉద్యమం

- సమగ్ర కులగణనకు చట్టబద్ధతే లక్ష్యం
- కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేసి తీరాలి
- 28న కల్వకుర్తిలో సమగ్ర కులగణనపై సభ
- తెలంగాణ బీసీ మహాసభ సమావేశంలో వక్తలు




*తెలంగాణ బీసీ మహాసభ జెండాను ఆవిష్కరిస్తున్న కృష్ణయ్య, ప్రవీణ్ కుమార్, బాలరాజు యాదవ్ తదితరులు*

ఖైరతాబాద్, సెప్టెంబర్ 24: సమగ్ర కులగణ, బీసీ రిజర్వేషన్ల పెంపే లక్ష్యంగా గ్రామ స్థాయి నుంచి బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పలువురు బీసీ నేతలు పిలుపునిచ్చారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం తెలంగాణ బీసీ మహాసభ జెండావిష్కరణ సభలో ఎంపీ ఆర్ కృష్ణయ్య, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్పీ తదితరులు పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం కాంగ్రెస్ వైఖరి చూస్తుంటే కామారెడ్డి డిక్లరేషన్ కేవలం బీసీల ఓట్ల కోసమే నాడు చేసినట్టున్నదని, దానిని అమలుచేసి తీరాల్సిందేనని వక్తలు డిమాండ్ చేశారు. 76 ఏండ్లలో ఒక్క బీసీ ముఖ్యమంత్రి కాలేకపోయాడని ఆర్ కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని పార్టీలు తొలినాళ్ల నుంచి బీసీలను ఓట్లుగానే చూశాయి తప్ప రాజ్యాధికారంలో వారికి స్థానం ఇవ్వలేదని తెలిపారు. ఐదు శాతం కూడా లేనివారే ఆ పదవులను అనుభవిస్తూ వస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రస్తుతం బీసీలు చైతన్యవంతులయ్యారని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో హైడ్రా కూల్చివేతల్లోబడుగు, బలహీనవర్గాలే ఎక్కువ మంది బాధితులుగా మారుతున్నారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో బడుగు, బలహీనవర్గాల ప్రాతినిధ్యం పెరగాలని, ఆ వర్గాలన్నీ సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. సీఎం కొడంగల్ నియోజకవర్గంలోని నారాయణపేట ఎత్తిపోతల పథకానికి టెండర్లు ఖరారాయ్యాయని, రూ.2,300 కోట్ల టెండర్లు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మేఘా కృష్ణారెడ్డికే వచ్చాయని, ఇందులో బీసీల కోటా ఎక్కడ పోయిందని ప్రశ్నించారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులో బీసీల కోటా ఎంత ఉంటుందో చెప్పాలని మంత్రి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ప్రశ్నించారు. సమగ్ర కులగణనపై 28న కల్వకుర్తిలో బీసీ మహా ధర్నాను నిర్వహించనున్నట్టు తెలిపారు. సభలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్, ఓయూ విశ్రాంత ప్రొఫెసర్ సురేశ్ ముదిరాజ్, బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ డాక్టర్ ఎల్చాల దత్తాత్రేయ, కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్మన్ తుల ఉమ, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిడికిలి రాజు, కేవీ గౌడ్, నిర్మాత, నటి కీర్తి లతాగౌడ్, బీసీ నాయకులు నిర్మల శ్రీశైలంగౌడ్, సీఎల్ శ్రీనివాస్ యాదవ్, దాసరి కిరణ్, నరేశ్ ముదిరాజ్, వెంకటయ్య యాదవ్ పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యత్వానికి కృష్ణయ్య రాజీనామా

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య తన సభ్యత్వానికి సోమవారం సమర్పించిన రాజీనామాను రాజ్యసభ చైర్మన్ ఆమోదించారు. ఈ మేరకు రాజ్యసభ సెక్రటరీ జనరల్ మంగళవారం బులెటిన్‌ను విడుదల చేశారు. ఏపీకి చెందిన వైసీపీ నుంచి రాజ్యసభకు ఎన్నికైన కృష్ణయ్య తన పదవీకాలం మరో నాలుగేండ్లపాటు ఉండగానే తన పదవికి రాజీనామా చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో 11 స్థానాలకు అన్నిస్థానాల్లో వైసీపీ గెలుచుకుని సంఖ్యాబలం పరంగా రాజ్యసభలో నాలుగో అతి పెద్ద పార్టీగా నిలిచింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల అనంతరం వైసీపీ రాజ్యసభ సభ్యత్వాలకు బీద మస్తాన్‌రావు, మోపిదేవి వెంకటరమణ రాజీనామాలు సమర్పించారు. వారిబాటలో ఆర్ కృష్ణయ్య రాజీనామా చేయడంతో వైసీపీకి రాజ్యసభలో సంఖ్యాబలం తగ్గింది.

# వచ్చే పంటకైనా నీళ్లివ్వండి

- విమర్శలు మాని రైతులకు నీరందించండి
- పాలమూరు -రంగారెడ్డి 90 శాతం పూర్తి
- మా మీద కోపంతో పనుల్లో జాప్యం వద్దు
- 10 నెలల తర్వాత ప్రాజెక్టు వద్దకు మంత్రులు
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : వచ్చే పంటకాలానికైనా పాలమూరు – రంగారెడ్డి పథకం నుంచి సాగునీటిని అందించాలని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ కోరారు. పది నెలల తర్వాత ప్రాజెక్టును చూసేందుకు మం త్రులు బుధవారం వస్తున్నారని, వారి పర్యటనను బీఆర్ఎస్ స్వాగతిస్తున్నదని చెప్పారు. కేసీఆర్ హయాంలోనే ప్రాజెక్టు పనులు 90శాతం పూర్తయ్యాయని తెలిపారు. కేవలం కాలువ పని ఉన్నదని, దీనికి కూడా టెండర్లు గతంలోనే పిలిచామని వివరించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్, బొమ్మెర రామమూర్తితో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. వలసల పాలమూరును పచ్చబడేలా చేశారని, పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చిన ఘనత ఆయనదేనని స్పష్టంచేశారు. పాలమూరులో లక్షల ఎకరాలను కొత్తగా సాగులోకి తెచ్చారని గుర్తుచేశారు. తాము పిలిచిన టెండర్లను కొనసాగించి ఉంటే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు ఇప్పటికే పూర్తయ్యేదని, ఈ వానకాలం పంటలకే నీళ్లు వచ్చేవని, కనీసం వచ్చే పంటలకైనా నీళ్లివ్వాలని సూచించారు.

### గతంలో కరువును చూపి అప్పులు

గతంలో పాలమూరుకరువును చూపి ప్రపంచ బ్యాంక్ నుంచి అప్పులు తెచ్చేవారని, ఆ నిధులను ఇతర పనులకు ఖర్చు చేసేవారని శ్రీనివాస్‌గౌడ్ గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో పాలమూరు జిల్లా రైస్ మిల్లుల్లోకి ధాన్యం పుష్కలంగా వచ్చిందని చెప్పారు.కాంగ్రెస్ మంత్రులు భేషజాలకు పోకుండా పాలమూరు పథకాన్ని వెంటనే పూర్తి చేయాలని కోరారు. తమ మీద కోపంతో పనులను ఆలస్యం చేయవద్దని, ఎప్పుడు ప్రాజెక్టు పూర్తి చేస్తారో స్పష్టం చేయాలన్నారు. వట్టెం పంపుహౌస్ మునక బాధ్యులపైనా చర్య లు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రుల పర్యటన పాలమూరు రైతులకు భరోసా ఇచ్చేదిగా ఉండాలని, రాజకీయ విమర్శలకు తావివ్వకుండా రైతుల కోణంలో ఆలోచించాలని సూచించారు. చెక్ డ్యామ్‌లు, కాలువల పనులు పూర్తి చేయడంపై మంత్రులు దృష్టి పెట్టాలని, రిజర్వాయర్లు, లిఫ్టుల వారీగా సమీక్షలు నిర్వహించాలని చెప్పారు. ఇప్పుడు మంత్రిగా ఉన్న జూపల్లికి కేసీఆర్ హయాంలో ప్రాజెక్టుల పురోగతి తెలుసునని గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లపై అధ్యయనానికి త్వరలోనే తమ పార్టీ బృందం తమిళనాడులో పర్యటిస్తుందని ఆయన తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్లకు వారంలో విధివిధానాలు

- అక్టోబర్ 15 నుంచి లబ్ధిదారుల ఎంపిక
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 24(నమస్తే తెలంగాణ): వారం రోజుల్లో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి విధివిధానాలు ఖరారు చేసి అక్టోబర్ 15 నుంచి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపడతామని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా 80 లక్షలమందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు దానికి సంబంధించిన విధివిధానాలపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన లేకపోవడంతో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో పొంగులేటి ఈ వ్యాఖ్యలు చేశారు.

# కాల్వలు తెగడానికి కారణమెవరు?

- దీనిపై విచారణకు సిద్ధమా?
- మంత్రి ఉత్తమ్‌కు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సవాల్



*సూర్యాపేటలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి*

సూర్యాపేట, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : సాగునీటి కాల్వలు తెగడానికి ఎవరు కారణమో తేల్చేందుకు విచారణకు సిద్ధమా? అని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం సాగర్ ఎడమ కాల్వ గండి మరమ్మతు పనులను మంత్రి ఉత్తమ్ పరిశీలించిన సందర్భంగా ఎడమ కాల్వకు గండ్ల పాపం గత ప్రభుత్వ నిర్వాకం అనడంపై జగదీశ్‌రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 'మీ వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకు బీఆర్ఎస్‌పై నిందలు వేస్తారా?' అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఐదేండ్లలో చేయాల్సిన తప్పులను పది నెలల్లోనే చేసిందని, ప్రజలు అన్నీ లెక్కకడుతున్నారని అన్నారు. మంత్రులు తమ వైఫల్యాలను అధికారుల మీద నెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. దుర్మార్గంగా గేట్లకు లాకులు, వెల్డింగులు పెట్టడంతోనే కాల్వలు తెగాయని, ఈ విషయం తెలిసినప్పటికీ 24 రోజుల తరువాత ఆలోచించి కాల్వ గండ్లపై పచ్చి అబద్ధాలు ఆడటం సిగ్గుచేటని అన్నారు. ఖమ్మం మంత్రుల అత్యుత్సాహం, నల్లగొండ మంత్రుల చేతగానితనంతోనే సాగర్ ఎడమ కాల్వ కట్టలు తెగిపోయాయని ఆరోపించారు. హడావిడి పనులతో నాసిరకంగా మరమ్మతులు చేస్తున్నారని, వాటిని కప్పిపుచ్చుకోవడానికి కింది స్థాయి అధికారుల మీద అరవడం మానుకొని, పొలాలకు నీళ్లు అందించాలని హితవుపలికారు.24 రోజులు గడుస్తున్నా పొలాలకు నీళ్లు అందడం లేదని, మంత్రులు పరిపాలన వదిలి ఇల్లు చక్కబెట్టుకునే పనిలో పడ్డారని విమర్శించారు. గతంలో కాల్వలు తెగితే వారం రోజుల్లోనే నీళ్లందించిన విషయాన్ని గుర్తుచేశారు. తక్షణమే 24 గంటలు షిఫ్టుల వారీగా పనిచేయించి మరమ్మతులు పూర్తి చేసి పొలాలకు నీళ్లందించాలని డిమాండ్ చేశారు.

# రేవంత్‌తో బీజేపీ నేతల కుమ్మక్కు

- అమృత్ స్కాంపై మాట్లాడరేం?
- స్కాంపై కేంద్ర మంత్రి స్పందన హాస్యాస్పదం
- బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర బీజేపీ నేతలు కాంగ్రెస్ పెద్దలకు కొమ్ముకాస్తున్నారని బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. అమృత్ స్కాంపై బీజేపీ కేంద్ర మంత్రుల మాటలు చూస్తుంటే ఇవి నిజమనిపిస్తున్నదని చెప్పారు. అమృత్ స్కాం పై కేంద్ర మంత్రి బండి సంజయ్, బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి స్పందనల తీరు హాస్యాస్పదంగా ఉన్నదని ఎద్దేవా చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర విజిలెన్స్ కమిషనర్‌కు లేఖ రాయాలని కోరడం విచిత్రంగా ఉన్నదని, రాష్ట్ర కాంగ్రెస్ పెద్దలను కాపాడే పనిలో బండి సంజయ్ ఉన్నట్టు అర్థమవుతున్నదని ఆరోపించారు. ఇలాంటి వ్యక్తి కేంద్రంలో మంత్రిగా ఉండటం దురదృష్టకరమని విమర్శించారు. తనపైనే ఆరోపణలు వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం సీవీసీ, సీబీఐకి లేఖ రాస్తుందా? అని ప్రశ్నించారు. ఇదే అంశంపై అసెంబ్లీ సమావేశాల సమయంలో మహేశ్వర్‌రెడ్డి సీబీఐ, ఈడీ విచారణ చేయాలని మాట్లాడి ఇప్పుడు నోరెందుకు మెదపడం లేదని నిలదీశారు. అమృత్ మీద మహేశ్వర్‌రెడ్డి అసెంబ్లీలో ఎందుకు మాట్లాడ లేదని ప్రశ్నించారు. ఇప్పుడు సీబీఐ విచారణ కోరాలని మహేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరుతున్నారని, కేంద్రంలో అధికారంలో ఉన్నది మీ పార్టీయే కదా? అని ధ్వజమెత్తారు. మోదీ ఎక్కడికెళ్లినా బీజేపీయేతర ప్రభుత్వాలకు కేంద్ర నిధులు ఏటీఎంగా మారాయంటారని, మరి అమృత్ నిధులు తెలంగాణలో దుర్వినియోగమవుతుంటే విచారణకు ఎందుకు ఆదేశించరని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి కూడా నోరు మెదపకపోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నదని చెప్పారు. కర్ణాటకలో కాంగ్రెస్ అవినీతి మీద బీజేపీ ఉద్యమిస్తుంటే తెలంగాణలో నోరు మూసుకున్నదని ఎద్దేవాచేశారు. ఇప్పటికైనా అమృత్ స్కాంపై విచారణ కోసం బీజేపీ నేతలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.

# రైతు ఇంటి తలుపులు పీకేసిన బ్యాంకర్

- అప్పు చెల్లించలేదని డీసీసీబీ అధికారుల దౌర్జన్యం
- స్థానికులు ఎదురుతిరగడంతో జారుకున్న అధికారులు



*తలుపులను ఊడదీస్తున్న బ్యాంకు అధికారి*



*బ్యాంకు అధికారులు ఊడదీసి పెట్టిన తలుపు*

నెన్నెల, సెప్టెంబర్ 24 : అప్పు చెల్లించడం లేదన్న సాకుతో బ్యాంకు అధికారులు ఓ రైతు ఇంటిపై దౌర్జన్యానికి దిగారు. సదరు రైతు ఇంటి తలుపులు ఊడబీకి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకోవడంతో పారిపోయారు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా నెన్నెల మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకున్నది. నెన్నెలకు చెందిన రైతు గట్టు శివలింగయ్య, అతని తమ్ముడు భానేష్ కలిసి తల్లి పేరిట ఉన్న భూమి తనఖా పెట్టి దాదాపు 8 ఏండ్ల క్రితం భూమి అభివృద్ధి కోసం రూ.2 లక్షలు, శివలింగయ్య తన పేరిట రూ.లక్ష అప్పుగా తీసుకున్నారు. అప్పు తీసుకున్న పట్టాదారైన శివలింగయ్య తల్లి నాలుగేండ్ల కిందట చనిపోయింది. అయినప్పటికీ విడతల వారీగా డబ్బులు చెల్లిస్తూ వస్తున్నారు. ఆరు నెలల క్రితం శివలింగయ్య రూ.20 వేలు బ్యాంకులో చెల్లించాడు. ఈ క్రమంలో మంగళవారం డీసీసీ బ్యాంకు అధికారులు.. రైతు శివలింగయ్య ఇంటికి వచ్చి తీసుకున్న అప్పు చెల్లించాలని పట్టుబట్టారు. రూ.3.60 లక్షల వరకు అప్పు ఉన్నదని, మొత్తం కట్టాలని ఒత్తిడి చేశారు. తన వద్ద అంత డబ్బులేదని, ఇప్పుడు రూ.20 వేలు చెల్లిస్తానని విన్నవించుకున్నాడు. పూర్తిగా చెల్లిస్తేనే సరి.. లేదంటే ఇంట్లో ఏమున్నా అదిపట్టుకుపోతామని బెదిరించారు. దాదాపు రెండు గంటలపాటు వేడుకున్నా వినలేదు. చివరకు ఇంటి తలుపులను అధికారులు ఊడదీశారు. చుట్టుపక్కల వారు వచ్చి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తన వద్ద ఉన్న డబ్బులను కడతానంటే ఎందుకు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. పేద రైతును ఇలా బజారుకు ఈడుస్తారా? అని మండిపడ్డారు. ఊడదీసిన తలుపులు ఎలా తీసుకెళ్తారో చూస్తామని స్థానికులు ఎదురు తిరగడంతో అధికారులు అక్కడి నుంచి జారుకున్నారు. ఈ విషయమై బెల్లంపల్లి డీసీసీబీ మేనేజర్ సురేశ్‌ను 'నమస్తే' ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు.



## రెండ్రోజుల్లో రైతులకు పరిహారం

- కేంద్ర వరదసాయం అందలేదు
- మీడియాతో మంత్రి తుమ్మల

ఖమ్మం, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అకాల వర్షాలు, వరదలతో పంట నష్టపోయిన రైతులకు మరో రెండు రోజుల్లో పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం కలెక్టరేట్‌లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయితో కలిసి మంగళవారం తుమ్మల మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో తీవ్రంగా పంట నష్టపోయిన జిల్లాల నుంచి నివేదికలు అందాల్సి ఉన్నదని తెలిపారు. కేంద్రం నుంచి ఇప్పటివరకు వరద సాయం అందలేదని అన్నారు. తక్షణ సాయంగా కేంద్రం నుంచి రూ.10 వేల కోట్లు కోరినట్టు చెప్పారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల గండిపడిన పాలేరు కాల్వ మరమ్మతు విషయంలో నీటిపారుదల శాఖ అధికారుల మధ్య సమన్వయలోపమే ఆలస్యానికి కారణంగా గుర్తించామని, అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించినట్టు మంత్రి తెలిపారు.



*గండి పడి నీళ్లు లీక్ అయిన ప్రాంతంలో మరమ్మతుల తరువాత ప్రవాహాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి*

# ఎట్టకేలకు నీళ్లిచ్చారు!

- యుద్ధప్రాతిపదికన గండి పూడ్చివేత
- ఖమ్మం రైతులకు సాగర్ జలాలు
- కాలువ నీటిని పరిశీలించిన మంత్రి పొంగులేటి
- ఇరిగేషన్‌అధికారులపై ఆగ్రహం

**హరీశ్‌రావు ఎఫెక్ట్**


కూసుమంచి, సెప్టెంబర్ 24: ఎట్టకేలకు నాగార్జునసాగర్ ఆయకట్టులోని ఖమ్మం జిల్లా రైతులకు సాగునీటిని విడుదల చేసింది. పాలేరు కాలువకు గండిపడి పొలాలు ఎండిపోతున్న నేపథ్యంలో హరీశ్‌రావు సోమవారం హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టి సర్కారు నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. వెంటనే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందించి కాలువ పనులు వేగంగా చేయాలని ఆదేశించారు. దీంతో లీక్ అయిన ప్రాంతంలో సోమవారం నుంచే అధికారులు యుద్ధప్రాతిపదికన పను లు చేపట్టారు. ఎట్టకేలకు మంగళవారం తెల్లవారుజాము నుంచి నీటిని విడుదల చేశారు. కాగా, ఈ నీటి ప్రవాహాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. తదుపరి చర్యల గురించి ఇరిగేషన్ శాఖ అధికారులతో చర్చించారు. జిల్లాకు పూర్తిగా సాగునీరు అందించేందుకు తీసుకుంటున్న జాగ్రత్తలపై వారితో మాట్లాడారు. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజినీర్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో పలు ఆదేశాలు జారీచేశారు. ఇటీవలి వరదలకు పాలేరు కాలువకు గండి పడగా శనివారం అధికారులు దానిని పూడ్చారు. ఆ తరువాత ట్రయల్ రన్‌లో కాలువ నీళ్లు మరోసారి లీక్ అయ్యాయి. దీంతో యూటీని పెల్చి వేసి దానిని డమ్మీ చేశారు. అక్కడ జమ కూడే నీటిని నాలుగు 100 హెచ్‌పీ మోటర్ల ద్వారా తిరిగి నేరుగా కాలువలోకి తరలించాలని నిర్ణయించారు. మంత్రులు పొంగులేటి, తుమ్మల మరమ్మతుల పనులను పరిశీలించారు. లీకేజీ పనులను కూడా ఎట్టకేలకు పూర్తి చేసి మంగళవారం తెల్లవారుజామున 4:30 గంటలకు రింగ్‌బండ్ తీసేసి క్రమంగా నీటిని వదిలారు. మొదట 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. క్రమంగా సామర్థ్యాన్ని పెంచుతూ మంగళవారం రాత్రి వరకు 2000 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. బుధవారం ఉదయం వరకు మూడు వేల క్యూసెక్కుల నీటి విడుదలకు ప్రణాళిక రూపొందించారు.

### ఇరిగేషన్ అధికారులపై ఆగ్రహం

నీటిని వదిలిన తరువాత కాలువ ప్రవాహాన్ని పరిశీలించిన మంత్రి పొంగులేటి.. ఎఫ్‌టీఎల్, కెనాల్ లెవెల్, బండ్ లెవల్ వంటి గణాంకాలను ఇరిగేషన్ అధికారులను అడిగారు. వారు సమాచారాన్ని ఇవ్వలేకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇద్దరు అధికారులను నియమించి గంటగంటకు దాని ప్రోగ్రెస్‌ను కలెక్టర్‌కు తెలియజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి, ఈఈ అనన్య, డీఈ మధు, ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ సంజీవ్, ఎస్సై నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

## బండ్ ఎత్తు పెంచి పూర్తిస్థాయిలో నీళ్లివ్వాలి: పొంగులేటి

బండ్ ఎత్తును పెంచి బుధవారం వరకు జిల్లాలోని చివరి ఆయకట్టు రైతులకు కూడా పూర్తిస్థాయిలో నీటిని అందించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. బండ్ ఎత్తును ఇంకా ఐదు అడుగుల మేర పెంచి మూడు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని ఆదేశించారు. బుధవారం ఉదయం వరకు ఈ పనులు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ ముత్తయ్యానాయుడు మంత్రికి తెలిపారు.



*జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నంలోని రైతు వేదికకు తాళం వేస్తున్న రైతులు*

## మాఫీ రాలేదని రైతువేదికకు తాళం

- నమ్మి ఓటేస్తే.. నోట్లో మట్టికొట్టిన్రు
- రుణమాఫీపై సీఎం మాట తప్పిండు
- 2 లక్షల వరకు మాఫీ చేయాలి: రైతుల డిమాండ్

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 24: 'కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి ఓట్లేస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి మా నోట్లో మట్టికొట్టిండు. పంద్రాగస్టున రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి మాట తప్పిండు. ఇప్పటికైనా రైతులందరికీ రుణాలు మాఫీ చేయాలె. వానకాలం సీజన్ ముగుస్తున్నదున రైతుభరోసాకు నిధులు కేటాయించాలి' అని డిమాండ్ చేస్తూ జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని రైతు వేదికకు మంగళవారం రైతులు తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని.. ఎకరానికి రూ.7,500 చొప్పున రైతుభరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. అంతకుముందు తహసీల్దార్ ప్రసాద్, మండల వ్యవసాయాధికారి రాజ్ కుమార్‌కు వినతిపత్రాలు అందజేశారు.

## రుణమాఫీపై ఎమ్మెల్యే నిలదీత

మొదటిపేజీ తరువాయి...

రైతుభరోసా ఇవ్వాలని, ఆసరా పింఛన్లు క్రమం తప్పకుండా పెంచి ఇవ్వాలని మహిళలు నిలదీశారు. దీంతో ఎమ్మెల్యే జోక్యం చేసుకొని గ్రామంలోని 143 మంది రైతులకు రూ.4.17 కోట్లను మాఫీ చేశామని, కేవలం ముగ్గురికి రాకపోతే గొడవ చేయడం సరికాదన్నారు. ఒకే రేషన్‌కార్డుపై ఇద్దరు, ముగ్గురు రైతులు ఉన్నందున మాఫీ కాలేదని తెలిపారు.

## 30న 'రైతు హామీల సాధన దీక్ష'

**బీజేపీఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి**

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) :కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని ఈ నెల 30న 'రైతు హామీల సాధన దీక్ష' చేపట్టనున్నట్టు బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఇందిరాపార్క్ వద్ద ఉదయం 11 గంటల నుంచి 24 గంటలపాటు దీక్ష చేయనున్నట్టు తెలిపారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్టు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి అసెంబ్లీలో చర్చ కూడా పెట్టలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి అన్నదాతలకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని స్పష్టంచేశారు.


## • సాగునీటి కోసం రైతుల ఆందోళన



*కాలువల ద్వారా సాగు నీటిని అందించాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలోని గిర్నూర్ గ్రామ రైతులు మంగళవారం స్థానిక ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఇచ్చోడ–సోనాల రోడ్డుపై దాదాపు వంద మందికిపైగా రైతులు బైఠాయించారు. పదిహేను రోజులుగా వర్షాలు పడకపోవడంతో చేతికొచ్చిన పత్తి ఎండి పోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. – బజార్‌హత్నూర్*

# ఇద్దరు రైతుల ఆత్మహత్య

- దిగుబడి రాక.. అప్పులు తీర్చలేక మనస్తాపం
- జనగామ, రంగారెడ్డి జిల్లాల్లో బలవన్మరణాలు



*మల్లేశం(ఫైల్)*



*నర్సింహ(ఫైల్)*

లింగాలఘనపురం/కందుకూరు, సెప్టెంబర్ 24: దిగుబడులు సరిగా రాక.. అప్పులు తీర్చేమార్గంలేక జనగామ, రంగారెడ్డి జిల్లాల్లో మంగళవారం ఇద్దరు రైతులు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం కిష్టగూడేనికి చెందిన మేకల మల్లేశం (45) 8 ఎకరాల్లో పత్తి, ఎకరంలో వరిని సాగు చేస్తున్నాడు. ఎవుసం కలిసి రాక అప్పులు కావడంతో మంగళవారం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు హనుమకొండ దవాఖానకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అలాగే అప్పుల బాధ భరించలేక రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్‌పేట్‌కు చెందిన రైతు నందిగామ నర్సింహ (55) ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతడికి మూడు ఎకరాల పొలం ఉన్నది. పెట్టుబడికి డబ్బుల్లేక రెండు ఎకరాల్లో వరి సాగు చేశాడు. అప్పులు అధికం కావడంతో ఆదివారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మరణించాడు.

## ఏపీ వద్దే విద్యుత్తు ఉద్యోగుల పెన్షన్ ఫండ్

- పక్క రాష్ట్రంలో మూలుగుతున్న రూ.3,392 కోట్లు
- తెలంగాణలోని రిటైర్డ్ ఉద్యోగుల అగచాట్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర విభజన జరిగిన పదేండ్లు పూర్తయినా ఇప్పటికీ పలు అంశాలు అపరిష్కృతంగానే ఉన్నాయి. వాటిలో విద్యుత్తు ఉద్యోగుల పెన్షన్ ఫండ్ ఒకటి. రాష్ట్ర విభజన సమయంలో నెలకొన్న సందిగ్ధత వల్ల విద్యుత్తు ఉద్యోగుల పెన్షన్ నిధులన్నీ ఏపీకే వెళ్లాయి. దీంతో తెలంగాణకు చెందిన రూ.3,392 కోట్లు పక్క రాష్ట్రంలో మూలుగుతున్నాయి. ఏపీ జెన్‌కో నుంచి రూ.2,478 కోట్లు, ఏపీ ట్రాన్స్‌కో నుంచి రూ.914 కోట్లు రావాల్సి ఉన్నది. కానీ, ఆ నిధులను ఇవ్వకుండా ఏపీ పేచీకి దిగుతున్నది. ఈ అంశాన్ని ఎన్నిసార్లు ప్రస్తావించినా దాటవేస్తున్నది. దీంతో ఈ భారం తెలంగాణ విద్యుత్తు సంస్థలపై పడనున్నది. 2004కు ముందు విద్యుత్తు సంస్థల్లో నియమితులైన ఉద్యోగులకు పెన్షన్‌ను వర్తింపజేస్తున్నారు. ఆ తర్వాత నియమితులైనవారికి సీపీఎస్ విధానం అమలవుతున్నది. తెలంగాణలోని విద్యుత్తు సంస్థల్లో ఈ ఏడాది మార్చి నుంచి ఉద్యోగుల రిటైర్మెంట్లు మొదలయ్యాయి. దీంతో వారికి పదవీ విరమణ ప్రయోజనాలను చెల్లించాల్సి ఉన్నది. కానీ, ఏపీ నుంచి పెన్షన్ ఫండ్ రాకపోవడంతో తెలంగాణ ప్రభుత్వం, విద్యుత్తు సంస్థలు చేతులెత్తేశాయి. దీంతో రిటైర్డ్ విద్యుత్తు ఉద్యోగులకు అగచాట్లు తప్పడం లేదు. పెన్షన్ ఫండ్‌ను వెనక్కి తెప్పించాలని తెలంగాణ విద్యుత్తు ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి.

## 98 మందితో ఉద్యోగ జేఏసీ కార్యవర్గం

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల హక్కుల సాధనకు ఏర్పడిన తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ పూర్తిస్థాయి కార్యవర్గం కొలువుదీరింది. 98 మంది తో కూడిన పూర్తిస్థాయి కార్యవర్గాన్ని జేఏసీ నేతలు మంగళవారం బాగ్‌లింగపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ప్రకటించారు. ఇప్పటికే జేఏసీ చైర్మన్‌గా మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్‌గా ఏలూరి శ్రీనివాస్‌రావును ఎన్నుకున్నా రు. తాజాగా అడిషనల్ సెక్రటరీ జనరల్‌గా పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్‌గా టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేనీ, టీజీవో ప్రధాన కార్యదర్శి ఎనుగుల సత్యనారాయణ, సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు జీ స్థితప్రజ్ఞను నియమించారు. కో చైర్మన్లుగా చావ రవి, జీ సదానంద్‌గౌడ్, వీ రవీందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మారెడ్డి అంజిరెడ్డి, లింగారెడ్డి, నాగిరెడ్డి, మణిపాల్‌రెడ్డి, జ్ఞానేశ్వర్‌ను ఎన్నుకున్నారు. పెండింగ్ డీఏల విడుదల, బిల్లుల చెల్లింపు, సీపీఎస్ రద్దు, ఈహెచ్‌ఎస్‌ను ప్రకటించాలని మొత్తం గా 42 డిమాండ్లను ప్రభుత్వం ముం దుంచారు. అనంతరం ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను సన్మానించారు.

## మండలానికో ఎంఈవో

### సీనియర్ హెచ్‌ఎంలకు అదనపు బాధ్యతలు

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అన్ని మండలాలకు ఎంఈవోలను నియమి స్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులిచ్చింది. సీనియర్ హెచ్‌ఎంకు ఎంఈవోగా అదనపు బాధ్యతలప్పగించింది. 2005లో చివరిసారిగా ఎంఈవోలుగా పదోన్నతులు కల్పించారు. ప్రస్తుతం 16 మంది మాత్రమే రెగ్యులర్ ఎంఈవోలున్నారు. ఒక్కొక్కరికి ఐదు, ఆరు మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోలుగా అదనపు బాధ్యతలప్పగించారు. ప్రతి మండలానికి ఎంఈవోను నియమించడాన్ని తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ స్వాగతించింది. కొనసాగింపుగా ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను రూ పొందించి, పూర్తిస్థాయి పదోన్నతులు కల్పించాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజభాను చంద్రప్రకాశ్ కోరారు. ఎంఈవోల నియామకం ప్రాథమిక విద్యకు శుభపరిణామమని టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్, ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి అభిప్రాయపడ్డారు.

**ఎంఈవోగా అమెరికాలో ఉన్న హెచ్‌ఎం**

అధికారుల నిర్లక్ష్యానికి ఖమ్మం జిల్లాలో జరిగిన ఎంఈవోల నియామక ఘటన నిదర్శనంగా నిలిచింది. సెలవుపై అమెరికాకు వెళ్లిన ఓ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి ఎంఈవోగా పూర్తిబాధ్యతలు అప్పగించడం ఇప్పుడు విద్యాశాఖలో చర్చనీయాంశంగా మారింది.

## కాళేశ్వర ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

కాళేశ్వరం, సెప్టెంబర్ 24: కాళేశ్వరం దేవాలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ సూచించారు. మంగళవారం ఈవో కార్యాలయంలో ఆలయ అభివృద్ధి, సరస్వతీ పుష్కరాల నిర్వహణకు ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

# బతుకమ్మ చీరలు బంద్

- చీరల పంపిణీని నిలిపివేసిన కాంగ్రెస్ సర్కారు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న తెలంగాణ ఆడబిడ్డలు



హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని ఆడబిడ్డల కోసం ప్రతి ఏడాది కోటి బతుకమ్మ చీరల పంపిణీ పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు పొడిచింది. పండుగ సమీపిస్తున్నా ఇప్పటి వరకు చీరల పంపిణీ ఊసే లేదు. కనీసం కానుకలు ఇచ్చే అంశం కూడా తెరపైకి రాలేదు. దీంతో ఆడబిడ్డలు మనోవేదన చెందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి సంవత్సరంలోనే బతుకమ్మ చీరల పంపిణీకి మంగళం పాడడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన బతుకమ్మ చీరల పంపిణీ రాష్ట్రంలో పండుగలా సాగేది. ఉచిత చీరలతో బతుకమ్మ పండుగను సంబురంగా జరుపుకునేవారు.

**ఆర్డర్లు లేక నేతన్నల ఇక్కట్లు..**

బతుకమ్మ చీరల పంపిణీని నిలిపివేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో నేత కార్మికుల జీవితాలపై తీవ్ర ప్రభావం పడింది. ఈ ఏడాది చీరల తయారీ కోసం ఆర్డర్లు లేక పోవడంతో రాష్ట్రంలోని నేతన్నల జీవితాలు ఛిద్రమవుతున్నాయి. నేత కార్మికులు మళ్లీ ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోతున్నారు. గత సీఎం కేసీఆర్ హయాంలో తీసుకున్న నిర్ణయాలతో చేనేత కార్మికులు అన్ని విధాలా అభివృద్ధి చెందారు. ఆర్థికంగా నిలదొక్కుకున్నారు.

**గత ప్రభుత్వం కేటాయించిన నిధులు..**

| సంవత్సరం | నిధులు(కోట్లలో) |
|---|---|
| 2017 | 222.48 |
| 2018 | 280.00 |
| 2019 | 313.00 |
| 2020 | 317.81 |
| 2021 | 333.14 |
| 2022 | 339.73 |
| 2023 | 351.52 |
| మొత్తం | 2157.68 |

2017 నుంచి 2023 వరకు ప్రతి ఏడాది దాదాపు కోటి మంది మహిళలకు ఉచితంగా చీరల పంపిణీ చేశారు. చీరల తయారీకి ఏడాదికి దాదాపు రూ.300 కోట్లకు పైగానే మొత్తం రూ.2,157 కోట్లు కేటాయించింది.



పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ప్రధాన చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, నాయకులు

## 33 శాతం వాటా ఇవ్వాల్సిందే

- రాష్ట్ర ప్రభుత్వం కోతపెడితే ఊరుకోం: మిర్యాల రాజిరెడ్డి
- పలుచోట్ల ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం

గోదావరిఖని, సెప్టెంబర్ 24: సింగరేణి కార్మికుల లాభాల వాటాలో కోతపై టీబీజీకేఎస్ నిరసనల్లో భాగంగా మంగళవారం పెద్దపల్లి జిల్లాలోని ఆర్జీ-1, 2, 3 ఏరియాల్లో కార్మికులు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టీబీజీకేఎస్ ఆర్జీ-1 ఉపాధ్యక్షుడు వడ్డెపల్లి శంకర్ ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో జరిగిన నిరసనలో టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి మాట్లాడుతూ.. సంస్థ ప్రకటించిన రూ.4,701 కోట్ల లాభాలపై 33 శాతం వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్జీ-3 ఏరియా సెంటినరీకాలనీలో టీబీజీకేఎస్ ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు నాగెల్లి సాంబయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

# మూసీ నిర్వాసితులకు డబుల్ ఇండ్లు

- 16 వేల గృహాలు కేటాయిస్తూ సర్కార్ ఉత్తర్వులు
- రివర్‌బెడ్, బఫర్‌జోన్‌లో ఉన్నవారికి పునరావాసం
- సర్వేలో 10,200 మంది నిర్వాసితులుగా గుర్తింపు
- పేదల ఇండ్లు కూల్చితే మరోచోట ఇండ్లివ్వాలని ఉదయమే మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్
- ఖాళీ ఉన్న 40 వేల డబుల్ బెడ్రూం ఇండ్లు నిరుపేదలకు ఇవ్వాలని సూచన
- సాయంత్రంలోగా గృహాలు కేటాయించిన సర్కారు



హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : మూసీ నది అభివృద్ధిలో భాగంగా నిర్వాసితులయ్యే కుటుంబాలకు 16 వేల డబుల్ బెడ్ రూం ఇండ్లను కేటాయిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్, హైదరాబాద్ మెట్రో రైలు అంశాలపై జూబ్లీ హిల్స్‌లోని తన నివాసంలో అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించిన అనంతరం ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. మూసీ రివర్ బెడ్ (నదీ గర్భం), బఫర్ జోన్‌లో ఉన్న వారికి పునరావాసం కల్పించేందుకు డబుల్ బెడ్ రూం ఇండ్లను కేటాయిస్తారు. ఇప్పటికే అధికారులు చేపట్టిన సర్వే ప్రకారం 10,200 మందిని నిర్వాసితులుగా గుర్తించారు. రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ కలెక్టర్ల ఆధ్వర్యంలో అధికారుల బృందాలు బుధవారం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఎక్కడెక్కడ ఇండ్లను కేటాయించారో తెలియజేస్తారు. ముందుగా రివర్ బెడ్‌లో ఆక్రమణలో ఉన్న 1600 ఇండ్లను తొలగించి అక్కడివారిని తరలిస్తారు. మూసీ బఫర్ జోన్‌లో నిర్మాణాలకు పరిహారం చెల్లిస్తారు. నిర్మాణ ఖర్చుతో పాటు, పట్టా ఉంటే భూమి విలువను పరిహారంగా ఇస్తారు. డబుల్ బెడ్ రూం ఇల్లు కూడా కేటాయిస్తారు. మూసీ నిర్వాసితులకు చట్ట ప్రకారం పునరావాసం కల్పిస్తామని సీఎం ఇదివరకే ప్రకటించారు.

**ఉదయం కేటీఆర్ డిమాండ్.. సాయంత్రంలోగా సర్కార్ స్పందన**

'పేదలే దిక్కులేక నాలాలపై ఇండ్లు కట్టుకుంటరు.. మానవత్వం ఉన్న ప్రభుత్వమైతే తొలుత వారికి నోటీసులివ్వాలి.. లేదంటే వారికి వేరేచోట ఇండ్లు ఇవ్వాలి.. మేము కట్టిన 40 వేల డబుల్ బెడ్రూం ఇండ్లున్నయి. వాటిని పేదలకు ఇవ్వాలి' అని మంగళవారం ఉదయం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేయడంతో పాటు పలు సూచనలు చేశారు. సాయంత్రం వరకు మూసీ నిర్వాసితులకు 16వేల డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

**ఆక్రమణల వివరాలివ్వండి : సీఎం**

ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న చెరువులు, కుంటలు, నాలాలను గుర్తించి, వాటి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను నిర్ధారించాలని, ఆక్రమణల వివరాలు సేకరించి నివేదిక ఇవ్వాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇకపై చెరువులు, నాలాలు ఆక్రమణకు గురికాకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయాలని సూచించారు. ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీకి మెట్రో మార్గానికి పూర్తిస్థాయి నివేదిక రూపొందించాలని చెప్పారు. ఓల్డ్ సిటీ మెట్రో విస్తరణ పనులను వేగవతం చేయాలని, మెట్రో మార్గాల్లో భూసేకరణ, ఇతర అడ్డంకులుంటే పరిష్కరించాలని సూచించారు. ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్, ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట మెట్రో విస్తరణ అంశాలను వివరించారు. దసరాలోపు మెట్రో విస్తరణ రూట్ పూర్తిస్థాయి డీపీఆర్‌ను సిద్ధంచేసి కేంద్రానికి సమర్పించాలని స్పష్టంచేశారు. సమీక్షలో మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్, మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, సలహాదారు శ్రీనివాసరాజు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

## ఫైన్‌ఆర్ట్స్ వర్సిటీకి.. అంబేద్కర్ వర్సిటీ స్థలం

- పదెకరాలు కేటాయించిన సర్కారు
- మండిపడుతున్న బీఆర్ఏఓయూ ఉద్యోగులు

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): ఉద్యోగులు, సంఘాలు వద్దని ఎంత వారించినా..ప్రభుత్వం వీటిని లెక్కచేయకుండా బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి చెందిన పదెకరాలను ఫైన్ ఆర్ట్స్ వర్సిటీకి కేటాయించింది. అది అత్యంత గోప్యంగా.. రహస్యంగా. జూబ్లీహిల్స్‌లోని బీఆర్ఏఓయూకు చెందిన పదెకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి కేటాయించింది. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం మంగళవారం రెండు వర్సిటీల రిజిస్ట్రార్లకు లేఖ రాశారు. వర్సిటీకి స్థల కేటాయింపు విషయాన్ని ఇటీవలే 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ ప్రతిపాదనలను బీఆర్ అంబేద్కర్ వర్సిటీ ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించి, నిరసన ప్రదర్శనలు సైతం నిర్వహించాయి. ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశాయి. కానీ వాటిని లెక్కచేయకుండా సర్కారు మంగళవారం స్థలాన్ని కేటాయిస్తున్నట్టు రెండు వర్సిటీలకు లేఖ రాసింది. ఈ నిర్ణయంపై విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, టీచర్లు, సిబ్బందిని సమీకరించి జేఏసీగా ఏర్పడి త్వరలోనే ఆందోళనను తీవ్రతరం చేస్తామని బీఆర్ఏఓయూ ఉద్యోగులు హెచ్చరించారు. ఒక్క ఇంచు స్థలాన్ని కూడా వదులుకోబోమని స్పష్టంచేశారు.

## అక్టోబర్ 9న సింగరేణి కార్మికులకు బోనస్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): సింగరేణి యాజమాన్యం కార్మికులకు అక్టోబర్ 9న లాభాల్లో బోనస్ చెల్లించనున్నది. వచ్చే నెల వేతనంతో పాటు దసరా అడ్వాన్స్‌గా కార్మికుల ఖాతాల్లో జమచేయనున్నది. సింగరేణి సీఎండీ బలరాం మంగళవారం అమెరికా నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సింగరేణి డైరెక్టర్లు, అన్ని ఏరియాల జీఎంలు, కార్పొరేట్ జీఎంలతో నిర్వహించిన సమావేశంలో విధివిధానాలు ఖరారు చేయాలని ఆదేశించారు. లాభాల వాటా కింద మంజూరు చేసిన రూ. 796 కోట్లలో సంస్థలోని 42 వేలమంది కార్మికులు, ఉద్యోగులకు సగటున రూ.1.90 లక్షల చొప్పున బోనస్ దక్కనున్నది. 25 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు రూ. 5 వేల చొప్పున అందజేయాలని నిర్ణయించింది.

## సీతారాం ఏచూరి ఆదర్శప్రాయుడు

### సీపీఐ నిర్వహించిన సంతాపసభలో వక్తల నివాళి

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): మార్క్సిస్టు పార్టీ దిగ్గజం, పేద ప్రజల గొంతుక, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి భౌతికంగా దూరం కావడం వామపక్షాలతోపాటు దేశ క్షేమాన్ని కోరుకునే వారికి తీరని నష్టమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఇటీవల మరణించిన సీతారాం ఏచూరి సంతాపసభను సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. సభలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో పలువురు సీపీఐ నేతలు ప్రసంగించారు. సమకాలీన రాజకీయాల్లో సీతారాం ఏచూరి ఆదర్శప్రాయుడని వివరించారు. అంతకుముందు ఏచూరి జీవిత చరిత్ర పుస్తకాన్ని వక్తలు ఆవిష్కరించారు.

**హైడ్రాపై శ్వేతపత్రం ఇవ్వాలి : కూనంనేని**

చెరువులు, ప్రభుత్వ భూములపై సర్వే చేపట్టి, ఇందులో పేదలు, పెద్దల నిర్మాణాలు, పట్టాలు ఉన్నవారు ఎంతమంది ఉన్నారో ఒక శ్వేతపత్రం విడుదలచేయాలని కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైడ్రాతో పేదలు బలి కాకుండా చూడాలని కోరారు. ఈ అంశంపై పాలసీని రూపొందించాలన్నారు.

## డీఎస్సీ 2008 అభ్యర్థులకు తీపికబురు

- 2,367 మందికి కాంట్రాక్ట్ ఉద్యోగాలు
- 27 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్
- ఉత్తర్వులు విడుదల చేసిన విద్యాశాఖ

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ-2008 అభ్యర్థులకు క్యాబినెట్ నిర్ణయం మేరకు కాంట్రాక్ట్ ఉద్యోగాలు ఇవ్వనున్నట్టు విద్యాశాఖ వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా 2,367 మంది అభ్యర్థులకు ఈ నెల 27 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్టు విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అక్టోబర్ 5 వరకు వెరిఫికేషన్ కొనసాగుతుందని, ఉమ్మడి జిల్లాల వారీగా కాంట్రాక్ట్ పద్ధతిలో పోస్టింగ్‌లు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగాలకు ఒప్పుకుంటున్నట్టు సర్టిఫికెట్ వెరిఫికేషన్ సమయంలోనే సమ్మతిపత్రం సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు 2008 డీఎస్సీలో 30 శాతం కోటాతో నష్టపోయిన అభ్యర్థుల జాబితాను ఉమ్మడి జిల్లాల వారీగా డీఈవోలకు పంపినట్టు పేర్కొన్నారు. వివరాలను విద్యాశాఖ వెబ్‌సైట్‌లోనూ పొందుపరిచినట్టు తెలిపారు. నేటికి తమ 14 ఏండ్లనాటి కల నేరవేరనున్నదని డీఎస్సీ- 2008 మెరిట్ బీఈడీ క్యాండిడేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, కార్యదర్శులు సంగమేశ్వర్, చంద్రశేఖర్, రమేశ్, డీఎస్సీ-2008 సాధన సమితి అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్ తదితరులు తెలిపారు.

- హైదరాబాద్ మినహా మిగతా ఉమ్మడి జిల్లాల్లోని డీఈవోల ఆధ్వర్యంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుగనున్నది.
- డీఈవోలు ఎవరెవరికి ఉద్యోగాలు ఇవ్వవచ్చో, ఎవరికి ఇవ్వరాదో సూచిస్తూ అక్టోబర్ 6న నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది.

## రాష్ట్ర ఉత్సవంగా లక్ష్మణ్ బాపూజీ జయంతి

హైదరాబాద్, సెప్టెంబర్ 24(నమస్తే తెలంగాణ) : తెలంగాణ సాధన పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని సర్కారు నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 27న లక్ష్మణ్ బాపూజీ జయంతిని ఉత్సవంగా నిర్వహించాలని ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ అన్ని జిల్లాల కలెక్టర్లకు విజ్ఞప్తిచేశారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేయాలని బీసీ సంక్షేమ శాఖను ఆదేశించారు. అలాగే వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహించాలని నిశ్చయించింది. ఇందుకు సంబంధించి ఈ నెల 26న ఏర్పాట్లు చేయాలని బీసీ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశిస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీచేశారు.

## దర్శనం మొగిలయ్యకు ఇంటి స్థలం

### ధ్రువీకరణ పత్రం అందజేత

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): కిన్నెర వాయిద్యకారుడు పద్మశ్రీ దర్శనం మొగిలయ్యకు రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో 600 చదరపు గజాల స్థలాన్ని కేటాయించింది. ఇందుకు సంబంధించిన స్థల ధ్రువీకరణ పత్రాన్ని మంగళవారం మొగిలయ్యకు సీఎం రేవంత్‌రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అందజేశారు.

# డీఎస్సీ ఫలితాలపై సస్పెన్స్

- ఫైనల్ కీ అభ్యంతరాలపై తేల్చని విద్యాశాఖ
- త్వరగా తేల్చాలని అభ్యర్థుల డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ ఫలితాల విడుదలపై సస్పెన్స్ కొనసాగుతున్నది. ఫైనల్ కీ అభ్యంతరాలపై విద్యాశాఖ ఏదీ తేల్చడంలేదు. ఇప్పటివరకు జనరల్ ర్యాంకింగ్ జాబితా సైతం విడుదల కాలేదు. 6న పాఠశాల విద్యాశాఖ డీఎస్సీ తుది 'కీ'ని విడుదల చేయగా, 210కి పైగా అభ్యంతరాలొచ్చాయి. అభ్యర్థులు పలు పుస్తకాల్లోని ఆధారాలతో సహా అభ్యంతరాలను అధికారుల ముందుంచారు. వాటిని విద్యాశాఖ అధికారులు ఎస్సీఈఆర్టీ పరిశీలనకు పంపించారు. దీంతో కథ మొదటికొచ్చింది. డీఎస్సీ మార్కులకు టెట్ మార్కులు కలిపి ఫలితాలు విడుదల చేయాల్సి ఉంది. అయితే టెట్ మార్కుల అప్‌లోడింగ్, సవరణకు విద్యాశాఖ అవకాశమివ్వగా దీంట్లోనూ పలు తప్పిదాలు వెలుగుచూశాయి. సాంకేతిక సమస్యలతో కొంతమందికి కొత్త మార్కులు అప్‌లోడ్ చేసినా పాతవే ప్రత్యక్ష్యమయ్యాయి. ఒక సబ్జెక్టుకు పరీక్షరాస్తే మరో సబ్జెక్టు వెబ్‌సైట్‌లో చూపించింది. దీంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఎస్సీఈఆర్టీ సబ్జెక్టు నిపుణులు అభ్యంతరాలపై ఓ నివేదికను రూపొందించి విద్యాశాఖ అధికారులకు సమర్పించినట్టుగా తెలిసింది. అయితే దీనిపై ముందుకెళ్లాలా..లేక ఇప్పటికే ప్రకటించిన తుది 'కీ' ప్రకారమే నడుచుకోవాలా..? అన్న విషయంలో విద్యాశాఖ ఏదీ తేల్చుకోలేకపోతున్నది. దీంతోనే ఫలితాలపై సస్పెన్స్ కొనసాగుతున్నట్టుగా తెలుస్తున్నది.

**ఆందోళనలో లక్షలాది అభ్యర్థులు**

డీఎస్సీ ఫలితాలపై విద్యాశాఖ నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నది. ఫైనల్ 'కీ' విడుదల చేసి 20 రోజులుదాటినా ఇంతవరకు ఫలితాలు విడుదల చేయకపోవడం ఆందోళనకరం. ఫైనల్ 'కీ' తప్పులపై క్లారిటీ ఇవ్వకపోవడంతో లక్షలాది మంది అభ్యర్థులు ఆందోళనలో ఉన్నారు. వెంటనే జీఆర్ఎల్‌ను విడుదల చేసి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పూర్తిచేయాలి.

– రావుల రామ్మోహన్‌రెడ్డి, డీఎల్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

## భట్టీ బ్రదర్స్.. వర్గీకరణపై వైఖరేమిటి?

- స్పష్టం చేయకుంటే ఇండ్లను ముట్టడిస్తాం
- ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ చెన్నయ్య

ఖైరతాబాద్, సెప్టెంబర్ 24 : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎంపీ మల్లు రవి.. ఎస్సీ వర్గీకరణపై తమ వైఖరిని తక్షణమే స్పష్టంచేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ జీ చెన్నయ్య డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని మాల సామాజికవర్గాలు అభివృద్ధి చెందాయనే తప్పుడు ప్రచారాన్ని చేసి, వర్గీకరణ అంశాన్ని ముందుకు తీసుకొచ్చారని, వారి ఆర్థిక స్థితిగతులు పరిశీలించాల్సిన అవసరం ఉందని చెప్పారు. వర్గీకరణతో మాలలు అధికంగా నష్టపోతారని పేర్కొన్నారు. మంత్రివర్గ ఉప సంఘానికి బదులు సిట్టింగ్ జడ్జితో కమిటీని ఏర్పాటు చేయాలని డిమాం డ్ చేశారు. మంత్రివర్గ ఉప సంఘం నుంచి మాల ప్రజాప్రతినిధులు వెంటనే తప్పుకొని, వారి వైఖరిని వెంటనే ప్రకటించాలని, లేకుంటే మాలల ద్రోహులుగా ప్రకటించి వారి ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. కులగణనకు కాంగ్రెస్ పార్టీ అనుకూలమని స్వయంగా ఏఐసీసీ నేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే ప్రకటించారని, మందకృష్ణ మాదిగకు చిత్తశుద్ధి ఉంటే ప్రధాని మోదీని ఒప్పించి కులగణనకు ఒప్పించాలని డిమాండ్ చేశారు.

# 30 నుంచి ఓటరు నమోదు

- మార్చిలో ఖాళీ కానున్న మూడు ఎమ్మెల్సీ సీట్లు
- ఎన్నికల అధికారులతో సీఈవో సుదర్శన్ వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఖాళీ కానున్న మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఓట రు జాబితా రూపొందించే ప్రక్రియ ఈనెల 30వ తేదీ నుంచి ప్రారంభంకానున్నది. వచ్చే మార్చి 29తో రాష్ట్రంలో మూడు ఎమ్మె ల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ ఉమ్మడి జి ల్లాల గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీలు, వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లా ల టీచర్ ఎమ్మెల్సీ సీట్లు ఖాళీ అవ్వనున్నాయి. ఈ నెల 30వ తేదీ నుంచి ఓటరు నమోదు ప్రారంభంకానున్న నేపథ్యంలో సీఈవో సీ సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అర్హులైన వారందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు.

**ఓటరు నమోదు షెడ్యూల్**

| | |
|---|---|
| నమోదు ప్రక్రియ ప్రారంభం: | సెప్టెంబర్ 30, 2024 |
| నమోదుకు చివరి తేదీ: | నవంబర్ 6 |
| ముసాయిదా ఓటరు జాబితా: | నవంబర్ 23 |
| జాబితాపై అభ్యంతరాల స్వీకరణ: | నవంబర్ 23 నుంచి డిసెంబర్ 9 |
| ఓటరు తుది జాబితా ప్రచురణ: | డిసెంబర్ 30, 2024 |

## డ్రగ్స్ బారిన పడకండి : జూనియర్ ఎన్టీఆర్




హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : తాత్కాలిక ఆనందాల కోసం డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన వీడియో సందేశాన్ని తెలంగాణ నార్కోటిక్ బ్యూరో తన ఎక్స్ ఖాతాలో విడుదల చేసింది. దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని, క్షణికమైన ఒత్తిడి, సహచరుల ప్రభావం వల్ల డ్రగ్స్‌కు బానిసలు కావొద్దని సూచించారు. జీవితం అన్నింటి కంటే విలువైనదని, డ్రగ్స్ రహిత సమాజం కోసం కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు.

# 46 జీవోపై క్యాబినెట్ సబ్‌కమిటీ ఎక్కడ ?

## 60 రోజుల రిపోర్టు.. 6 నెలలైనా రాలె!

- హైకోర్టులో తమ గొంతునొక్కారని అభ్యర్థుల ఆవేదన
- సుప్రీంకోర్టుకు వెళ్లే యోచనలో బాధితులు



*హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): 'అరవై రోజుల్లో ఇస్తామన్న క్యాబినెట్ సబ్‌కమిటీ రిపోర్టు ఆరు నెలలైనా రాలేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో నం.46ను రద్దు చేస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ నేతలు హోరెత్తించారు. మమ్మల్ని రెచ్చగొట్టి ఆందోళనలు చేయించారు. కొందరు కాంగ్రెస్ నేతలు ఇందిరాపార్క్ దగ్గర దీక్షలు కూడా చేపట్టారు. మేమున్నామంటూ కపట ప్రేమను నటించారు. ఎన్నికల్లో మాతో, మా కుటుంబసభ్యులతో ఓట్లు వేయించుకొని.. గెలిచి, అధికారంలోకి వచ్చాక మమ్మల్ని నట్టేట ముంచారు. కాంగ్రెస్ అంటేనే కమిటీలతో కాలయాపన' అంటూ జీవో 46 బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అతిపెద్ద ప్రణాళికతో హైకోర్టులో తమ పిటిషన్‌ను కొట్టివేసేలా పావులు కదిపిన నేతలు.. రేపు ఏ ముఖం పెట్టుకొని పంచాయతీ ఎన్నికల్లో ఓటు అడుగుతారో చూస్తాం అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో అత్యధిక మార్కులు వచ్చిన తమకు ఉద్యోగం ఇవ్వకుండా జీవోను అడ్డంపెట్టుకొని టీజీఎల్‌పీఆర్బీ చైర్మన్ తమను నట్టేట ముంచాడని ఆరోపిస్తున్నారు. తమకు హైకోర్టులో న్యాయం జరగకపోవడంతో.. సుప్రీంకోర్టుకు వెళ్లే యోచనలో ఉన్నట్టు తెలిపారు.*

**ఎన్నికలకు మందు.. ఆ తర్వాత..**

*జీఓ నం.46ను రద్దు చేయాలి. టీఎస్ఎస్పీలో కానిస్టేబుల్ పోస్టులకు తెలంగాణ అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ 2023 జూలై 19న ఇందిరాపార్క్‌లో గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో దీక్షకు పిలుపునిచ్చింది. ఆ దీక్షకు సహకరించిన ప్రస్తుత టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సహా కాంగ్రెస్ నేతలందరూ ఇప్పుడు ముఖం చాటేస్తున్నారని బాధిత అభ్యర్థులు వాపోతున్నారు. జీవో 46పై క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటుచేసి వారికి న్యాయం చేస్తామని, పాలనాపరంగా, చట్టపరంగా నిపుణుల సూచనలు తీసుకొని జీవోకు సంబంధించిన ఇబ్బందులను అధిగమిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారని అంటున్నారు. క్యాబినెట్ సబ్‌కమిటీ ఏర్పడి ఆరు నెలలు గడిచినా.. ఒక్కసారి కూడా తమ సమస్యలపై చర్చ జరపలేదుని, వివరాలు తీసుకోలేదని.. ఈ కమిటీతో ఇంతవరకూ తమకు న్యాయం జరగలేదని విమర్శిస్తున్నారు.*

**వరస వాయిదాలు కోరిన ఏజీ..**

*టీజీఎల్‌పీఆర్బీ చైర్మన్ వీవీ శ్రీనివాసరావు ఆడిన ఆటలో నాటి ప్రభుత్వం, గ్రామీణ ప్రాంత అభ్యర్థులు మోసపోయారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని రూ.18 లక్షలు ఖర్చుపెట్టి 8 నెలలుగా పోరాడితే.. ప్రభుత్వం తెలివిగా ఆ కేసును కొట్టివేసేలా వాదించాలని ఒత్తిడి తెచ్చిందని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే రాష్ట్ర అడ్వకేట్ జనరల్ వరుసగా వాయిదాలు కోరారని వివరించారు. కోర్టు స్టే ఆర్డర్‌ను ధిక్కరించి ఫలితాలు వెల్లడించారని తెలిపారు. దీనిపై మంత్రులకు, డీజీపీకి మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని అన్నారు. తాము కోర్టుకు వెళ్లిన తర్వాతే జీవో 40 కాపీని టీజీఎస్‌పీఆర్బీ వెబ్‌సైట్‌లో పెట్టారని చెబుతున్నారు. రిజల్ట్ రాకముందు రూ.50 వేలు పెట్టి కోర్టుకు వెళ్తే.. వారు స్టే ఆర్డర్ ఇచ్చారని, అయితే.. దాన్ని కూడా ధిక్కరించి రాత్రికి రాత్రే.. ఫలితాలు విడుదల చేశారని మంత్రులు ఇప్పటికైనా ఖాళీగా ఉన్న రెండు వేల పోస్టులను తమతో భర్తీ చేయాలని కోరుతున్నారు. అందుకోసం సూపర్ న్యూమరీ పోస్టులు క్రియేట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తమతో ఉద్యమం చేయించిన కాంగ్రెస్ నేతలు ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలని కోరుతున్నారు. న్యాయం చేయకపోతే.. కాంగ్రెస్ మోసపూరిత వైఖరిపై ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.*

## ముడా కేసులో సిద్ధరామయ్యకు షాక్

### నిస్సందేహంగా దర్యాప్తు అవసరమని హైకోర్ట్ వ్యాఖ్య



బెంగళూరు: మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) కేసులో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు హైకోర్టు మంగళవారం గట్టి షాక్ ఇచ్చింది. ఆయన సతీమణికి 14 స్థలాల కేటాయింపులో అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయనపై దర్యాప్తు జరిపేందుకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ఇచ్చిన అనుమతిని సిద్ధరామయ్య సవాల్ చేశారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. పిటిషన్‌లో వివరించిన అంశాలపై నిస్సందేహంగా దర్యాప్తు అవసరమని తెలిపింది. స్థలాల లబ్ధిదారు పిటిషనర్ కుటుంబ సభ్యురాలేనని గుర్తు చేసింది. ఈ కేసులో విచారణను నిలుపుదల చేయాలని ప్రజా ప్రతినిధుల కోర్టుకు గత నెల 19న జారీ చేసిన తాత్కాలిక ఆదేశాలను మంగళవారం రద్దు చేసింది.

**న్యాయ నిపుణులతో సంప్రదిస్తా: సిద్ధూ**
హైకోర్టు తీర్పుపై సిద్ధరామయ్య స్పందిస్తూ, తాను స్థలాల కేటాయింపు కేసులో దర్యాప్తును ఎదుర్కొనేందుకు సందేహించబోనన్నారు. అయితే, ఇటువంటి దర్యాప్తునకు చట్టం అనుమతిస్తుందా? లేదా? అనే అంశంపై న్యాయ నిపుణులతో చర్చిస్తానని చెప్పారు. తనకు రాజ్యాంగం, చట్టాలపై నమ్మకం ఉందని, అంతిమంగా సత్యమే విజయం సాధిస్తుందని తెలిపారు. బీజేపీ, జేడీఎస్‌ల ప్రతీకార రాజకీయాలకు వ్యతిరేకంగా న్యాయ పోరాటం కొనసాగుతుందన్నారు.

**సిద్ధూ రాజీనామాకు బీజేపీ డిమాండ్**
హైకోర్టు తీర్పు నేపథ్యంలో సిద్ధరామయ్య ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. ముడా కేసులో స్వతంత్ర, స్వేచ్ఛాయుత దర్యాప్తునకు మార్గం సుగమం చేయాలని కోరింది. బీజేపీ నేత రాజీవ్ చంద్రశేఖర్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, గవర్నర్ ఆదేశాలను హైకోర్టు సమర్థించిందన్నారు.



## 'ప్రధాని, రాష్ట్రపతి పదవుల్లో హిందువులు లేరు'

లక్నో, సెప్టెంబర్ 24: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై జ్యోతిర్మఠం శంకరాచార్య అవిముక్తేశ్వరానంద సరస్వతి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని, రాష్ట్రపతి పదవుల్లో ఇప్పటివరకు హిందువులు లేరని ఆయన లక్నోలో వ్యాఖ్యానించారు. ప్రధాని, రాష్ట్రపతి హిందువులే కదా అని ఓ మీడియా ప్రతినిధి అడిగినప్పుడు.. 'వారిలో హిందువులు ఎవరు? ఏ రాష్ట్రపతి హిందువు? ఏ ప్రధాని హిందువు? ఒక వేళ వారు హిందువులే అయి ఉంటే వారి హయాంలో గోవధ జరుగుతుండేదా? ఇప్పటివరకు ఈ పదవుల్లో హిందువులు ఎవరూ లేరు. హిందువు ఈ పదవుల్లో ఉంటే గోవధకు వారి అంతరాత్మ అనుమతించదు. తన పదవికి రాజీనామా చేసే వారు లేదా గోవధ నిషేధమని ఉత్తర్వులు ఇచ్చేవారు' అని వ్యాఖ్యానించారు.




## 8వ రోజుకు జరాంగే నిరాహార దీక్ష

### ఆయన డిమాండ్‌ను వ్యతిరేకిస్తూ ఇద్దరి నిరసన

జాల్నా, సెప్టెంబర్ 24: మరాఠాలకు ఓబీసీల కింద రిజర్వేషన్లు కోరుతూ మరాఠా కోటాఉద్యమ నేత మనోజ్ జరాంగే చేస్తున్న ఆమరణ దీక్ష మంగళవారానికి 8వ రోజుకు చేరుకుంది. జాల్నాలోని అంతర్వాలి సారథి గ్రామం లో ఈ నెల 17 నుంచి చేస్తున్న దీక్షతో ఆయన ఆరోగ్యం క్షీణించింది. అయినా ద్రవ పదార్థాలు కానీ, వైద్య సహాయం కానీ తీసుకోవడానికి ఆయన నిరాకరించారు. ఇలా ఆయన దీక్ష చేపట్టడం ఏడాది కాలంలో ఆరోసారి. ఇలావుండగా మరాఠాల ఓబీసీ రిజర్వేషన్ల డిమాండ్‌ను వ్యతిరేకిస్తూ సమీపంలోని వాడిగోద్రి గ్రామంలో ఓబీసీ నేతలు లక్ష్మణ్ హాకే, నవనాథ్ వాఘ్‌మేర్‌లు కూడా దీక్ష చేపట్టారు.

# అదానీకి అర్పణ!

- మోదీ దోస్తుకు బీజేపీ పాలిత రాష్ట్రాలు జీ హుజూర్
- అదానీ పవర్‌కు కాంట్రాక్ట్ వచ్చేలా టెండర్ రూల్స్
- మహారాష్ట్ర, రాజస్థాన్ లోపభూయిష్ట విధానాలు
- 'ది రిపోర్టర్స్ కలెక్టివ్'లో సంచలన విషయాలు



(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): ఆప్త మిత్రుడు అదానీ కంపెనీలకు ఆర్థికంగా మేలు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్రంలోని ఎన్డీఏ సర్కారు మాత్రమే కాదు.. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలు కూడా ఉవ్విళ్లూరుతున్నాయి. బీజేపీ పాలిత రాజస్థాన్, మహారాష్ట్ర తాజా విద్యుత్తు టెండర్లకు సంబంధించి 'ది రిపోర్టర్స్ కలెక్టివ్' ఓ సంచలన కథనాన్ని ప్రచురించింది. అదానీ పవర్ కంపెనీల ఉత్పత్తి సామర్థ్యం ఏ మేరకు ఉన్నదో తెలుసుకొని మరీ టెండర్ నియమాలను ఆ మేరకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధం చేశాయని నివేదిక మండిపడింది.

**రూల్స్ అలాగే సిద్ధం**
రానున్న 25 ఏండ్ల విద్యుత్తు అవసరాలకుగాను మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల టెండర్లకు ప్రకటనలు ఇచ్చాయి. సోలార్, థర్మల్ ఇలా రెండు పవర్ ప్లాంట్లను నిర్వహించే కంపెనీలే బిడ్‌లో పాల్గొనాలని మెలిక పెట్టాయి. 6,600 మెగావాట్ల విద్యుత్తులో 5 వేల మెగావాట్లు సోలార్ ప్లాంట్ల నుంచి మిగతాది థర్మల్ ప్లాంట్ల నుంచి ఉత్పత్తి చేయాలని మహా ప్రభుత్వం పేర్కొనగా.. 11,200 మెగావాట్ల విద్యుత్తులో 8 వేల మెగావాట్ల విద్యుత్తు సోలార్ ప్లాంట్ల నుంచి మిగతాది థర్మల్ పవర్ ప్లాంట్ల నుంచి ఉత్పత్తి జరిగేలా రాజస్థాన్ నిబంధనలు విధించింది. అయితే, దేశంలో చాలా తక్కువ కంపెనీలు మాత్రమే సోలార్, థర్మల్ పవర్ ప్లాంట్లను నిర్వహిస్తున్నాయని, అందులోనూ ఇంత సామర్థ్యంతో అదానీ మినహా మరే ఇతర కంపెనీలు విద్యుదుత్పత్తి చేయడం లేదని పారిశ్రామిక నిపుణులు చెప్తున్నారు. అదానీ గ్రూప్ కంపెనీలకు మేలు చేయడానికే ఇలాంటి నిబంధనలు తీసుకొచ్చినట్టు ఆరోపిస్తున్నారు.

**అనుమానాలు నిజమైన వేళ**
నిపుణులు అనుమానాలు వ్యక్తం చేసినట్టే మహారాష్ట్రకు చెందిన 6,600 మెగావాట్ల పవర్ కాంట్రాక్ట్‌ను అదానీ పవర్ దక్కించుకొన్నది. ఇక, రాజస్థాన్ బిడ్డింగ్‌లో అదానీ కంపెనీ ముందంజలో ఉన్నది. కాగా, మహారాష్ట్ర, రాజస్థాన్ ప్రభుత్వాలు రూపొందించిన టెండర్లలో అన్ని నిబంధనలు, విషయాలు ఒకేలా ఉండటం అందర్నీ ఆశ్చర్యపరిచింది. అదానీ కంపెనీలకు ఆర్థిక లబ్ధి చేయడానికే ఇలా టెండర్లను ఆయా ప్రభుత్వాలు రూపొందించాయని 'రిపోర్టర్స్ కలెక్టివ్' మండిపడింది.

## ఉద్యోగ రీత్యా భర్తకు దూరంగా ఉండటం క్రూరత్వం కాదు

### అలహాబాద్ హైకోర్టు

లక్నో, సెప్టెంబర్ 24: ఉద్యోగ నిర్వహణలో భాగంగా భర్తకు దూరంగా నివసించడం క్రూరమైన చర్య, విడిచిపెట్టడంగా భావించలేమని, విడాకులు పొందడానికి అది ఎంత మాత్రం కారణం కాజాలదని అలహాబాద్ హైకోర్టు ఒక ప్రధాన తీర్పులో పేర్కొంది. ఈ కారణంతో విడాకులు ఇవ్వడానికి నిరాకరిస్తూ కింది కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేసిన వ్యక్తి పిటిషన్‌ను జస్టిస్‌లు సుమిత్రా దయాల్ సింగ్, దోనాది రమేశ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఉద్యోగ నిర్వహణలో భాగంగా తన భాగస్వామి 21 ఏండ్లుగా తనకు దూరంగా ఉంటున్నదని పిటిషనర్ ఆరోపించారు. విధి నిర్వహణ కోసం కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో భార్య ఔరియాలో, భర్త ఝాన్సీలో నివసిస్తున్న అంశాన్ని ఆధారంగా చేసుకుని దానిని క్రూరత్వంగా, భార్య అతడిని విడిచిపెట్టి ఉంటున్నట్టుగా నిర్ధారించలేమని హైకోర్టు పేర్కొంది.

## హర్యానాకు దివాలానే గతి!

- **రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్, బీజేపీ అలవిగాని హామీలు**
- **ఈ వాగ్దానాలతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చెల్లాచెదురయ్యే ప్రమాదం: నిపుణులు**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న ఉద్దేశంతో హర్యానాలోని అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో అలవిగాని హామీలను కురిపించాయి. బడ్జెట్ పరిమితి కూడా పట్టించుకోకుండా ఇచ్చిన ఈ అనాలోచిత వాగ్దానాలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఛిన్నాభిన్నమయ్యే ప్రమాదం పొంచి ఉన్నదని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బడ్జెట్‌లో 25 శాతం నుంచి 37 శాతం వరకు నిధులు ఉచిత హామీల అమలుకే కేటాయించడమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఇలా అనాలోచిత హామీలు ఇస్తూపోతుంటే హర్యానా దివాలా తీసే ప్రమాదం రావొచ్చని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**రాష్ట్ర బడ్జెట్:** రూ. 1.90 లక్షల కోట్లు
కాంగ్రెస్ హామీల అమలుకు ఏటా అవసరమయ్యే మొత్తం – **రూ. 70 వేల కోట్లు (బడ్జెట్‌లో 37 శాతం)**
బీజేపీ హామీల అమలుకు ఏటా అవసరమయ్యే మొత్తం – **రూ. 50 వేల కోట్లు (బడ్జెట్‌లో 24 శాతం)**



**కాంగ్రెస్ ప్రధాన హామీలు:** మహిళలకు నెలకు రూ.2 వేలు, 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, ఎమ్మెస్పీకి చట్టబద్ధత, వృద్ధులకు, వితంతువులకు నెలకు రూ.6 వేలు, రూ.500కు ఎల్పీజీ, రూ.25 లక్షల విలువైన ఉచిత వైద్యం, 2 లక్షల ఉద్యోగాల భర్తీ.



**బీజేపీ ప్రధాన హామీలు:** మహిళలకు నెలకు రూ.2,100, 2 లక్షల ఉద్యోగాల భర్తీ, ఎస్సీ, బీసీ విద్యార్థులకు ప్రభుత్వ ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీలో ఫుల్ స్కాలర్‌షిప్, 24 రకాల పంటలకు ఎమ్మెస్పీ, రూ.500కు ఎల్పీజీ, నిరుద్యోగులకు భృతి.

## భారత్, చైనా మధ్య శ్రీలంక శాండ్‌విచ్ కాదు

### తటస్థంగా ఉంటామన్న దిసనాయకే

కొలంబో: శ్రీలంక రెండు వైపుల నుంచి నొక్కుకుపోవాలని కోరుకోవడం లేదని ఆ దేశ నూతన అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే అన్నారు. ముఖ్యంగా భారత్, చైనాల మధ్య ఇరుక్కుపోవాలని అనుకోవడం లేదన్నారు. ఏదో ఒక బలమైన శక్తితో అంటకాగడానికి బదులుగా, భారత్, చైనాలతో సమతుల్య సంబంధాలను వృద్ధి చేసుకోవాలని తమ ప్రభుత్వం కోరుకుంటున్నదని తెలిపారు. ఆ రెండు దేశాల మధ్య తమ దేశం శాండ్‌విచ్ కాదని తెలిపారు. తమ దేశ సార్వభౌమాధికారాన్ని పరిరక్షించుకోవడానికి ఈ తటస్థ విదేశాంగ విధానం చాలా ముఖ్యమైనదని వివరించారు. .

**నూతన ప్రధానిగా హరిణి**
శ్రీలంక నూతన ప్రధాన మంత్రిగా హరిణి అమరసూరియ మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. 2000 సంవత్సరంలో సిరిమావో బండారనాయకే తర్వాత ఈ పదవిని చేపట్టిన మహిళా నేత హరిణి కావడం విశేషం.



## రద్దైన వ్యవసాయ చట్టాలను మళ్లీ చేయాలి

### బీజేపీ ఎంపీ కంగనా రనౌత్

సిమ్లా, సెప్టెంబర్ 24: రైతుల పోరాటంతో రద్దయిన మూడు వ్యవసాయ చట్టాలను మళ్లీ చేయాలని బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్ పేర్కొన్నారు. 'నా ప్రకటన వివాదాస్పదం అవుతుందని నాకు తెలుసు. అయినా మూడు వ్యవసాయ చట్టాలను మళ్లీ తీసుకురావాలి. వీటి కోసం రైతులే డిమాండ్ చేయాలి.' అని ఆమె వ్యాఖ్యానించారు. ఈ మూడు చట్టాలు రైతులకు ఎంతగానో మేలు చేస్తాయని, కానీ కొన్ని రాష్ట్రాల్లో రైతు సంఘాల ఆందోళనల వల్ల ప్రభుత్వం రద్దు చేయాల్సి వచ్చిందని ఆమె పేర్కొన్నారు. రైతుల మేలు కోసమే ఈ చట్టాలను మళ్లీ తీసుకురావాలని కోరుకుంటున్నానని కంగనా పేర్కొన్నారు.




## కోల్‌కతాలో ట్రామ్ సేవలకు స్వస్తి!

### త్వరలో నిలిపేయాలని సర్కారు నిర్ణయం

కోల్‌కతా, సెప్టెంబర్ 24: కోల్‌కతాలో దాదాపు 150 ఏండ్ల నుంచి కొనసాగుతున్న ట్రామ్ సేవలు త్వరలో కనుమరుగు కానున్నాయి. మైదాన్ నుంచి ఎస్ప్లానేడ్ వరకు వారసత్వంగా కొనసాగుతున్న ట్రామ్ సర్వీసు మినహా మిగిలిన అన్ని సర్వీసులను త్వరలో నిలిపివేయాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కోల్‌కతా వీధుల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ట్రామ్ ప్రయాణికులు నిశ్చయించుకున్నారు.

## 'ఎన్నారై' మోసానికి ముగింపు పలకాల్సిందే

### పంజాబ్‌లో యూజీ మెడికల్ అడ్మిషన్లలో కోటా విస్తరణకు సుప్రీంకోర్ట్ నిరాకరణ

న్యూఢిల్లీ: అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్, డెంటల్ అడ్మిషన్లలో ఎన్నారై కోటా పరిధిని విస్తరిస్తూ తీసుకున్న నిర్ణయంపై పంజాబ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులోనూ చుక్కెదురైంది. ఈ మోసానికి ముగింపు పలకాల్సిందేనని సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 15 శాతం కోటా కింద ఎన్నారైల దూరపు బంధువులైన అత్త, మామ, బామ్మ, తాత, కజిన్స్ వంటి వారిని చేర్చుకునేందుకు ఎన్నారై కోటాను విస్తరిస్తూ ఆగస్టు 20న పంజాబ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సెప్టెంబర్ 10న ఈ ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. దీంతో పంజాబ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. మంగళవారం దీనిని విచారించిన చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ధర్మాసనం హైకోర్టు తీర్పును సమర్థించింది. మోసానికి ముగింపు పలకాల్సిందేనని, దీనివల్ల మూడు రెట్లు ఎక్కువ మార్కులు వచ్చిన వారు అడ్మిషన్ కోల్పోతారని పేర్కొంది.

## ప్రమోషన్ల కోసం ప్రాణాలతో చెలగాటం

- రైలు పట్టాలపై ఫిష్‌ప్లేట్ల తొలగింపు
- ముగ్గురు రైల్వే ఉద్యోగుల దుశ్చర్య

సూరత్: ప్రమోషన్ల కోసం వందలాది మంది ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెట్టారు గుజరాత్‌కు చెందిన ముగ్గురు రైల్వే ఉద్యోగులు. సూరత్ సమీపంలో కిమ్ – కొసంబ రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్‌పై 71 లాక్‌లు, ట్రాక్‌లను కలిపే రెండు ఫిష్‌ప్లేట్లు తీసేసి ఉన్నాయని, వాటిని పక్క ట్రాక్‌పై పెట్టారని సుభాష్ పొదార్ అనే ట్రాక్‌మెన్ రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఈ కుట్రపై నిగ్గు తేల్చేందుకు పోలీసులతో పాటు ఎన్ఐఏ అధికారులు రంగంలోకి దిగారు. సుభాష్‌ను అనుమానించి విచారించగా ఈ కుట్ర చేసింది సుభాష్‌తో పాటు మరో ట్రాక్‌మెన్ మనీశ్ కుమార్, కాంట్రాక్ట్ కార్మికుడు శుభం అని తేలింది. రైలు ప్రమాదాన్ని ఆపామని చెప్తే పదోన్నతులు, రివార్డులు, పబ్లిసిటీ వస్తుందనే ఇలా చేశామని నిందితులు తెలిపారు.

## 'ఉన్నావో' బాధితురాలికి భద్రత ఉపసంహరిస్తాం

### సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ: ఉన్నావో లైంగికదాడి బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులకు కల్పించిన సీఆర్‌పీఎఫ్ భద్రతను ఉపసంహరించాలని నిర్ణయించినట్టు పేర్కొంటూ సుప్రీంకోర్టులో కేంద్రం పిటిషన్ దాఖలు చేసింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో దోషిగా తేలిన బీజేపీ బహిష్కృత నేత కుల్దీప్ సింగ్ సెంగార్‌కు కోర్టు జీవిత ఖైదు విధించింది. బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులకు బెదిరింపులు రావడంతో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం వారికి సీఆర్‌పీఎఫ్ భద్రత కల్పించింది. అయితే, ప్రస్తుతం వారికి ఎటువంటి బెదిరింపులు రావడం లేదని, కాబట్టి వారికి కల్పించిన భద్రతను ఉపసంహరించుకోవాలని నిర్ణయించినట్టు కేంద్రం తరఫు న్యాయవాది సుప్రీంకోర్టుకు తెలిపారు. వారి వాదనలు విన్న జస్టిస్ బీవీ త్రివేది, జస్టిస్ సతీశ్‌చంద్రశర్మతో కూడిన ధర్మాసనం.. దీనిపై స్పందించాలంటూ బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులను కోరింది.

## నటిపై రేప్ కేసులో కేరళ ఎమ్మెల్యే అరెస్ట్

- **అనంతరం బెయిల్‌పై విడుదల**
- **మరో కేసులో ముందస్తు బెయిల్**



**విచారణ నిమిత్తం ఎమ్మెల్యే ముఖేశ్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు**

కోచి: ఒక నటిని రేప్ చేశారన్న ఆరోపణల కేసులో కేరళ అధికార పార్టీ ఎమ్మెల్యే, నటుడు ముఖేశ్‌ను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మంగళవారం అధికారికంగా అరెస్ట్ చేసింది. అనంతరం ఆయనను బెయిల్‌పై విడుదల చేసింది. అంతకు ముందు సిట్ హెడ్‌క్వార్టర్స్‌కు దర్యాప్తు నిమిత్తం ఉదయం 9.45 గంటలకు వెళ్లిన ఆయనను అధికారులు మూడున్నర గంటల పాటు ప్రశ్నించి, అనంతరం అరెస్ట్ చేశారు. అయితే ఆయనపై దాఖలైన కేసులో ఎర్నాకుళం జిల్లా సెషన్స్ జడ్జి ఈ నెల 5న బెయిల్ మంజూరు చేశారు. కాగా, మరో లైంగిక దాడి కేసులో ముకేశ్‌కు కేరళ హైకోర్టు మంగళవారం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. 2010లో త్రిసూర్ జిల్లా వడక్కడెరీలో తనను లైంగికంగా వేధించినట్టు మొదటి కేసులోని నటే ముకేశ్‌పై ఫిర్యాదు చేసింది. దీంతో రెండు కేసుల్లో ఆయనకు అరెస్ట్ నుంచి మినహాయింపు లభించింది.

**సిద్ధిఖీ ముందస్తు బెయిల్ పిటిషన్ తిరస్కృతి**
మలయాళ నటిపై లైంగిక దాడి కేసులో నటుడు సిద్ధిఖీ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కేరళ హైకోర్టు మంగళవారం తిరస్కరించింది. తాను రేప్ చేసినట్టు ఆ నటి చేసిన ఆరోపణలు నిజం కాదని, గత ఐదేండ్లుగా తనను ఆమె బెదిరిస్తున్నట్టు సిద్ధిఖీ న్యాయస్థానానికి తెలిపారు.

## ఒకటో తరగతిలో ప్రవేశాలు శూన్యం

- *5 వేల సర్కారు బడుల దుస్థితి*
- *బీజేపీ పాలిత ఎంపీలో వసతుల లేమి*

*భోపాల్: బీజేపీ పాలిత మధ్య ప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో కనీసం ఒక విద్యార్థి కూడా చేరని సర్కారు బడుల సంఖ్య 5,500కుపైనే ఉండటం అధ్వాన్న స్థితికి అద్దం పడుతున్నది. మరోవైపు ప్రభుత్వ ఆధ్వర్యంలోని సీఎం రైజ్ స్కూల్‌లో ప్రవేశాల కోసం విపరీతంగా డిమాండ్ ఉంది. రాజ్య శిక్ష కేంద్ర విడుదల చేసిన వార్షిక నివేదిక ప్రకారం, 2024-25 విద్యా సంవత్సరంలో 5,500 ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో కనీసం ఒక విద్యార్థి అయినా చేరలేదు. ఒకరు లేదా ఇద్దరు చేరిన పాఠశాలలు సుమారు 25,000 ఉన్నాయి. 10 మంది విద్యార్థుల వరకు చేరిన పాఠశాలల సంఖ్య 11,345 కాగా, దాదాపు 23 వేల బడుల్లో ముగ్గురు నుంచి ఐదుగురి వరకు చేరారు. తాగునీరు వంటి సదుపాయాలు లేకపోవడం వల్ల సర్కారు బడులు విద్యార్థులను ఆకర్షించలేకపోతున్నాయని విశ్లేషకులు చెప్తున్నారు.*

## పూర్తి స్థాయి యుద్ధం దిశగా..

- **దక్షిణ లెబనాన్‌పై కొనసాగిన ఇజ్రాయెల్ దాడులు**
- **మృతుల సంఖ్య 558, 1835 మందికి గాయాలు**
- **ఆశ్రయం కోసం యుద్ధ బాధితుల అవస్థలు**



**ఇజ్రాయెల్ దాడుల్లో దెబ్బ తిన్న ఓ ఫార్మసీ శిథిలాలను తొలగిస్తున్న రెస్క్యూ టీం**

బీరుట్: ఇజ్రాయెల్, హెజ్బొల్లా పూర్తి స్థాయి యుద్ధం దిశగా పయనిస్తున్నట్లు కనిపిస్తున్నాయి. ఇజ్రాయెల్ మంగళవారం కూడా దక్షిణ లెబనాన్‌పై దాడులు కొనసాగించింది. దీంతో దాడుల్లో దాదాపు 558 మంది మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. మరోవైపు లెబనాన్‌లోని బీరుట్, సిడాన్ నగరాల్లో నిర్వాసితుల కోసం తాత్కాలిక శిబిరాలను ఏర్పాటు చేశారు. హోటళ్లన్నీ పూర్తిగా బుక్ అయిపోయాయి. గదుల ధరలను హోటల్ యాజమాన్యాలు విపరీతంగా పెంచేశాయి. వసతి దొరకని యుద్ధ బాధితులు పార్కులు, కార్లలోనే నిద్రపోతున్నారు. లెబనాన్ ఆరోగ్య శాఖ మంత్రి ఫిరాస్ అబియాద్ విలేకర్లతో మాట్లాడుతూ.. సోమ, మంగళవారాల్లో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 558 మంది మరణించారని, 1,835 మంది గాయపడ్డారని చెప్పారు. గాయపడినవారిని 54 దవాఖానల్లో చేర్పించినట్లు తెలిపారు. మృతుల్లో నలుగురు పారామెడిక్స్ ఉన్నారని, గాయపడినవారిలో 16 మంది పారామెడిక్స్, ఫైర్ ఫైటర్స్ ఉన్నారని వివరించారు.

**హెజ్బొల్లా కీలక కమాండర్ ఇబ్రహీం మృతి!**
హెజ్బొల్లా ఉగ్రవాద సంస్థలోని మిసైల్స్, రాకెట్ దళం కమాండర్ ఇబ్రహీం మహమ్మద్ కబిసిని హతమార్చినట్లు ఇజ్రాయెల్ సైన్యం మంగళవారం ప్రకటించింది. బీరుట్‌లో జరిపిన గగనతల దాడుల్లో ఈ దళంలోని అదనపు సెంట్రల్ కమాండర్లు కూడా మరణించారని చెప్పింది. ఇజ్రాయెల్ సైనికులపై అనేక దాడులకు ఇబ్రహీం ప్రణాళికలు రచించి, అమలు చేశాడని వెల్లడించింది.

**ఐరన్‌డోమ్‌తో హెజ్బొల్లా రాకెట్లు విలవిల**
లెబనాన్‌లోని హెజ్బొల్లా ఉగ్రవాద సంస్థ సోమవారం రాత్రి ప్రయోగించిన 200 రాకెట్లు ఇజ్రాయెల్ ఐరన్‌డోమ్ ధాటికి తుత్తునియలు అయిపోయాయి. ఇజ్రాయెల్‌లోని హైఫా, కిరియత్ బయాలిక్, జెజ్రీల్ లోయలపై ఈ రాకెట్ల దాడి జరిగింది. వీటిని మధ్యలోనే కూల్చేసిన దృశ్యాలను ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ పోస్ట్ చేసింది.


### ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య 40 ఏండ్ల శత్రుత్వం

ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య శత్రుత్వం 40 ఏండ్ల నాటిది. 1980వ దశకం ప్రారంభంలో పాలస్తీనియన్ లిబరేషన్ ఆర్గనైజేషన్‌ను నిర్మూలించడం కోసం ఇజ్రాయెల్ లెబనాన్‌పై దాడి చేసింది. లెబనాన్ రాజధాని బీరుట్ నుంచి పీఎల్ఓను పారదోలడంలో మొదట్లో ఇజ్రాయెల్ విజయం సాధించింది. 1983లో ఇరాన్ మద్దతుతో హెజ్బొల్లా ఏర్పడింది. ఇది ఇజ్రాయెల్ ప్రధాన శత్రువుల్లో ఒకటిగా హెజ్బొల్లా మారింది. గెరిల్లా యుద్ధంతోపాటు కోవర్టు ఆపరేషన్లలో కూడా దీనికి నైపుణ్యం ఉంది. లెబనాన్‌లో, దాని వెలుపల ఉన్న ఇజ్రాయెలీ టార్గెట్లను అస్థిరపరచడానికి నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటుంది. 1980, 1990 దశకాల్లో బీరుట్‌లోని అమెరికా, ఫ్రెంచ్ మిలిటరీ బ్యారక్‌లపై అనేక దాడులు చేసింది. ఇజ్రాయెల్ కూడా హెజ్బొల్లా ఉగ్రవాదులను మట్టుబెడుతూ వస్తున్నది.

## కండోమ్ లేని సెక్సే ముద్దు!


### *వినియోగంలో దాద్రానగర్ హవేలీ ఫస్ట్*

### *వాడకం తెలీనివారు దేశంలో 6 శాతం*



*న్యూఢిల్లీ: సురక్షిత శృంగార సాధనం కండోమ్‌ల వినియోగం దేశంలో రోజురోజుకూ తగ్గిపోతున్నది. కండోమ్‌లు వినియోగించకుండా సెక్స్‌లో పాల్గొనే వారి సంఖ్య పెరిగిపోతున్నదని ప్రపంచ ఆరోగ్య సంస్థ విడుదల చేసిన నివేదిక పేర్కొంది. ఏ ఏటికాయేడు ఇవి వాడుతున్న వారి సంఖ్య తగ్గిపోతున్నట్టు గతంలోనే డబ్ల్యూహెచ్‌వో ప్రకటించింది. తాజాగా కూడా అదే విషయాన్ని మరోసారి తెలిపింది. మన దేశంలో ఏయే రాష్ట్రాల్లో కండోమ్‌ల వినియోగం ఎక్కువగా ఉందన్న విషయంపై నేషనల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫ్యామిలీ హెల్త్ నిర్వహించిన సర్వేలో కేంద్ర పాలిత ప్రాంతం దాద్రానగర్ హవేలీ ఈ విషయంలో మొదటి స్థానంలో నిలిచింది. ఇక్కడ అత్యధికంగా ప్రతి 10 వేల జంటలలో 993 జంటలు కండోమ్‌లను వినియోగిస్తున్నాయి. ఇక ఆంధ్రప్రదేశ్‌లో వీటి సంఖ్య 978గా ఉంది. కర్ణాటకలో అత్యల్పంగా కేవలం 307 జంటలు మాత్రమే వీటిని వినియోగిస్తున్నాయి. ఇక పంజాబ్‌లో 895, చండీగఢ్‌లో 822, హర్యానాలో 685 జంటలుగా నమోదయ్యాయి. దేశంలో కండోమ్‌ల గురించి తెలియని వారు ఆరు శాతం మంది ఉన్నారు. భారత్‌లో ఏటా 33.07 కోట్ల కండోమ్‌లు అమ్ముడవుతున్నాయని ఈ అధ్యయనం వెల్లడించింది.*

## మెదడు దెబ్బ తింటే మత ఛాందసం!



*న్యూఢిల్లీ: మెదడులోని కొంత నిర్దేశిత ప్రాంతం దెబ్బ తింటే అది మత ఛాందస వాదానికి దారి తీయవచ్చునని ఓ పరిశోధనలో తేలింది. నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో ఈ వివరాలు ప్రచురితమయ్యాయి. ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన న్యూరోస్పిరిచ్యువాలిటీ రీసెర్చి సెంటర్ డైరెక్టర్ మైఖేల్ ఫెర్గూసస్ తెలిపిన వివరాల ప్రకారం.. బ్రెయిన్ నెట్‌వర్క్‌కు మతపరమైన భావాలకు సంబంధం ఉంది. దీని కోసం వారు లెసియన్ నెట్‌వర్క్ మేపింగ్ విధానాన్ని అనుసరించారు. దీని ద్వారా మెదడులోని వివిధ ప్రాంతాలు ఎలా అనుసంధానించి ఉన్నాయో, ఒక ప్రాంతానికి నష్టం, వాటి సంబంధిత మెదడు పనితీరుకు ఎలా అంతరాయం కలిగిస్తుందో గుర్తించడంలో ఇది సహాయపడుతుంది. దీంతో మెదడు దెబ్బతిన్న రెండు గ్రూపులను ఎన్నిక చేసుకుని వీరు పరిశోధనలు జరిపారు. మొదటి గ్రూప్‌లో యుద్ధంలో పాల్గొన్న మధ్య వయస్కులుగా ఉండి మెదడు గాయాలతో బాధపడుతున్న వారు. రెండో గ్రూప్‌లో వివిధ కారణాలతో మెదడు దెబ్బతిన్న సామాన్య రోగులు. ఈ రెండు గ్రూపులకు మత ఛాందసవాదంపై ఒక స్కేల్‌ను పూర్తి చేశారు. తర్వాత మెదడు దెబ్బతిన్న కొన్ని ముఖ్యమైన ప్రాంతాలను సీటీ, ఎంఆర్ఐల ద్వారా విశ్లేషించారు. అనంతరం కుడి అర్ధభాగంలో మెదడు దెబ్బతిన్న వారు ఎక్కువగా మత ఛాందసవాద భావాలు కలిగి ఉన్నట్టు నిర్ధారించారు. ఈ ఫలితాలు ఆశ్చర్యపరిచినట్టు మైఖేల్ చెప్పారు.*

## త్రిపురలో 500 మంది మిలిటెంట్ల లొంగుబాటు

అగర్తల: సీఎం మాణిక్ సాహ సమక్షంలో త్రిపురలో దాదాపు 500 మంది మిలిటెంట్లు మంగళవారం లొంగిపోయారు. వీరు నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర, ఆల్ త్రిపుర టైగర్ ఫోర్స్ గ్రూపులకు చెందిన వారు. సెపాహిజల జిల్లాలోని జంపుయిజలలో జరిగిన కార్యక్రమంలో సీఎం సాహ వీరికి జనజీవన స్రవంతిలోకి స్వాగతం పలికారు. తీవ్రవాదుల లొంగుబాటుతో త్రిపుర పూర్తిగా తీవ్రవాద రహిత రాష్ట్రంగా మారిందని తెలిపారు.

## బ్లాక్ చేసినా పోస్టులు చూడొచ్చు

### 'ఎక్స్' బ్లాక్ ఫీచర్‌లో త్వరలో మార్పు

న్యూయార్క్, సెప్టెంబర్ 24: 'ఎక్స్' లోని బ్లాక్ ఫీచర్‌ను సంస్థ అప్‌డేట్ చేయనుంది. మనం చేసేవి పబ్లిక్ పోస్టులు అయితే మనం బ్లాక్ చేసిన వారు కూడా మన పోస్టులు చూడవచ్చు. రిప్లైలు, మీడియా, ఫాలోయర్లను మాత్రం చూడలేరు. ఈ మేరకు త్వరలోనే 'ఎక్స్' బ్లాక్ ఫీచర్‌లో మార్పులు జరగనున్నాయి.

## కాళేశ్వరంపై కొనసాగుతున్న కమిషన్ విచారణ

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ సీపీ ఘోష్ కమిషన్ విచారణ కొనసాగుతున్నది. మంగళవారం హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్‌లో ఆరుగురు రిటైర్డ్ ఇంజినీర్లు విచారణకు హాజరయ్యారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీకి బ్యాంకు గ్యారెంటీని ఉన్నతాధికారుల అనుమతి లేకుండానే ఈఈ విడుదల చేశారని, 2019లోనే బ్యారేజీల్లో సీపేజీలను గుర్తించామంటూ కొందరు ఇంజినీర్లు కమిషన్ ఎదుట తెలిపారు. ఐదుగురు ఇంజినీర్లను కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. అఫిడవిట్లలో పేర్కొన్న సమాచారం ఆధారంగా జస్టిస్ ఘోష్ పలు ప్రశ్నలను సంధించారు. బ్యాంకు గ్యారెంటీ విషయమై ఈఎన్సీ కార్యాలయ డిప్యూటీ సీఈ మహ్మద్ అజ్మల్‌ను విచారించారు. బరాజ్‌ల డిజైన్లను ఎవరు ఆమోదించారు.. వంటి ప్రశ్నలకు ఈఈ విష్ణుప్రసాద్ నుంచి సమాధానాలు రాబట్టారు. రామగుండం డిప్యూటీ ఎస్ఈ సత్యనారాయణగౌడ్, రిటైర్డ్ ఎస్ఈలు కరుణాకర్, సత్తిరెడ్డి విచారణకు హాజరయ్యారు. ఎస్ఈ ఓంకార్‌సింగ్ హాజరుకాలేదు. బుధవారం గజ్వేల్ ఈఎన్సీ హరీరాం, డైరెక్టరేట్ ఆఫ్ వర్క్స్ అకౌంటెంట్ ఫణిభూషణ్, నీటిపారుదల శాఖ ముఖ్య అకౌంట్స్ అధికారి పద్మావతిని కమిషన్ విచారించనున్నది.

# ఎమ్మెల్యే గాంధీపై చర్యలు తథ్యం

- ఆయన అనుచరులపైనా కేసు
- రాష్ట్రంలో మావోయిస్టుల కదలికల్లేవ్
- ఉగ్రవాదుల జాడ కూడా లేదు.. ఉంటే చెప్తాం
- విలేకరుల సమావేశంలో డీజీపీ జితేందర్



హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : ఎమ్మెల్యే అరికెపూడి గాంధీపై చర్యలు తీసుకుంటామని, ఆయన అనుచరులపైనా కేసులు నమోదు చేశామని డీజీపీ జితేందర్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, గాంధీ వివాదంపై స్పందిస్తూ ఇప్పటికే గాంధీ, ఆయన అనుచరులపై కేసులు నమోదు చేసినట్టు వివరించారు. ఛత్తీస్‌గఢ్‌లో కూంబింగ్ జరుగుతున్నందున తెలంగాణలోకి మావోయిస్టులు వస్తే.. తమ భద్రతా దళాల నుంచి ప్రతిఘటన ఎదుర్కోక తప్పదని, అవసరమైతే ఎన్‌కౌంటర్లకూ వెనుకాడబోమని స్పష్టంచేశారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర మినహా తెలంగాణలో మావోయిస్టుల కదలికలు లేవని చెప్పారు. హైదరాబాద్‌లో ఉగ్రవాదుల జాడ లేదని తెలిపారు. ఉగ్ర కదలికలపై నిఘా ఉంచామని, సమాచారం ఉంటే తెలియజేస్తామని చెప్పారు. వినాయక నిమజ్జనాల్లో డీజే సిస్టమ్స్ ఉపయోగించొద్దని, వాటివల్ల ఎన్నో అనర్థాలు ఉన్నాయని సూచించారు. చిన్న చిన్న ఘటనలు మినహా వినాయక చవితి, నిమజ్జనాలు, మిలాద్ ఉన్ నబీ కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిశాయని చెప్పారు. మొత్తం 5,879 ప్రాంతాల్లో 1,36,638 విగ్రహాలు నిమజ్జనం చేసినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 15,400 మంది పోలీసులు, 47 ప్లాటూన్స్‌తో విధులు నిర్వర్తించినట్టు చెప్పారు.

### జైనూర్ ఘటన దురదృష్టకరం

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన జైనూర్ ఘటన దురదృష్టకరమని డీజీపీ అన్నారు. వెంటనే పరిస్థితిని అంచనా వేసి, 38 మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. 720 మంది పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో జైనూర్ మొత్తం మోహరించామని వివరించారు. లా అండ్ ఆర్డర్ ఏడీజీ, ఐజీతో భద్రతను పర్యవేక్షించామని తెలిపారు. సివిల్ కేసుల్లో తలదూర్చిన చిక్కడపల్లి ఏసీపీపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ నిందితులకు రెడ్ కార్నర్ నోటీసులు ఇవ్వాలని కోరినట్టు తెలిపారు. దానికి చాలా ప్రాసెస్ ఉంటుందని సీబీఐ, ఇంటర్‌పోల్ సహకారంతో నోటీసులు ఇచ్చే అవకాశం ఉందని చెప్పారు. డప్పు కొట్టకపోతే గ్రామ బహిష్కరణ చేసిన ఘటన తమ దృష్టికి వచ్చిందని, ఆ వెలివేతకు సంబంధించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఏడీజీ మహేశ్ భగవత్, ఐజీలు సత్యనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, రమేశ్ ఉన్నారు.

## ఇస్రో చైర్మన్‌కు పుస్తక బహూకరణ



రవీంద్రభారతిలో మంగళవారం తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ, రీజియన్ మళయాలీ అసోసియేషన్, హైదరాబాద్ ఫోరమ్ ఫర్ పొలిటికల్ కార్టూనిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పేస్ టూస్ పేరిట నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో నమస్తే తెలంగాణ కార్టూనిస్ట్ మృత్యుంజయ తన కార్టూన్ల పుస్తకాన్ని ఇస్రో చైర్మన్ డాక్టర్ సోమనాథ్,పర్యాటక, సాంస్కృతిక మంత్రి జూపల్లి కృష్ణారావుకు అందజేశారు.

## అడ్వకేట్ల ఎన్‌రోల్ మెంట్ తేదీని ఖరారు చేయండి

### రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): న్యాయశాస్త్రంలో పట్టా పొందిన అభ్యర్థులు ఎన్‌రోల్‌మెంట్ కోసం సమర్పించిన దరఖాస్తులను త్వరగా పరిశీలించాలని హైకోర్టు రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు స్పష్టం చేసింది. వారి ఎన్‌రోల్‌మెంట్‌ను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టడంతోపాటు ఎన్‌రోల్‌మెంట్ తేదీని ఖరారు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. బార్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా లేఖ ఆధారంగా ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియను నిలిపివేస్తూ గత నెల 5న రాష్ట్ర బార్‌కౌన్సిల్ జారీచేసిన సర్క్యులర్‌కు వ్యతిరేకంగా పిటిషన్ దాఖలవడంతో ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

## తెలుగు వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరే సముచితం

**కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్**

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరే సరైనదని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు ఒక ప్రాంతానికో, ఒక సామాజిక వర్గానికో చెందినవాడు కాదని, గాంధీజీకి ప్రత్యక్ష శిష్యుడని పేర్కొన్నారు. అసాధారణ వ్యక్తిత్వం గల ఆయన పేరును తొలగించడం సమంజసం కాదని హితవు పలికారు. తెలుగు విశ్వవిద్యాలయం ఏ ఒక్క ప్రాంతానికో పరిమితమైనది కాదని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం ఉభయ తెలుగు రాష్ట్రాలలో మాత్రమే కాక, ఇతర రాష్ట్రాలలోనూ, ఇతర దేశాలలోని తెలుగు వారి విద్యా సాంస్కృతికపరమైన అవసరాలను తీరుస్తున్నదని గుర్తుచేశారు. విశ్వవిద్యాలయం పేరు మార్చితే ఇప్పటి వరకు జారీచేసిన సర్టిఫికెట్ల గతి ఏమిటని ప్రశ్నించారు. అన్ని విషయాలను పరిగణలోకి తీసుకుని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును మార్చే ప్రయత్నాన్ని విరమించుకోవాలని సీఎంను కోరారు.

## నేడు, రేపు ఓపెన్ పరీక్ష ఫీజు చెల్లించే చాన్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 24(నమస్తే తెలంగాణ): ఓపెన్ స్కూల్ సొసైటీ వార్షిక పరీక్షలకు హాజరయ్యేందుకు అధికారులు మరో అవకాశమిచ్చారు. బుధ, గురువారాల్లో తాత్కాల్ కింద ఫీజు చెల్లించేందుకు అవకాశమిచ్చినట్టు డైరెక్టర్ సీవీ శ్రీహరి ప్రకటనలో తెలిపారు. పదోతరగతి వారు రూ.500, ఇంటర్మీడియట్ వారు రూ.వెయ్యి ఆలస్య రుసుముతో ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. అక్టోబర్ 3 నుంచి 9వరకు వార్షిక పరీక్షలను నిర్వహించనుండగా, ఈనెల 30న హాల్‌టికెట్లు విడుదల చేస్తామని తెలిపారు.

## ఐసెట్‌లో 90% సీట్లు భర్తీ

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): ఐసెట్ తుది విడత సీట్లను మంగళవారం కేటాయించారు. ఎంబీఏలో 28,345 సీట్లకు 25,747 సీట్లు భర్తీ కాగా, ఎంసీఏలో 6,966 సీట్లకు 6,905 సీట్లు భర్తీ అయ్యాయి. 99 కాలేజీల్లో వందశాతం సీట్లు నిండినట్టు అధికారులు ప్రకటించారు. ఎంబీఏలో మిగిలిన 2,598 సీట్లల్లో 2,529, ఎంసీఏలోనూ 871 సీట్లల్లో 855 ప్రైవేట్ కాలేజీలవే. 27 వరకు ఫీజు చెల్లించి, 28లోపు కాలేజీల్లో రిపోర్ట్ చేయాలని ప్రవేశాల కమిటీ కన్వీనర్ శ్రీదేవసేన వెల్లడించారు.

## ప్రాథమిక బడుల్లో ప్రీ ప్రైమరీ

- బాలవాటిక పేరుతో తరగతులు
- అధికారులను ఆదేశించిన సీఎం
- ప్రత్యేకంగా పాలసీ రూపకల్పన
- అంగన్‌వాడీల పరిస్థితి ఏంటి?

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం సర్కారు బడుల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ వంటి పూర్వ ప్రాథమిక విద్యను ప్రారంభించాలనుకుంటున్నది. బాలవాటిక పేరుతో తరగతులను నిర్వహించడానికి విద్యాశాఖ అధికారులు కసరత్తు తీవ్రతరం చేశారు. రాష్ట్రంలో 18,241 ప్రాథమిక బడులున్నాయి. 3,144 ప్రాథమికోన్నత బడులను పీఎస్‌లలో విలీనం చేయనున్నారు.

### ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రభావం..

ప్రస్తుతం పూర్వప్రాథమిక విద్యాబోధన అంగన్‌వాడీ కేంద్రాల్లో కొనసాగుతున్నది. సర్కారు బడుల్లో ఒకటో తరగతి నుంచి ప్రవేశాలు కల్పిస్తున్నారు. ప్రైవేట్ బడుల్లో నర్సరీ నుంచే విద్యార్థులను చేర్చుకుంటుండంతో వారు అక్కడే కొనసాగుతున్నారు. ప్రభుత్వ బడుల్లోనూ పూర్వ ప్రాథమిక విద్య ప్రారంభించడం ద్వారా నర్సరీ దశలోనే విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్ల బాట పట్టే వీలుంటుందన్న ఆలోచనలో కసరత్తు చేస్తున్నది.

### అంగన్‌వాడీలుంటాయా..?

రాష్ట్రంలో 149 ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌ల పరిధిలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిల్లో 6.67లక్షల మంది మూడేండ్ల నుంచి ఆరేండ్ల మధ్య వయస్కులు నమోదయ్యారు. కేంద్రం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానం ( ఎన్ఈపీ) పూర్వ ప్రాథమిక విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయాలని స్పష్టం చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదిశగా ముందుకెళ్తున్నది. దీంతో అంగన్‌వాడీలు ఉంటాయా..? అన్న చర్చ నడుస్తున్నది. ప్రీ ప్రైమరీ బోధనకు కొత్త టీచర్లను నియమించాలని యోచిస్తుండటంతో అంగన్‌వాడీ టీచర్ల పరిస్థితేమిటన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.



డీజీపీ ఆఫీస్ ఎదుట న్యాయం చేయాలని వేడుకుంటున్న బాధిత కుటుంబం

## న్యాయమా.. నువ్వెక్కడ!

- తమ బిడ్డ హత్యపై నిగ్గు తేల్చాలని బాధితుల డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): 'అయ్యా నా బిడ్డది రోడ్డు ప్రమాదం కాదు. ముమ్మాటికీ హత్యే. సాక్ష్యాల్లేవని, రోడ్డు ప్రమాదంగా తేల్చి పోలీసులు కేసు మూసేశారు. మరోసారి విచారణ చేపట్టి న్యాయం చేయండి' అంటూ కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన బాధిత కుటుంబం జోరు వానలో డీజీపీ కార్యాలయం ముందు ఆర్తనాదాలు చేసింది. చొప్పదండి మున్సిపాలిటీకి చెందిన మందా విను జనవరి 22న అనుమానాస్పదంగా చనిపోయాడు. పాతకక్షల నేపథ్యంలో స్నేహితులే మేడారం జాతరకు తీసుకెళ్లి చంపేశారని తల్లి చెప్తున్నది. స్థానిక పోలీసులు డబ్బు తీసుకొని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి కేసు కొట్టివేశారని ఆరోపిస్తున్నారు. ఇదే విషయంపై జూలైలో డీజీపీ ఆఫీసులో మొర పెట్టుకోగా.. డబ్బు తీసుకున్న డీఎస్పీ, ఎస్సైకే మళ్లీ విచారణ బాధ్యతలు అప్పగించారని, దీంతో తమకు న్యాయం జరగలేదని ఆవేదనను వెళ్లగక్కారు. నిందితుల్లో కొందరికి కాంగ్రెస్ నాయకుల అండదండలు ఉండటం వల్లే తమకు అన్యాయం చేస్తున్నారని బోరున విలపిస్తూ చెప్పారు. ఈ కేసును రీఓపెన్ చేయించి, ఇంటెలిజెన్స్ పోలీసులతో విచారణ చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి తమ గోడు విన్నవించుకున్నారు.



## గవర్నర్‌తో మంత్రి సీతక్క భేటీ

- రాష్ట్రపతి వద్ద ములుగు మున్సిపాలిటీ బిల్లు
- ఆమోదం కోసం కృషి చేయాలని కోరిన మంత్రి
- మళ్లీ అసెంబ్లీలో ప్రవేశపెట్టే యోచనలో సర్కారు

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ ) : ములుగును మున్సిపాలిటీగా మార్చే బిల్లు ఆమోదానికి కృషి చేయాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మంత్రి సీతక్క కోరారు. ఈ మేరకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్‌తో కలిసి రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో మంగళవారం భేటీ అయి వినతి పత్రం సమర్పించారు. ములుగును మున్సిపాలిటీగా మారుస్తూ 2022లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు పాస్ చేసింది. సాంకేతిక సమస్యలతో అది అమలుకు నోచుకోలేదు. జీహెచ్‌ఎంసీ చట్ట సవరణల బిల్లులోనే ములుగు మున్సిపాలిటీ అంశాన్ని చేర్చారు. జీహెచ్‌ఎంసీలో కో ఆప్షన్ సభ్యుల సంఖ్యను 5 నుంచి 9కి, మైనార్టీ కోఆప్షన్ సభ్యుల సంఖ్య 2 నుంచి 5కు పెంచుతూ చట్ట సవరణ చేశారు. అదే బిల్లులో ములుగు మున్సిపాలిటీ అంశం ఉండటంతో బిల్లుకు అప్పటి గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ ఆమోదం తెలపలేదు. ఆ తర్వాత రాష్ట్రపతి కార్యాలయానికి బిల్లు పంపారు. దీంతో అప్పటి నుంచి బిల్లు పెండింగ్‌లోనే ఉన్నది. ఆ బిల్లును ఆమోదించేలా చొరవ చూపాలని గవర్నర్‌కు మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. పెండింగ్ బిల్లును రీకాల్ చేసి ములుగును మున్సిపాలిటీగా మారుస్తూ కొత్త బిల్లును వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టేలా కసరత్తు చేస్తున్నామని మంత్రి చెప్పారు. గిరిజన ప్రాంతాల ప్రత్యేక పాలనాధికారిగా ఆదిలాబాద్‌లో పర్యటించాలని కోరగా గవర్నర్ సానుకూలంగా స్పందించినట్టు మంత్రి తెలిపారు. ములుగులో ఓ గ్రామాన్ని దత్తత తీసుకునే ఆలోచనలో గవర్నర్ ఉన్నారని, గ్రామాల జాబితా పంపామని వివరించారు.

## వాయుగుండాలతోనే విపత్తు

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): ఏటూరునాగారంలోని తాడ్వాయి అటవీ ప్రాంతంలో ఇటీవల పర్యావరణ విపత్తు సంభవించి, 50 వేల చెట్లు నేలకొరగడం వెనుక మిస్టరీ వీడుతున్నది. బంగాళాఖాతం, అరేబియా మహాసముద్రాల్లో ఒకేసారి వాయుగుండాలు ఏర్పడి, బలమైన గాలులు వీయడం వల్లే ఈ విపత్తు సంభవించి ఉండవచ్చని వాతావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీనిపై మంగళవారం హైదరాబాద్ అరణ్యభవన్‌లో ప్రధాన అటవీ సంరక్షణాధికారి డోబ్రియాల్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. తాడ్వాయిలో సంభవించిన నష్టాన్ని ములుగు డీఎఫ్‌వో కిషన్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎన్ఆర్ఎస్‌సీ, ఎన్ఏఆర్ లేబొరేటరీ, పీసీసీఎఫ్, వాతావరణ శాఖల అధికారులు ఉన్నారు.

## పిడుగుపాటుకు నలుగురి మృతి

న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబర్ 24: తెలంగాణ వ్యాప్తంగా మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిశాయి. పలు చోట్ల పిడుగులు పడి నలుగురు మృత్యువాత పడగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఖమ్మంలో వ్యవసాయ పనులు చేస్తున్న సమయంలో పిడుగుపడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం జగ్గారం శివారు బూరుగుగుంపునకు చెందిన కూలీలు కట్టం నాగశ్రీ (22), సున్నం అనూష (23) మృతిచెందారు. జగ్గారం గ్రామానికి చెందిన మడివి సీతమ్మ, ఊకే రత్తమ్మ, కల్లూరి రాతమ్మ తీవ్రంగా గాయపడ్డారు. వారిని మెరుగైన వైద్యం కోసం ఖమ్మం దవాఖానకు తరలించారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం బత్తులపల్లికి చెందిన దుర్గం లక్ష్మయ్య (65) పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లిలో పిడుగుపడి ఎర్రబొజ్జు రాధిక ఇల్లు ధ్వంసమైంది. సింగూరు ప్రాజెక్టు నుంచి వరద వస్తుండటంతో మెదక్ జిల్లా పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గా ప్రాజెక్టు పొంగిపొర్లుతున్నది.

### బంగాళాఖాతంలో అల్పపీడనం

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో రాగల నాలుగురోజుల పాటు భారీ వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. వరంగల్, నాగర్‌కర్నూల్, నిర్మల్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నిజామాబాద్, జోగులాంబ-గద్వాల, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఖిల్లా-వరంగల్ మండలంలో 9.67 సెం.మీ అత్యధిక వర్షపాతం నమోదైంది.

## తిరుమల లడ్డూ వివాదంపై సిట్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): తిరుమల లడ్డూ కల్తీ వివాదాన్ని తేల్చేందుకు సిట్‌ను ఏర్పాటు చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సిట్ చీఫ్‌గా గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని నియమించింది. ఐదేండ్లలో దేవాలయాల్లో జరిగిన ఘటనలపై జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించి భక్తుల మనోభావాలను దెబ్బతీసిందని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రాయశ్చిత్త దీక్షలో భాగంగా విజయవాడ కనకదుర్గ ఆలయ మెట్లను ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ శుద్ధిచేశారు. తమిళ హీరో కార్తీ, నటుడు ప్రకాశ్‌రాజ్ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. జగన్ హయాంలో తిరుమల కొండపై అవినీతి జరిగిందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆరోపించారు. సాధు పరిషత్ ఆధ్వర్యంలో టీటీడీ పరిపాలన భవనం ఎదుట స్వామీజీలు ఆందోళనకు దిగారు.

### సీబీఐ విచారణ జరిపించాలి: వీహెచ్

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 24: తిరుమల లడ్డూ వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలని కాంగ్రెస్ నేత వీ హనుమంతరావు డిమాండ్ చేశారు. లిబర్టీలోని టీటీడీ ఆలయంలో వీహెచ్ మౌనదీక్ష చేశారు.

## 28న హైదరాబాద్‌కు రాష్ట్రపతి

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 28 రాష్ట్రానికి రానున్నారు. ఉదయం నల్సార్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవానికి హాజరై మధ్యాహ్నం రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహోత్సవ్‌ను ప్రారంభిస్తారని రాష్ట్రపతి నిలయం పేర్కొంది. ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులను సీఎస్ శాంతికుమారి ఆదేశించారు.

## సీపీఎస్ రద్దు చేయాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): సీపీఎస్‌ను రద్దుచేసేందుకు కృషిచేయాలని సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ టీపీసీసీ అధ్యక్షుడు బీ మహేశ్‌కుమార్ గౌడ్‌ను కోరింది. మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం మహేశ్‌కుమార్‌గౌడ్‌తో భేటీ అయ్యింది. ఇటీవల కేంద్రం తీసుకొచ్చిన యూపీఎస్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని నేతలు కోరారు.





## ఫీజు బకాయిలను విడుదల చేయండి

### ప్రభుత్వాన్ని కోరిన ప్రైవేట్ కాలేజీ యాజమాన్య సంఘాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): అప్పులుచేసి కాలేజీలను నడుపుతున్నామని, ప్రజాప్రభుత్వంలోనూ తమకు నిరాశే మిగిలిందని ప్రైవేట్ కాలేజీల యాజమాన్య సంఘాలు ఆవేదన వ్యక్తంచేశాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయడంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నదని సంఘాలు ఆరోపించాయి. పలుమార్లు మంత్రులను కలిసి వినతిపత్రాలిచ్చినా.. సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసినా ప్రయోజనం లేకుండా పోయిందని, కాలేజీ యాజమాన్యాలను ప్రభుత్వం పూర్తిగా చిన్న చూపు చూస్తున్నదని మండిపడ్డాయి. త్వరలోనే అన్ని కాలేజీలు జేఏసీగా ఏర్పడి బకాయిల విడుదల పోరాటాన్ని మరింత ఉధృతం చేయనున్నాయి. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో కాలేజీ యాజమాన్యాల ప్రతినిధులు మాట్లాడుతూ.. దసరా కానుకకైనా రూ.6,500 కోట్లల్లో టోకెన్లు జారీ అయిన రూ.1,200 కోట్ల బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## భూవివాదంలో రాళ్లదాడి

- రైతులు, వెంచర్ నిర్వాహకుల మధ్య ఘర్షణ
- అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్‌లో ఉద్రిక్తత



గాయపడ్డ రైతు

పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 24: ఓ భూమి విషయమై రైతులు, వెంచర్ నిర్వాహకుల మధ్య ఏర్పడిన గొడవ.. రాళ్లు, కర్రల దాడి వరకు వెళ్లిన ఘటన మంగళవారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్‌లో చోటుచేసుకుంది. పిగ్లీపూర్‌లోని సర్వే నంబర్ 17లో గోపాల్‌యాదవ్ వెంచర్ ఏర్పాటు చేస్తున్నారు. గ్రామంలోని పలువురు రైతులు వెంచర్‌లోకి వెళ్లి.. ఇందులో సర్కారు పట్టాలు ఇచ్చిన సీలింగ్ భూమి ఉన్నదంటూ ట్రాక్టర్‌తో పనులు చేసేందుకు యత్నించారు. దీనిని వెంచర్ నిర్వాహకులు, సిబ్బంది అడ్డుకుంటుంటే.. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరిపై ఒకరు రాళ్లతో దాడి చేసుకోగా పోలీసులు చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. ఘర్షణల్లో గాయపడ్డ రైతుల్లో పంది ముత్తయ్య, నర్సింహ, ఆకుల సత్యనారాయణ, శంకర్, మరో ఇద్దరు ఉండగా.. వెంచర్ నిర్వాహకుల్లో లోకేశ్, దర్శన్‌రెడ్డి, మరొకరు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. వనస్థలిపురం ఏసీపీ, అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అంజిరెడ్డి సిబ్బందితో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. వెంచర్ నిర్వాహకులు సంప్రదింపుల కోసం పిలిచి దాడి చేశారని, కులం పేరుతో దూషించారని రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంచర్‌లోకి అక్రమంగా చొరబడిన కొందరు స్థానికులు వెంచర్ నిర్వాహకులు, సిబ్బందిపై దాడికి దిగారని ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదుల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. కాగా.. పిగ్లీపూర్ గ్రామంలో తమకు ప్రభుత్వం సీలింగ్ భూములిచ్చి పట్టాలు అందజేసిందని, ఆ భూముల్లోకి జరిగి కొందరు వెంచర్ చేస్తున్నారని, దీనిపై మండల రెవెన్యూ అధికారులు, హెచ్‌ఎండీఏ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతులు ఆరోపించారు. గతంలో ఉన్న మండల రెవెన్యూ అధికారిణి ఇష్టానుసారంగా అనుమతులు ఇచ్చారని విమర్శించారు. వెంచర్ నిర్వాహకులు మాట్లాడుకుందామని పిలిచి, మహిళలు, పెద్ద మనుషులపై సిబ్బందితో దౌర్జన్యంగా రాళ్లు, కర్రలతో దాడి చేయించారని వాపోయారు. మరోవైపు, తమ వెంచర్‌లోని సర్వేనంబర్‌లో ఎలాంటి సీలింగ్ భూమి లేదని నిర్వాహకులు చెప్తున్నారు.

## సుస్థిరాభివృద్ధిలో చట్టసభలు క్రియాశీలకం

### శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): దేశ సుస్థిరాభివృద్ధి-2030 లక్ష్యంలో చట్టసభలు క్రియాశీల పాత్ర పోషించాలని రాష్ట్ర శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ సూచించారు. న్యూఢిల్లీలో మంగళవారం జరిగిన పదో కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ)లో 'సుస్థిరమైన అభివృద్ధిలో శాసన వ్యవస్థల పాత్ర' అన్న అంశంపై ఆయన ప్రసంగించారు. పార్లమెంట్, రాష్ట్రాల శాసన వ్యవస్థలు సుస్థిరాభివృద్ధి కోసం ఉద్దేశించిన చట్టాలను, అవసరమైన నియమాలను రూపొందించడంతోపాటు వాటి అమలును వివిధ స్థాయిల్లో పర్యవేక్షిస్తున్నాయని తెలిపారు. పేదరికం, అసమానత్వం, పర్యావరణ క్షీణత, వాతావరణ మార్పులపై 2015లో ఐక్యరాజ్యసమితి రూపొందించిన నియమాలు మన పార్లమెంట్, రాష్ట్రాల శాసన వ్యవస్థలకు మార్గదర్శకాలుగా ఉన్నాయని చెప్పారు.

### గడ్కరీతో శాసనసభ స్పీకర్ భేటీ

స్పీకర్ ప్రసాద్‌కుమార్ మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వికారాబాద్ నియోజకవర్గంలోని మూడు రాష్ట్ర రోడ్లను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని, మరో ఏడు రోడ్లకు సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ స్కీమ్ కింద నిధులు మంజూరు చేయాలని గడ్కరీని కోరారు. ఎంపీలు కొండా విశ్వేశ్వరరెడ్డి, గడ్డం వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, తెలంగాణ లెజిస్లేటివ్ సెక్రటరీ నరసింహాచార్యులు పాల్గొన్నారు.

## ఒక్క శాతం వడ్డీకే గోల్డ్ లోన్

**ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ ప్రత్యేక ఆఫర్**

హైదరాబాద్, సెప్టెంబర్ 24: దేశంలో అతిపెద్ద నాన్-బ్యాంకింగ్ ఆర్థిక సేవలు అందిస్తున్న సంస్థల్లో ఒకటైన ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ మళ్లీ బంగారం రుణాలు ఆరంభించింది. మూడు నెలల క్రితం రిజర్వు బ్యాంక్ నిషేధం విధించడంతో రుణాలను నిలిపివేసిన సంస్థ..ఇటీవల సెంట్రల్ బ్యాంక్ తిరిగి అనుమతించడంతో మళ్లీ యథావిధిగా సేవలు ప్రారంభించింది. ఇదే అదనుగా కస్టమర్లను ఆకట్టుకోవడానికి 'గోల్డ్ లోన్ మేళా' పేరుతో ప్రత్యేక స్కీం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ స్కీం కింద కేవలం ఒక్క శాతం వడ్డీకే గోల్డ్ లోన్లను మంజూరు చేయనున్నట్లు ఐఐఎఫ్ఎల్ గోల్డ్ లోన్ హెడ్ సౌరభ్ కుమార్ తెలిపారు. అలాగే ప్రాసెసింగ్ ఫీజును కూడా ఎత్తివేసినట్లు చెప్పారు. ఈ నెల 30 వరకు ఈ ప్రత్యేక ఆఫర్ అందుబాటులో ఉండనున్నదని వెల్లడించింది.

## విద్యార్థులకు గేమింగ్ జోన్

హైదరాబాద్, సెప్టెంబర్ 24: విద్యార్థులకు కృత్రిమ మేధస్సు ఆధారిత గేమింగ్ జోన్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింది ఇంటెల్ ఇండియా. విశాల్ పెరిఫెరల్స్‌తో కలిసి ఏర్పాటు చేసిన ఈ గేమింగ్ జోన్‌లో విద్యార్థులు ఉచితంగా వినియోగించుకోవచ్చును. నగరంలో ఏర్పాటు చేసిన తొలి గేమింగ్ జోన్ ఇదే కావడం విశేషం. విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఇందులో అత్యాధునిక స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ కంప్యూటింగ్ టూల్స్‌తోపాటు ప్రోగ్రామింగ్, ఏఐ డెవలప్‌మెంట్, గేమింగ్ రంగాలకు చెందిన విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంచుకునేందుకు దోహదపడుతుందన్నారు.

## 'ప్రైవేట్‌లో రుణాలకు డిమాండ్'

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24: దేశవ్యాప్తంగా కార్పొరేట్ రుణాలకు అధికంగా డిమాండ్ ఉన్నదని, రూ.4 లక్షల కోట్ల విలువైన రుణాలు తీసుకోవడానికి సంస్థలు రెడీగా ఉన్నట్లు ఎస్బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో అర్థభాగంలో ప్రైవేట్ రంగం అంచనాలకుమించి రాణించే అవకాశాలున్నాయని ఆయన పేర్కొన్నారు. రోడ్లు, రెన్యూవబుల్ ఎనర్జీ, రిఫైనరీ విభాగాల నుంచి రుణాలకు డిమాండ్ ఉందన్నారు.



# సెన్సెక్స్ @ 85000

- 26వేలకు నిఫ్టీ • తొలిసారి తాకిన సూచీలు
- ఒడిదొడుకులతో నిలువని లాభాలు
- మిశ్రమంగా ముగిసిన మార్కెట్లు
- నష్టాల్లో ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్ షేర్లు



ముంబై, సెప్టెంబర్ 24: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం సరికొత్త స్థాయిలను తాకాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ తొలిసారి 85,000 మార్కును దాటింది. ఒకానొక దశలోనైతే 234.62 పాయింట్లు పుంజుకొని 85,163.23 వద్దకు చేరింది. అయినప్పటికీ అమ్మకాల ఒత్తిడితో చివరకు 14.57 పాయింట్లు పడిపోయి 84,914.04 దగ్గర స్థిరపడింది. దీంతో వరుస మూడు రోజుల లాభాల పరుగులకు బ్రేక్ పడినట్టైంది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ కూడా మొదటిసారి 26,000 మార్కును అధిరోహించింది. ఇంట్రా-డేలో 72.5 పాయింట్లు ఎగిసి 26,011.55 పాయింట్లకు వెళ్లింది. అయితే లాభాల స్వీకరణ కారణంగా కిందికి రాక తప్పలేదు. ఆఖర్లో 1.35 పాయింట్లు పెరిగి 25,940.40 వద్ద నిలిచింది. నిఫ్టీకిదే గరిష్ఠ ముగింపు కావడం గమనార్హం.

**తీవ్ర ఆటుపోట్ల మధ్య..**

స్టాక్ మార్కెట్లు ఆల్‌టైమ్ హై రికార్డుల వద్ద ఉండటంతో మదుపరులు ఊగిసలాటకు గురయ్యారు. ఈ క్రమంలోనే కొనుగోళ్లు, అమ్మకాల మధ్య సూచీలు తీవ్ర ఒడిదొడుకులకు లోనయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 84,716.07 పాయింట్ల కనిష్ఠాన్ని నమోదు చేసింది. ఎఫ్ఎంసీజీ, కొన్ని బ్యాంకింగ్ షేర్లలో లాభాల స్వీకరణ జరిగింది. అయితే చైనా తమ దేశ ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపర్చడానికి ప్రకటించిన ఉద్దీపనలతో మెటల్ షేర్లకు గిరాకీ కనిపించింది. కానీ హిందుస్థాన్ యునిలివర్, అల్ట్రాటెక్ సిమెంట్, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఇండస్ఇండ్ బ్యాంక్, టైటాన్, నెస్లే, బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు భారీగా నష్టపోవడం సెన్సెక్స్‌కు లాభాలను దూరం చేసింది. రంగాలవారీగా చూస్తే.. ఎఫ్ఎంసీజీ, టెలికం, సర్వీసెస్, ఆర్థిక సేవలు, కన్స్యూమర్ డ్యూరబుల్స్, బ్యాంకింగ్ షేర్లు 0.75 శాతం నుంచి 0.30 శాతం వరకు క్షీణించాయి. కాగా, మెటల్, పవర్, యుటిలిటీస్, కమోడిటీస్, ఇండస్ట్రియల్స్ షేర్లు 1.38 శాతం నుంచి 0.47 శాతం మేర పుంజుకున్నాయి. అలాగే బీఎస్ఈ మిడ్‌క్యాప్ 0.21 శాతం, స్మాల్‌క్యాప్ 0.04 శాతం పెరిగాయి.

**గ్లోబల్ మార్కెట్లలో..**

ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, చైనా, హాంకాంగ్ సూచీలు లాభాల్లో ముగిశాయి. షాంఘై, హాంకాంగ్ సూచీలు భారీ ఎత్తున పెరగడం విశేషం. ఐరోపా మార్కెట్లలోనూ బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ సూచీలు లాభాల్లోనే కదలాడుతున్నాయి. విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) భారతీయ స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులపట్ల ఆసక్తినే కనబరుస్తున్నారు. 'అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల కోతలు.. దేశీయ స్టాక్ మార్కెట్లను రికార్డుల్లో నడిపిస్తున్నాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిసెర్చ్ అధిపతి వినోద్ నాయర్ అన్నారు. చైనా సెంట్రల్ బ్యాంక్ వడ్డీరేట్ల కోతలు, ఆ దేశ ఉద్దీపనలు కూడా విదేశీ మదుపరులను పెట్టుబడుల వైపు తీసుకెళ్తున్నాయని అభిప్రాయపడ్డారు.

## ఒకేసారి ఆరు డైరెక్ట్ ఫ్లైట్లు

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 24: ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో.. హైదరాబాద్ నుంచి ఒకేసారి ఆరు రూట్లలో విమాన సేవలు ప్రారంభించింది. మంగళవారం శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అగర్తాల, జమ్ము, ఆగ్రా, కాన్పూర్, ఆయోధ్య, ప్రయాగ్‌రాజ్‌లకు నేరుగా విమాన సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చింది. దేశీయ విమాన కనెక్టివిటీ పెంచడంలో భాగంగా ఒకేసారి ఈ ఆరు సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్ సీఈవో ప్రదీప్ పణికర్ వెల్లడించారు. నూతన రూట్లలో విమాన సర్వీసులు అందించడానికి ఎయిర్‌పోర్ట్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని, ఇక్కడి నుంచి అంతరాయం లేకుండా ప్రయాణాన్ని మరింత సులభతరం చేశామని వివరించారు.

## టాటా నెక్సాన్ సీఎన్‌జీ వెర్షన్

**ప్రారంభ ధర రూ.8.99 లక్షలు**



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24: దేశీయంగా ఎస్‌యూవీలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని టాటా మోటర్స్ సరికొత్త మాడళ్లను మార్కెట్‌కు పరిచయం చేసింది. నెక్సాన్ విభాగంలోనే సీఎన్‌జీ, సరికొత్త 45 కిలోవాట్ల బ్యాటరీతో నెక్సాన్ ఈవీని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నయా ఈవీ వేగవంతంగా చార్జింగ్ అవడమే కాకుండా పలు నూతన ఫీచర్లతో తీర్చిదిద్దిన ఈ మాడల్ రూ.13.99 లక్షల నుంచి రూ.17.19 లక్షల లోపు లభించనున్నది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. అలాగే టర్బో చార్జర్ సీఎన్‌జీ వాహనం రూ.8.99 లక్షల ప్రారంభ ధరతో లభించనున్నది. దీంతో టాటా నెక్సాన్ అన్ని రకాలు పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ, ఎలక్ట్రిక్ విభాగంలో లభించిన తొలి మాడల్ ఇదే కావడం విశేషం. 45 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన ఈవీ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 350 నుంచి 370 కిలోమీటర్ల వరకు మైలేజీ ఇవ్వనున్నది. ఈ సందర్భంగా టాటా ప్యాసింజర్ విభాగ చీఫ్ కమర్షియల్ అధికారి వివేక్ శ్రీవాత్సవ మాట్లాడుతూ..ఏడేండ్ల క్రితం దేశీయ మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చిన నెక్సాన్ ఇప్పటి వరకు ఏడు లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయని, ఇదే ఒరవడిని కొనసాగిస్తూ సరికొత్త మాడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు.

## పెరిగిన ఎన్ఎండీసీ ఉత్పత్తి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24: ఇనుప ఖనిజ ఉత్పత్తి సంస్థ ఎన్ఎండీసీ గడిచిన ఆర్థిక సంవత్సరంలో మెరుగైన పనితీరు కనబరిచింది. ఖనిజ ఉత్పత్తిలో 10 శాతం పెరిగి 45 మిలియన్ టన్నులకు చేరుకోగా, అమ్మకాలు 16 శాతం అధికమై 44.48 మిలియన్ టన్నులకు చేరుకున్నట్లు కంపెనీ సీఎండీ అమితవ ముఖర్జీ తెలిపారు. 2022-23లో 257 మిలియన్ టన్నులు ఖనిజాన్ని ఉత్పత్తి చేసిన సంస్థ..ఆ మరుసటిఏడాది 275 మిలియన్ టన్నులకు పెరిగినట్లు ఆయన వెల్లడించారు.


## శంఖ్ ఎయిర్ వస్తోంది

***దేశీయ మార్కెట్‌లోకి మరో కొత్త ఎయిర్‌లైన్***

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24: దేశీయ మార్కెట్‌లోకి కొత్త విమానయాన సంస్థ రాబోతున్నది. త్వరలో శంఖ్ ఎయిర్ విమాన సర్వీసులు మొదలు కాబోతున్నాయి. కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ నుంచి ఇందుకోసం శంఖ్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుమతులు కూడా లభించాయి. మూడేండ్ల కాలపరిమితితో ఈ ఎయిర్‌లైన్‌కు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ)ను జారీ చేశారు. సెబీ, ఎఫ్‌డీఐ నిబంధనల్ని పాటించాలని కూడా స్పష్టం చేసింది. అయితే డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నుంచి క్లియరెన్స్‌లు రావాల్సి ఉన్నది. ఇది వస్తే శంఖ్ ఎయిర్ విమానాలు ఎగురుతాయి. కాగా, తొలి విమాన సర్వీసు ఉత్తరప్రదేశ్ నుంచి ప్రారంభం కానున్నది. లక్నో, నోయిడాలు కేంద్రంగా ఇది విమానయాన కార్యకలాపాలు నడుపనున్నది.

# 10,700 బోగస్ కంపెనీలు

**రూ.10వేల కోట్లకుపైగా ఎగవేతలు • గుర్తించిన జీఎస్టీ అధికారులు**



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) కింద దాదాపు 10,700 నకిలీ రిజిస్ట్రేషన్లను అధికారులు గుర్తించారు. ఇవన్నీ రూ.10,179 కోట్ల పన్ను ఎగవేసినట్టు తేల్చారు. దేశవ్యాప్తంగా నకిలీ రిజిస్ట్రేషన్లతో పుట్టుకొచ్చిన బోగస్ కంపెనీల గుట్టు రట్టు చేసేందుకు జీఎస్టీ అధికారులు ఓ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఖజానాకు నష్టం చేకూరుస్తున్న మోసగాళ్ల పని పట్టేందుకు చేపట్టిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున అక్రమాలు వెలుగుచూస్తుండటం గమనార్హం. ప్రస్తుతం జరుగుతున్న రెండో విడుత డ్రైవ్.. అక్టోబర్ 15దాకా ఉండనున్నది. కాగా, 12 రాష్ర్టాల్లో ఆధార్ ఆధారిత జీఎస్టీ రిజిస్ట్రేషన్‌ను అమల్లోకి తెచ్చామని, వచ్చే నెల 4కల్లా మరో నాలుగు రాష్ర్టాల్లోనూ మొదలవుతుందని పరోక్ష పన్నులు, కస్టమ్స్ కేంద్ర బోర్డు (సీబీఐసీ) సభ్యుడు శశాంక్ ప్రియ తెలిపారు. అసోచామ్ కార్యక్రమంలో మాట్లాడుతూ.. రిస్క్ ప్రొఫైల్ ఆధారంగా కొత్త ట్యాక్స్ పేయర్స్‌పై కొన్ని ఆంక్షలు సైతం పెడుతున్నట్టు చెప్పారు. నెలలో ఎన్ని ఇన్వాయిస్‌లు జారీ చేస్తున్నారన్న దానిపైనా దృష్టి పెడుతున్నట్టు తెలిపారు. అధికారులు 67,970 జీఎస్టీఐఎన్‌లను గుర్తించారని, ఇందులో ఈ నెల 22 నాటికి 39,965 జీఎస్టీఐఎన్‌లను వెరిఫై చేశామని పేర్కొన్నారు. కాగా, రిటైలర్ల కోసం జీఎస్టీ ఈ-ఇన్వాయిసింగ్ అమలుకుగాను తెస్తున్న ఆర్కిటెక్చర్ డిజైన్ దాదాపు సిద్ధమైందని జీఎస్టీ నెట్‌వర్క్ సీఈవో మనీశ్ కుమార్ సిన్హా తెలిపారు. త్వరలోనే బీ2సీలో దీన్ని తెస్తామన్నారు. అంతకుముందు పైలట్ ప్రాజెక్టుగా ఆచరణలోపెట్టి పరిశీలించనున్నట్టు అసోచామ్ కార్యక్రమంలో సిన్హా వెల్లడించారు.

## అక్టోబర్‌లో హ్యుందాయ్ 25వేల కోట్ల ఐపీవో!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24: హ్యుందాయ్ మోటర్ ఇండియా లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకు లైన్ క్లియరైంది. దాదాపు 3 బిలియన్ డాలర్ల (రూ.25,000 కోట్లు) నిధుల సమీకరణే లక్ష్యంగా వస్తున్న ఈ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) దేశంలోనే అతిపెద్దది కానున్నది. మార్కెట్ రెగ్యులేటర్ సెబీ.. ఈ మెగా ఐపీవోకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తున్నది. ఈ ఏడాది జూన్‌లో ఐపీవో కోసం సెబీకి డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (డీఆర్‌హెచ్‌పీ)ను హ్యుందాయ్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. కాగా, ఇప్పటిదాకా దేశ చరిత్రలో ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం ఎల్ఐసీ ఐపీవోనే అతిపెద్దది. దీని విలువ 2.7 బిలియన్ డాలర్లు. హ్యుందాయ్ పబ్లిక్ ఇష్యూ వస్తే దీన్ని అధిగమించనున్నది.

**బ్యాంకుల అక్రమాలపై విచారణ**

పలు చిన్నచిన్న ఐపీవోల నిర్వహణలో పాలుపంచుకున్న 6 స్థానిక ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులు అక్రమాలకు పాల్పడినట్టు గుర్తించిన సెబీ.. ఆ వ్యవహారంపై విచారణ చేస్తున్నది. ఆయా ఐపీవోల్లో సేకరించిన నిధుల్లో 1-3 శాతానికి బదులుగా 15 శాతం ఫీజులు ఇవి తీసుకున్నట్టు తెలుస్తున్నది.

# మహిళా వైద్యులు

**భారతదేశంలో** మహిళా వైద్యులు పెరుగుతున్నారు. మునుపటి కన్నా ఎక్కువ సంఖ్యలో డాక్టరమ్మలు.. పట్టాలు అందుకుంటున్నారు. ఈ విషయాన్ని ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇటీవలి సర్వేలో తేల్చింది. ఈ దశాబ్దకాలంలో వైద్యవిద్యను అభ్యసించిన పురుషులు, మహిళల సంఖ్యను వెల్లడించింది. 2020 – 21లో ప్రతి వందమంది పురుషులకు వంద మంది మహిళలు వైద్య కళాశాలల్లో చేరారట. అదే.. 2011–12లో 100 మంది పురుషులకు కేవలం 88 మంది మహిళలే ఉండేవారట. కార్డియాలజీ విభాగంలో 2012–13లో 312 మంది పురుష డాక్టర్లు ఉండగా.. కేవలం ఏడుగురు మాత్రమే మహిళా వైద్యులు ఉండేవారు. కానీ, 2020–21కి వచ్చేసరికి మహిళల సంఖ్య 78కి పెరిగింది. ఆంకాలజీలోనూ 2012–13లో 95 మంది పురుషులకుగాను 29 మంది మహిళా వైద్యులు ఉండేవారు. 2020–21లో వారిసంఖ్య 116కు చేరింది. ఇక న్యూరాలజీ విభాగానికి వస్తే.. 2012–13లో 118 మంది పురుష వైద్యులు ఉండగా.. కేవలం తొమ్మిది మంది మహిళలు మాత్రమే ఇక్కడ విధులు నిర్వహించేవారు. 2020–21లో ఈ సంఖ్య 78కి చేరింది. అయితే, చదువు పూర్తిచేసుకున్న మహిళలకు వృత్తిపరమైన అన్ని అర్హతలు ఉన్నప్పటికీ.. కుటుంబం, మాతృత్వ బాధ్యతలతోపాటు ఇతర కారణాల వల్ల వృత్తి జీవితాల్లో స్థిరపడలేకపోతున్నారట. ఏది ఏమైనప్పటికీ.. రాబోయే దశాబ్దంలో భారత వైద్యుల్లో దాదాపు సగంమంది మహిళలే ఉండబోతున్నారని ఈ సర్వే చెబుతున్నది.









# డెడ్‌లైన్ దాటుతున్నారా?!

**కార్పొరేట్ సామ్రాజ్యం... సామర్థ్యాలు, నైపుణ్యాలు... ఇక్కడ ఎంట్రీపాస్‌లు. టార్గెట్‌లు, డెడ్‌లైన్‌లు... రోజు వారీ పఠన మంత్రాలు. అనారోగ్యం, అకాల మరణం... నిష్క్రమణ మార్గాలు! అందరికీ కాకపోయినా చాలామంది విషయంలో ఇది అచ్చంగా నిజం. ఒకసారి ఈ పద్మవ్యూహంలోకి వెళ్లాక వెనక్కి రావడం కష్టం. నెగ్గుకురావడం ఇంకా కష్టం. చేతకాదంటే కుదరదు. చేతులెత్తేసే వీలుండదు. పాపం, అదే ఒత్తిడి ఇటీవల 26 ఏండ్ల అన్నా సెబాస్టియన్ అనే చార్టెడ్ అకౌంటెంట్ ప్రాణం తీసింది. ఉద్యోగంలో చేరిన నాలుగు నెలల్లోనే కన్నుమూసిన అన్నా పరిస్థితిని తెలుపుతూ ఆమె తల్లి రాసిన లేఖ అలాంటి వృత్తుల్లో ఉన్న చాలామంది జీవితాల గురించి ప్రపంచం కండ్లకు కట్టింది. ఆ డెడ్‌లైన్ మీరూ దాటుతున్నారా... ఓసారి పరీక్షించుకోండి!**

**అందరిలాగే** తన కూతురూ ఎన్నో కలలు, ఆశలతో ఉద్యోగ జీవితంలోకి అడుగుపెట్టిందని అన్నా తల్లి అనిత రాసుకొచ్చారు. తను పాఠశాలలో ఫస్టు. కాలేజీలో ఫస్టు. అత్యంత కఠినమైన చార్టెడ్ అకౌంటెన్సీని చిన్న వయసులోనే పూర్తిచేసింది. ఆమెకు సవాళ్లను స్వీకరించడం తొలి నుంచీ అలవాటు. గబుక్కున ఏ విషయాన్నీ తన చేతకాదు అని వదిలేయదు. కొత్తగా ఉద్యోగంలో చేరినప్పుడూ అంతే. తనకు ఇచ్చిన పనులను పూర్తి చేయడానికి చాలా తాపత్రయ పడేది. కానీ, ఆమె చేరిన సంస్థ మాత్రం ఇందుకు భిన్నంగా వ్యవహరించింది. చురుకైన అమ్మాయి కనుక మరింత పని చెప్పే ప్రయత్నం చేసింది. చిట్ట చివరికి ఆమెకు తినడానికి, నిద్ర పోవడానికి కూడా సమయం లేని పరిస్థితి. రాత్రి పని చెప్పి తెల్లవారి డెడ్‌లైన్ ఇచ్చిన సందర్భాలూ ఉన్నాయని ఆమె తల్లి ఈ లేఖలో చెప్పుకొచ్చింది. అదెలా సాధ్యమంటే రాత్రిపూట కూడా పనిచేయవచ్చనీ, తామూ అలాగే చేస్తున్నామని తన బాస్ అన్నారనీ ఆమె ఉటంకించింది. అన్యాయంగా అనిపించినా సరే, ఈ సంఘటన బయటి ప్రపంచపు అసలైన స్వభావానికి అద్దం పడుతున్నది. అయితే, ఈ సందర్భం నుంచి వృత్తి ఉద్యోగాల్లో ఉన్న ప్రతి మహిళా నేర్చుకోవాల్సిన కొన్ని అంశాలున్నాయి. మనం ఈ కోణంలో ఆలోచిస్తే ఎక్కువ కాలం వృత్తుల్లో రాణించగలం. ఆరోగ్యాన్నీ కొద్దో గొప్పో కాపాడుకోగలం.

### మన సామర్థ్యం ఎంత?

ప్రతి మనిషికీ కొన్ని సామర్థ్యాలు ఉంటాయి. వాటికి సాన పెట్టడంలో, మరింత మెరుగు పరచడంలో ఉద్యోగం కొద్దో గొప్పో సాయపడుతుంది. పరిమితమైన ఒత్తిడి మన శక్తి సామర్థ్యాలను రెట్టింపు చేస్తుంది కూడా. కానీ, ఒకానొక సందర్భంలో మనసు, శరీరం రెండూ మనల్ని హెచ్చరిస్తాయి. అప్పుడు తప్పకుండా ఆలోచించాలి. నిజంగా మనం చేయగలిగినంత పనే తలకెత్తుకుంటున్నామా... అని సమీక్షించుకోవాలి. దానికి తగ్గట్టు తక్షణ చర్యలూ తీసుకోవాలి.

### చిన్న టార్గెట్లు

మనం ధైర్యంగా ఉండాలంటే మన మీద మనకు నమ్మకం ఉండాలి. మన బలాలు, బలహీనతలు గుర్తెరగాలి. మనకంటూ ఒక వర్కింగ్ స్టైల్ ఉండాలి. ఒక పని మన దగ్గరికి వచ్చినప్పుడు ఒత్తిడి లేని చిన్న చిన్న టార్గెట్లు పెట్టుకుని దాన్ని నెమ్మదిగా సకాలంలో పూర్తి చేసేందుకు ప్రయత్నించాలి. ఒక టైం టేబుల్ లేదా ఒక పద్ధతి వర్కవుట్ కాకపోతే మరోటి ప్రయత్నించాలి. అలా కూడా అవ్వని పక్షంలో అది తలకు మించిన భారం అని గుర్తించాలి. మీ పై అధికారితో మాట్లాడాలి.

> ### “ ఆర్నెల్ల భత్యం ”
>
> **చాలా** సందర్భాల్లో మనం ఉద్యోగం గురించి భయపడటానికి ఆర్థిక భద్రత ప్రధాన కారణంగా ఉంటుంది. ఇవాళ ఉద్యోగం పోతే, నెలాఖరుకు జీతం రాకపోతే... ఎలా అన్న ఆలోచన ఒత్తిడికి గురి చేస్తుంది. అలాంటప్పుడే మనం మన గురించి ఆలోచించడం మానేస్తాం. అలా కాకుండా, ఆరునెలలు జీవించడానికి సరిపడా డబ్బును అత్యవసర నిధి కింద ఎప్పుడూ ఉంచుకుంటే మనం కాస్త భరోసాగా ఉండగలం. అలాగని బంగారమంటి ఉద్యోగాన్ని కాలదన్నుకుంటామని కాదు. నిజంగా అవసరమైన పక్షంలో సరైన నిర్ణయం తీసుకునే పరిస్థితిలో మాత్రం ఉంటాం.

### విరామం ఇవ్వండి

మూడు గంటల సినిమాకు మధ్యలో ఇంటర్వెల్ ఉంటుంది. పది అంకెల మొబైల్ నంబర్‌కీ మధ్యలో స్పేస్ ఉంటుంది. బుర్ర చురుగ్గా పనిచేయాలంటే, చేస్తున్న పని మీద ఏకాగ్రత ఉండాలంటే తప్పకుండా బ్రేక్ అవసరం. ఇది కూడా పనిలో భాగమే. కాబట్టి తప్పకుండా పనికి మధ్య మధ్యలో విరామం ఇవ్వండి. దీర్ఘకాలం పాటు సాగే పనులైతే, ప్రాజెక్టు పూర్తయ్యాక ఏ విహారయాత్రకో వెళ్లండి. శరీరంతో పాటు మనసుకీ విశ్రాంతి అవసరం అని గుర్తించండి.



### నో చెప్పండి

మనకు పని అప్పజెపితే అది పూర్తయిపోయినట్టే అని మేనేజ్‌మెంట్ భావించాలి... చాలామంది సమర్థులైన ఉద్యోగులుగా పేరు తెచ్చుకోవాలని ఆరాటపడే వాళ్ల ఆలోచన ఇది. నిజమే. మనకు పనిచెబితే అయి తీరాల్సిందే! అలా అని పని మీద పని అప్పగిస్తుంటే... పరిగెత్తి భారం దించేసుకున్న మనిషికి అంతే వేగంగా మరో భారం నెత్తిన పెడుతుంటే... తప్పకుండా గమనించాల్సిందే. ఒక వేళ వాళ్లు చెప్పే పనులు పూర్తి చేయలేమన్న భావన మనకు వచ్చిందంటే... తప్పకుండా అది అవ్వదని చెప్పేయాలి. నో చెప్పడం కొన్నిసార్లు అత్యవసరం అన్న విషయాన్ని నమ్మాలి. అలా చేయని పక్షంలో మనం మన ఆరోగ్యాన్ని పణంగా పెట్టాల్సిందే. అలాగని అనుకున్నంత గొప్పగా అవుట్‌పుట్ కూడా ఏమీ ఇవ్వలేం.

### ఓడిపోతే తప్పేముంది

అమ్మో... డెడ్‌లైన్‌లోపు పని పూర్తి చేయకపోతే క్లయింట్ దగ్గర మాటపడాల్సి వస్తుంది. అనుకున్న సమయానికి ఈ టార్గెట్ పూర్తి చేయకపోతే ఉద్యోగం ఊడిపోతుంది... అనుకునే సందర్భాలు ప్రతి ఉద్యోగి జీవితంలో ఏదో ఒక సమయంలో వస్తాయి. కానీ పదేపదే అదే అదే అనుకోవాల్సి వస్తే మాత్రం... పరిస్థితిని సమీక్షించుకోవాల్సిందే! ఆరోగ్యం మీద, తద్వారా రోజువారీ జీవితం మీదా ఆ తాలూకు చీకటి ప్రభావం పడుతుంటే నిర్మొహమాటంగా ఉద్యోగానికి బై చెప్పే ప్రయత్నం చేయాల్సిందే! ఎదురైన ప్రతి పనీ పూర్తి చేయగలిగితేనే మనం గెలిచినట్టు, లేకపోతే ఓడిపోయినట్టు... అన్న భావనలు ఉండనక్కర్లేదు. అయినా మన బాగుకోసం మనం కొన్నిసార్లు ఓడిపోవడం తప్పేం కాదు! ఎక్కడ నెగ్గాలో కాదు, ఎక్కడ తగ్గాలో కూడా తెలియాలి!



జిందగీ క్లినిక్

# కుంకుమ పువ్వు ఎప్పుడు తాగాలి?

**నమస్తే మేడం. నా వయసు 25 సంవత్సరాలు. నాకిప్పుడు మూడోనెల. కుంకుమ పువ్వు వేసుకుని పాలు తాగితే పిల్లలు మంచి రంగుతో పుడతారట కదా? అయితే ఇలా ఏ నెలలో తాగాలి. అలాగే పుట్టే బిడ్డ చక్కటి రంగుతో ఉండాలంటే ఇంకా నేను ఏం తినాలి? తెలుపగలరు.**

**మనం** ఏ రంగులో ఉంటే అదే రంగులో పిల్లలు పుడతారు. మన జన్యుకణాలను బట్టే పిల్లల రంగు అన్నది ఏర్పడుతుంది. అయినా మనం ఉండే ఉష్ణ దేశాల్లో అంత రంగును ఆశించాల్సిన అవసరం ఏమీ లేదు. కుంకుమ పువ్వు తాగితే తెల్లగా పిల్లలు పుట్టడం అన్నది జరగదు. మీ భార్యాభర్తల రంగే కాదు, మీ కుటుంబంలో, మీ భర్త కుటుంబంలో ఉండే వాళ్ల రంగు మీద కూడా పుట్టే బిడ్డల శరీర వర్ణం ఏర్పడటం అన్నది ఆధారపడుతుంది. మీరిద్దరూ ఒక రంగులో ఉన్నా కూడా, ఇంట్లో వాళ్ల రంగుని బట్టి కూడా పాపాయి రంగు ఏర్పడవచ్చు. అయితే కుంకుమ పువ్వు పాలలో కలుపుకొని తాగితే నష్టం ఏమీ లేదు. అలాగని మీరు విన్నట్టు ప్రత్యేకమైన లాభం కూడా ఏమీ లేదు. కాబట్టి బిడ్డ ఆరోగ్యంగా పుట్టాలని కోరుకోండి. పండ్లు తినండి. ఆకుకూరలు ఆహారంలో భాగం చేసుకోండి. సమతులాహారం తీసుకోండి. మసాలాలు, అధిక చక్కెరలు, జంక్‌ఫుడ్లకు దూరంగా ఉండండి. నీళ్లు బాగా తాగండి. ఆరోగ్యాన్ని మించిన అందం ఇంకేం ఉంటుంది చెప్పండి.



**డాక్టర్ పి. బాలాంబ**
సీనియర్ గైనకాలజిస్ట్

# యాక్టర్ కాకుంటే డాక్టర్‌!

**నటన గురించి తెలియకుండానే సూపర్‌స్టార్ మహేశ్‌బాబు మూవీలో చాన్స్ కొట్టేసిన నటి మౌనిక. చైల్డ్ ఆర్టిస్ట్‌గా కెరీర్ ప్రారంభించి సినిమాలు, సీరియల్స్‌తో మంచి నటిగా గుర్తింపు తెచ్చుకుంది. కొంతకాలం తెరకు దూరమైనా తన మనసు మాత్రం ఎప్పుడూ నటనపైనే ఉందంటున్నది. తన అమాయకత్వంతో తొలి సీరియల్‌తోనే ప్రేక్షకులను ఆకట్టుకున్న 'మధు' అంటే తెలుగునాట తెలియనివారుండరు. జీ తెలుగు 'అమ్మాయిగారు' సీరియల్‌తో రీ ఎంట్రీ ఇచ్చి బుల్లితెర ప్రేక్షకులను మళ్లీ అలరిస్తున్న మౌనిక జిందగీతో పంచుకున్న ముచ్చట్లు..**



చిన్నతెర

**'అతడు'** సినిమాలో చాన్స్ వచ్చినప్పుడు నేను తొమ్మిదో తరగతి చదువుతున్నా. నాకు యాక్టింగ్ గురించి అస్సలు తెలియదు. సినిమాలు, సీరియల్స్‌కి తేడా కూడా తెలియదు. అనుకోకుండా అవకాశం వచ్చింది. చైల్డ్ ఆర్టిస్ట్‌గానే కాబట్టి అమ్మ ఒప్పుకొంది. కానీ, నటనని కెరీర్‌గా ఎంచుకోడానికి వీల్లేదని షరతు పెట్టింది. అయితే, సినిమా విడుదలైన తర్వాత చాలా పేరొచ్చింది. అందరూ సూపర్‌స్టార్ మహేష్ బాబు, త్రిష గురించి అడిగేవాళ్లు. సెట్లో వాళ్లు ఎలా ఉండేవారో, ఏం మాట్లాడేవారో అడిగి తెలుసుకునేవాళ్లు. మా ఫ్రెండ్స్ కూడా నన్ను 'అతడు.. అతడు..' అని ఆటపట్టించేవాళ్లు. 'అతడు' తర్వాత మూడు, నాలుగు సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటించా. 'చుక్కల్లో చంద్రుడు', 'ఒక ఊరిలో', 'స్టాలిన్' సినిమాల్లోని పాత్రలతో మంచి గుర్తింపు లభించింది.

### బుల్లితెరపై అలా..

మా నాన్న షెఫ్. అమ్మ హెడ్ మిస్ట్రెస్. చాలా స్ట్రిక్ట్. బాగా చదువుకోవాలని చెప్పేది. సినిమా చాన్స్ వచ్చినప్పుడు ఓకే చెప్పినా.. తర్వాత సీరియల్స్‌లో నటిస్తానంటే అస్సలు ఒప్పుకోలేదు. అమ్మని ఒప్పించడానికి చాలా కష్టపడ్డాను. కొన్ని రోజులు మాత్రమే, ప్రొఫెషన్‌గా ఎంచుకోను అని మాటిచ్చాకే ఒప్పుకొన్నారు. 'రాధా మధు' సీరియల్‌తో బ్రేక్ వచ్చింది. అందులో నటిస్తూనే చదువు కంటిన్యూ చేశాను. స్టూడెంట్ లైఫ్ బాగుండేది. కాలేజీలో షూటింగ్ ముచ్చట్లు అడుగుతుండేవాళ్లు. భలేగా అనిపించేది. బాగా చదువుకొని డాక్టర్ అవ్వాలనుకున్నా. యాక్టర్ కాకపోయి ఉంటే.. డాక్టర్ అయ్యుండేదాన్ని.

### నటన ఒక అడిక్షన్..

నిజానికి నటన అనేది ఒక లూప్. ఒక్కసారి మేకప్ వేసుకుని స్క్రీన్‌పై కనిపించడం అలవాటైతే అడిక్ట్ అయిపోతాం. నేనైతే యాక్టింగ్ చేయకపోతే డిప్రెషన్‌లోకి వెళ్లిపోయేదాన్ని. పాప పుట్టినప్పుడు కొన్నిరోజులు బ్రేక్ తీసుకున్నా. పెండ్లి తర్వాత భర్త సపోర్ట్ ఉంటేనే మహిళలు కెరీర్‌లో కొనసాగగలుగుతారు. ఆ విషయంలో నేను చాలా లక్కీ. ఆయన ప్రోత్సాహంతోనే యాక్టింగ్ కెరీర్ కొనసాగిస్తున్నా. అమ్మ కూడా అండగా నిలిచింది. పిల్లలను తనే చూసుకుంటుంది. నేను దేవుణ్ని చాలా నమ్ముతాను. నా ఫ్యాన్స్ దేవుళ్లతో సమానం. వాళ్ల వల్లే నేనీ స్థాయిలో ఉన్నా. అభిమానుల ఆదరణ వల్లే అవకాశాలు వస్తున్నాయి.

... హరిణి

> 
>
> ### నేను పక్కా హైదరాబాదీ
>
> **మా** నాన్నది బోధన్. అమ్మది హైదరాబాద్. నేను పక్కా హైదరాబాదీ. ఇక్కడే పుట్టి పెరిగా. నాకు బాగా నచ్చిన వెకేషన్ స్పాట్ యాదగిరి గుట్ట. ఇంటి ఆహారం తినడానికే ఇష్టపడతాను. బయట ఫుడ్ అస్సలు తినలేను. ఆవకాయ అంటే చాలా ఇష్టం. స్పైసీ ఫుడ్ ఇష్టపడతా. ఎవరినీ నమ్మొద్దు. మన జీవితం మనది. మన మీద మనకు నమ్మకం ఉండాలి. స్నేహితులు, ప్రేమికులు, బంధువులు.. ఎవ్వరైనా కొంతవరకే. లైఫ్‌లో మీకు మీరే ఫస్ట్. తర్వాతే ఎవరైనా!

# ఈ లక్షణాలపై నిర్లక్ష్యం వద్దు!

**ఆటల్లో అలసిపోవడం, నిద్రలేమి, ఇంటి వంటను ముట్టకపోవడం.. ఈ లక్షణాలన్నీ పిల్లల ఆరోగ్య పరిస్థితిని తెలియజేస్తాయి. వీటిని పట్టించుకోకుంటే తీవ్రమైన అనారోగ్యాలకు దారితీస్తాయి. అందుకే, ఈ కింది లక్షణాలు మీ పిల్లల్లో కనిపిస్తే వెంటనే జాగ్రత్తపడండి. వైద్య నిపుణులను సంప్రదించి.. సరైన చికిత్స చేయించండి.**



### నిద్రపోకుంటే..

స్కూల్, ట్యూషన్, ఆటలు.. ఈ రోజుల్లో పిల్లలు రోజంతా తీరిక లేకుండా గడుపుతున్నారు. దాంతో శారీరకంగా, మానసికంగా త్వరగా అలసిపోతున్నారు. చాలా త్వరగానే నిద్రలోకి జారుకుంటారు. కనీసం ఎనిమిది గంటలైనా ప్రశాంతంగా నిద్రపోతారు. అలాకాకుండా.. మీ పిల్లలు రాత్రిపూట సరిగ్గా నిద్రపోవడం లేదంటే.. వారిలో ఏవో ఆరోగ్య సమస్యలు ఉన్నట్టే! నిద్రలేమి.. వారి మానసిక స్థితిని, మానసిక ప్రవర్తననూ ప్రభావితం చేస్తుంది. అందుకే, మీ పిల్లలు ప్రశాంతంగా నిద్రపోతున్నారా? లేదా? అన్నది గమనించండి. అంతే కాదు.. పీడకలలు, నిద్రలో ఉలిక్కిపడి లేవడాలు కూడా పిల్లల ఆరోగ్యం ప్రమాదంలో ఉన్నదని చెప్పే సంకేతాలే!

### అక్కడే పెరిగితే..

పిల్లలు సన్నగా ఉన్నా.. బొద్దుగా ఉన్నా ఓకే! కానీ, కేవలం నడుము, పిరుదుల దగ్గరే ఎక్కువ లావుగా ఉంటే మాత్రం.. డేంజర్ బెల్స్ మోగుతున్నట్లే! పిల్లలు ఇలా ఉంటే.. రాబోయే రోజుల్లో వారు ఊబకాయం బారినపడే ప్రమాదం ఉంది. వారి ఎదుగుదలపైనా ఈ లక్షణం ప్రభావం చూపుతుంది. మధుమేహం, హృదయ సంబంధ వ్యాధులనూ సూచిస్తుంది. కాబట్టి మీ పిల్లలు నడుము భాగంలోనే ఎక్కువ లావుగా కనిపిస్తే.. ముందుజాగ్రత్త పడాల్సిందే!

### అలసిపోతే అంతే!

'శారీరక శ్రమ' అనేది పిల్లలపై అంతగా ప్రభావం చూపదు. రోజంతా ఉరుకులు, పరుగులతో ఆటల్లో మునిగి తేలినా.. వారిలో అలసట అస్సలు కనిపించదు. అలాకాకుండా, మీ పిల్లలు ఆటల్లో దిగిన అరగంటకే అలసిపోవడం.. ఒక్క ఫ్లోర్ మెట్లెక్కినా ఎగశ్వాస పీల్చుకోవడం వంటివి చేస్తే ఆలోచించాల్సిందే! ఇలా పిల్లలు అసాధారణంగా అలసిపోవడం.. ఓ అరుదైన అనారోగ్య లక్షణం. ఆస్తమా, హృదయ సంబంధ సమస్యలకు సంకేతం! రక్తహీనత, శ్వాసకోశ ఇబ్బందులున్నా.. ఇలాంటి లక్షణాలు కనిపిస్తాయి. కాబట్టి పిల్లలు ఆటల్లో ఎంతసేపటికి అలసిపోతున్నారు? ఎన్ని ఫ్లోర్లు ఎక్కి, దిగగలుగుతున్నారు? అనే విషయాలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి.

### బయటి ఫుడ్డే బెస్ట్ అంటే..

పిల్లలు ఇంటి ఆహారం కన్నా.. బయటి ఫుడ్డునే ఎక్కువ ఇష్టపడతారు. ఇది సహజమే! అయితే, అప్పుడప్పుడూ బయట తినడం సరే! కానీ, ఇంటి ఆహారాన్ని ఏమాత్రం ఇష్టపడకుండా, కేవలం బయటి ఆహారాన్ని మాత్రమే తింటున్నారంటే.. వారి మానసిక ఆరోగ్యంపై ఓ కన్నేయాల్సిందే! పోషకాహార లోపం, జీర్ణ సమస్యలు, భావోద్వేగాల సమస్యలు, మానసిక ఒత్తిడి వల్ల కొందరు పిల్లలు ఇంటి ఆహారాన్ని ఇష్టపడరు. కాబట్టి వారి ఆహారం విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలి.



## దీప్తికి కోటి నజరానా మంజూరు

### చెక్ అందజేసిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక పారిస్ పారాలింపిక్స్‌లో కాంస్య పతకంతో చరిత్ర సృష్టించిన రాష్ట్ర యువ అథ్లెట్ జివాంజీ దీప్తి ప్రతిభకు తగిన గుర్తింపు లభించింది. విశ్వక్రీడల్లో మహిళల 400మీ. టీ20 విభాగంలో మెరిసిన దీప్తికి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి కోటి రూపాయల చెక్ అందజేశారు. దీప్తి కోచ్ నాగపురి రమేశ్‌కు 10లక్షలు నగదు ప్రోత్సాహం ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ రాష్ట్రానికి కీర్తి, ప్రతిష్ఠలు తీసుకొచ్చే ప్లేయర్లను కచ్చితంగా ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. క్రీడారంగంలో సమూల మార్పులు తీసుకువస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## చెస్ చాంపియన్లకు ఘన స్వాగతం

- హైదరాబాద్ చేరుకున్న హారిక

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్‌లో పసిడి పతకాలతో చరిత్ర సృష్టించిన భారత చెస్ ప్లేయర్లకు స్వదేశంలో ఘన స్వాగతం లభించింది. బుడాపెస్ట్(హంగరీ) వేదికగా జరిగిన మెగాటోర్నీలో ఓపెన్ విభాగంతో పాటు మహిళల కేటగిరీలో అద్భుత ప్రదర్శన కనబరిచిన తెలుగమ్మాయి ద్రోణవల్లి హారిక, దొమ్మరాజు గుకేశ్, వైశాలి, కెప్టెన్ శ్రీనాథ్‌కు సొంతగడ్డపై ఘన స్వాగతం లభించింది. మంగళవారం తెల్లవారుజామున శంషాబాద్ విమానాశ్రయంలో హారికకు తెలంగాణ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్, పలువురు చెస్ క్రీడాకారులు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా హారిక మాట్లాడుతూ ఒలింపియాడ్‌లో స్వర్ణ పతకాల ద్వారా భారత ప్లేయర్ల సత్తా ఏంటో ప్రపంచానికి తెలిసివచ్చిందని పేర్కొంది.

## మెరిసిన అర్జున్, సరయు

- జాతీయ జూనియర్ చెస్ టోర్నీ



హైదరాబాద్, ఆట ప్రతినిధి: హర్యానా వేదికగా జరిగిన జాతీయ జూనియర్ చెస్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర యువ ప్లేయర్లు ఆదిరెడ్డి అర్జున్ చాంపియన్‌గా నిలువగా, వేల్పుల సరయు రన్నరప్ సొంతం చేసుకుంది. మంగళవారంతో ముగిసిన టోర్నీలో జూనియర్ కేటగిరీ ఆఖరి పోరులో అర్జున్(8.5)..మాధవేంద్ర ప్రతాప్(8, మధ్యప్రదేశ్)పై విజయంతో టైటిల్ సొంతం చేసుకున్నాడు. మరోవైపు బాలికల విభాగం తుది రౌండ్‌లో సరయు(9)..సంస్కృతి(మహారాష్ట్ర)పై గెలిచింది. అయితే మ్రితిక మాలిక్(9)తో పాయింట్ల పరంగా సమంగా నిలిచిన సరయు టైబ్రేక్ విజయాలతో రన్నరప్ టైటిల్‌కు పరిమితమైంది. జాతీయ జూనియర్ టోర్నీలో రాణించిన అర్జున్, సరయును రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రత్యేకంగా అభినందించింది.

## పారా షట్లర్లకు నజరానా



ఢిల్లీ: ఇటీవలే పారిస్ వేదికగా ముగిసిన పారాలింపిక్స్‌లో భాగంగా బ్యాడ్మింటన్‌లో భారత్‌కు ఐదు పతకాలు అందించిన పారా షట్లర్లకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బాయ్) రూ. 50 లక్షల నగదు రివార్డును ప్రకటించింది. బ్యాడ్మింటన్ క్రీడలో భారత్‌కు ఒక స్వర్ణం, రెండు రజతాలు, రెండు కాంస్యాలు దక్కాయి. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్3 కేటగిరీలో బంగారు పతకం సాధించిన నితేశ్ కుమార్‌కు రూ. 15 లక్షలు దక్కగా వెండి కాంతులు పంచిన సుహాస్ యతిరాజ్ (ఎస్ఎల్ 4), తులసిమతి మురుగేశన్ (మహిళల సింగిల్స్ ఎస్‌యూ5)కు తలా రూ. 10 లక్షలు అందనున్నాయి. ఇక కాంస్యాలు సాధించిన అమ్మాయిలు మనీషా రామదాస్ (ఎస్‌యూ5), నిత్యశ్రీ శివన్ (ఎస్‌హెచ్6)కు తలా ఒక్కరికి రూ. 7.5 లక్షలు దక్కనున్నాయి.

## హాంగ్జో చాంప్ జీవన్ జోడీ



### చెంగ్డూలో రన్నరప్‌గా యూకీ ద్వయం

ఢిల్లీ: చైనా వేదికగా జరిగిన హాంగ్జో, చెంగ్డూ ఓపెన్స్‌లో భారత టెన్నిస్ ఆటగాళ్లు సత్తాచాటారు. హాంగ్జో ఓపెన్‌లో అన్‌సీడెడ్ భారత ఆటగాళ్లు జీవన్, విజయ్.. 4-6, 7-6(7/5), 10-7తో ఫ్రాంట్జెన్, జెబెన్స్(జర్మనీ)ను ఓడించి డబుల్స్ టైటిల్ సొంతం చేసుకున్నారు. 35 ఏండ్ల జీవన్‌కు ఇది రెండో ఏటీపీ టైటిల్ కాగా విజయ్‌కు ఇదే మొదటిది. తొలి సెట్‌లో ఓడినా తర్వాత పుంజుకున్న భారత ద్వయం రెండో సెట్‌ను టైబ్రేక్‌తో గెలుచుకుంది. మూడో సెట్‌లో ప్రత్యర్థులు పోరాడినా దీటుగా బదులిచ్చి విజేతగా నిలిచింది.

## సర్ఫరాజ్, జురెల్, దయాల్‌కు నో చాన్స్?

- ఇరానీ కప్ జట్టులో చోటు

కాన్పూర్: బంగ్లాదేశ్‌తో స్వదేశంలో రెండో టెస్టుకు ఎంపికైన భారత యువ క్రికెటర్లు సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్, యశ్ దయాల్ ఈ టెస్టు ఆరంభమయ్యాక జట్టును వీడే అవకాశముంది. అక్టోబర్ 1 నుంచి 5 దాకా లక్నో వేదికగా జరగాల్సి ఉన్న ఇరానీ కప్‌లో భాగంగా ఈ ముగ్గురూ ముంబై, రెస్ట్ ఆఫ్ ఇండియా జట్లకు ఎంపికవడమే ఇందుకు కారణం. బీసీసీఐ మంగళవారం ప్రకటించిన రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టులో జురెల్, దయాల్ చోటు దక్కించుకోగా సర్ఫరాజ్ ముంబై జట్టులో ఉన్నాడు. ఈనెల 27 నుంచి ఆరంభమయ్యే రెండో టెస్టు తుది జట్టులో గనక ఈ ముగ్గురూ ఆడకుంటే కాన్పూర్ నుంచి నేరుగా లక్నోకు చేరుకుంటారని బీసీసీఐ వర్గాలు తెలిపాయి.

## రెండో రౌండ్‌కు త్రిసా-గాయత్రి జోడీ

మకావు (చైనా): భారత మూడో సీడ్ బ్యాడ్మింటన్ జోడీ త్రిసా జాలీ, గాయత్రి గోపీచంద్ మకావు ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో రెండో రౌండ్ చేరారు. మంగళవారం ఇక్కడ జరిగిన మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో భారత జోడీ.. 15-21, 21-16, 21-14తో అకారీ సాటో, మయ టగుచి (జపాన్) ద్వయాన్ని చిత్తుచేసింది. మరో డబుల్స్ మ్యాచ్‌లో సిక్కి రెడ్డి, రుత్విక శివానీ.. 21-15, 21-17తో చియుంగ్ యన్ యు (హాంకాంగ్), చు వింగ్ (చైనా) జోడీని ఇంటికి పంపించింది.

# సత్తా చాటుతాం

### మెగాటోర్నీ సన్నాహాల్లో ముందున్నాం • టీ20 వరల్డ్‌కప్‌పై హర్మన్‌ప్రీత్



ముంబై: ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్‌లో సత్తాచాటుతామని భారత మహిళల కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్ ధీమా వ్యక్తం చేసింది. వచ్చే నెల 3వ తేదీ నుంచి యూఏఈ వేదికగా మొదలవుతున్న మెగాటోర్నీ కోసం మంగళవారం టీమ్‌ఇండియా బయల్దేరి వెళ్లింది. ఇన్నాళ్లు అందని ద్రాక్షగా ఊరిస్తూ వస్తున్న టీ20 ప్రపంచకప్‌ను ఈసారైనా ఒడిసిపట్టుకోవాలన్న పట్టుదలతో ఉన్న భారత్ ఆ దిశగా ముందుకెళుతున్నది. యూఏఈకి వెళ్లే ముందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్‌తో పాటు చీఫ్ కోచ్ అమోల్ మజుందార్, చీఫ్ సెలెక్టర్ నీతూ డేవిడ్ పాల్గొన్నారు. వాస్తవానికి షెడ్యూల్ ప్రకారం బంగ్లాదేశ్‌లో టీ20 ప్రపంచకప్ జరుగాల్సి ఉన్నా..అక్కడ నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా టోర్నీని యూఏఈకి మారుస్తూ ఐసీసీ నిర్ణయం తీసుకుంది. మెగాటోర్నీలో భాగంగా భారత్ తమ తొలి మ్యాచ్‌లో అక్టోబర్ 4న న్యూజిలాండ్‌తో తలపడనుంది. 2009లో మొదలైన ఈ మెగాటోర్నీలో భారత్ ఇప్పటి వరకు ఒక్కసారే(2020) ఫైనల్ చేరుకోగా, గతేడాది సెమీఫైనల్లోనే నిష్క్రమించింది. ఏండ్లుగా అందకుండా పోతున్న పొట్టి కప్‌ను ఈసారి ఒడిసిపట్టుకునేందుకు భారత్ తహతహలాడుతున్నది.

**సన్నాహాల్లో ముందున్నాం:**

టీ20 ప్రపంచకప్‌పై హర్మన్‌ప్రీత్ స్పందిస్తూ 'యూఏఈలో త్వరలో జరుగబోయే టీ20 వరల్డ్‌కప్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. ఆసియా కప్‌లో చేదు అనుభవం తర్వాత మా లోపాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాం. ముఖ్యంగా ఒత్తిడిని ఎదుర్కొంటూ ఎలా రాణించాలనే దాన్ని ప్రాధాన్యంగా తీసుకున్నాం. దూకుడుకు మారుపేరైనా టీ20ల్లో పరిస్థితులకు తగ్గట్లు ఆటతీరు మార్చుకోవాల్సి ఉంటుంది. గత టోర్నీలకు భిన్నంగా ఈసారి అన్ని విభాగాల్లో జట్టు సత్తాచాటుతుందన్న నమ్మకం నాకుంది. యువ క్రికెటర్లకు తోడు అనుభవజ్ఞులు ఉండటం జట్టుకు కలిసిరానుంది. జాతీయ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ)లో గత 10 రోజులుగా కఠిన శిక్షణ తీసుకున్నాం. ముఖ్యంగా ఫిట్‌నెస్, ఫీల్డింగ్‌లో మెరుగయ్యేందుకు చెమటోడ్చాం. ఇప్పటి వరకు చాలా మెగాటోర్నీలు ఆడిన అనుభవం నాకుంది. 19 ఏండ్ల వయసు నుంచి ఇప్పటి వరకు చాలా టోర్నీల్లో భాగమయ్యాను. టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ నుంచి బాగా పోటీ ఎదురయ్యే అవకాశముంది. ఐసీసీ ఈవెంట్లలో మమ్మల్ని ఎలా ఓడించాలో ఆసీస్‌కు బాగా తెలుసు. కానీ వారిని ఓడించే ఏకైక జట్టు భారత్ అన్న సంగతి వారికి కూడా తెలుసు' అని ఉంది. మజుందార్ మాట్లాడుతూ గత పది రోజులుగా ఎన్‌సీఏలో ఫిటనెస్, ఫీల్డింగ్‌పై బాగా దృష్టి పెట్టామన్నాడు.



## కాన్పూర్ టెస్టుకు భద్రత పెంపు

కాన్పూర్: భారత్, బంగ్లాదేశ్ మధ్య ఈనెల 27 నుంచి కాన్పూర్ వేదికగా జరగాల్సి ఉన్న రెండో టెస్టుకు పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హింసను నిరసిస్తూ 'అఖిలేష్ భారతీయ హిందు మహాసభ' ఆధ్వర్యంలో పలువురు ఆందోళనకారులు నిరసనకు దిగడంతో పాటు మ్యాచ్‌ను జరుగనివ్వబోమని హెచ్చరించిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. మ్యాచ్ జరిగే గ్రీన్ పార్క్ స్టేడియానికి సమీపంలో ఆందోళనకు దిగిన ఈ గ్రూప్ సభ్యులలో 20 మందిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. అంతేగాక బంగ్లాదేశ్ జట్టుకు అదనపు భద్రతను సమకూర్చుతున్నట్టు పోలీసు వర్గాలు తెలిపాయి. మంగళవారమే కాన్పూర్ చేరుకున్న ఇరు జట్ల ఆటగాళ్లూ స్థానికంగా ఉన్న లాండ్‌మార్క్ హోటల్‌లో స్టే చేస్తుండగా హోటల్ వద్ద భద్రతను పెంచినట్టు కాన్పూర్ అడిషనల్ కమిషనర్ హరీష్ చందర్ తెలిపారు.

## 'పంత్ దూకుడుకు కళ్లెం' : కమిన్స్

ఢిల్లీ: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఈ ఏడాది నవంబర్ నుంచి భారత్‌తో జరుగనున్న ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు ముందే ఆస్ట్రేలియా క్రికెటర్లు మైండ్ గేమ్‌కు మరింత పదును పెడుతున్నారు. ఈ మేరకు ఆసీస్ సారథి పాట్ కమిన్స్ ఓ క్రీడా చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'ప్రతి జట్టులో మ్యాచ్‌ను తమ వైపునకు తిప్పుకునే ఆటగాళ్లు ఒకరిద్దరు ఉంటారు. పంత్ దూకుడు కూడా ఇలాగే సాగుతుంది. గత రెండు సిరీస్‌లలో అతడు ప్రభావం చూపాడు' అని అన్నాడు.

## నకిలీ డాక్యుమెంట్లతో 20 లక్షలు దోపిడీ

- చనిపోయిన వ్యక్తి పేరుతో సిమ్‌కార్డ్ సృష్టి
- పేమెంట్ యాప్స్‌కు లింక్ చేసి సొమ్ము స్వాహా
- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు
- పరారీలో మరో నిందితుడు

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర సైబర్‌క్రైం పోలీసులు కొత్త తరహా మోసాన్ని వెలుగులోకి తెచ్చారు. చనిపోయిన వ్యక్తి పేరుతో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, సిమ్‌కార్డు పొందడం ద్వారా బ్యాంకుల నుంచి డబ్బు కొల్లగొడుతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. అతని నుంచి రూ.18 లక్షల నగదు, కార్డులు స్వాధీనం చేసుకున్నట్టు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ శిఖాగోయెల్ వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్‌కు చెందిన మహ్మమద్ సమీయుద్దీన్ ఇరిగేషన్ శాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేసి, 2013లో పదవీ విరమణ చేశాడు. ఎస్‌బీఐ, కెనరా బ్యాంకు ఖాతాల్లో లక్షల రూపాయలు దాచుకున్న ఆయన 2022లో చనిపోయాడు. ఆ ఖాతాల్లోని సొమ్ము విషయాన్ని సమీయుద్దీన్ గతంలో తనతో కలిసి పనిచేసిన జహంగీర్, మహ్మద్ ఆసిఫ్ పాషాకు చెప్పాడు. దీంతో వారిద్దరు ఈ ఏడాది జూన్‌లో సమీయుద్దీన్ సిమ్‌కార్డును బ్లాక్ చేయించారు. ఆయన పేరుతో నకిలీ గుర్తింపుకార్డులు తయారు చేసి, కొత్త సిమ్‌కార్డు తీసుకున్నారు. దానితో ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం తదితర యాప్‌లను యాక్సెస్ చేయడం ద్వారా సమీయుద్దీన్ ఖాతా నుంచి రూ.20 లక్షలు స్వాహా చేశారు. కాగా, సమీయుద్దీన్ సోదరి సబీహా సుల్తానా ఫోన్ నంబర్‌కు ఎస్బీఐ ఖాతాను అనుసంధానించి ఉండటంతో ఆయన ఖాతా నుంచి సొమ్ము విత్‌డ్రా అయినట్టు మెసేజ్ వచ్చింది. దీనిపై ఆమె అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సోమవారం ఆసిఫ్ పాషాను అరెస్టు చేశారు. మరో నిందితుడు జహంగీర్ పరారీలో ఉన్నాడు.

## హైదరాబాద్‌లో ఐటీ సోదాలు

### బొల్లా రామకృష్ణ ఇండ్లు, కార్యాలయాల్లో విస్తృత తనిఖీలు

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో ప్రముఖ వ్యాపారి బొల్లా రామకృష్ణకు చెందిన ఇండ్లు, కార్యాలయాల్లో మంగళవారం ఐటీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కూకట్‌పల్లి, బంజారాహిల్స్ చెక్‌పోస్ట్, మాదాపూర్, బషీర్‌బాగ్‌లో తెల్లవారు నుంచే జరిగిన ఈ సోదాల్లో 10 ఐటీ బృందాలు పాల్గొన్నాయి. కూకట్‌పల్లి రెయిన్‌బో విస్టాలోని రామకృష్ణ నివాసం, బషీర్‌బాగ్ పైగా ప్లాజాలోని ఫైనాన్స్ కంపెనీ కార్యాలయంలో అధికారులు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చే సుకున్నారు. స్టార్ పవర్ సంస్థ డైరెక్టర్ రా జేశ్ ఇంటిలోనూ సోదాలు జరిగాయి. రామకృష్ణ ఆదాయ పన్ను ఎగవేతకు పాల్పడినట్టు ఐటీ అధికారులు చెప్తున్నారు.

## యూట్యూబర్ హర్షసాయిపై కేసు

- పెళ్లి చేసుకుంటానని రూ. 2 కోట్లు తీసుకున్నాడు
- శారీరకంగా వాడుకున్నాడు
- నార్సింగి పోలీస్ స్టేషన్‌లో యువతి ఫిర్యాదు



మణికొండ, సెప్టెంబర్ 24: ప్రముఖ యూట్యూబర్ హర్షసాయి తనను పెళ్లి చేసుకుంటానని, శారీరకంగా వాడుకొని మోసం చేశాడని ఓ యువతి మంగళవారం హైదరాబాద్ నార్సింగి పోలీసులను ఆశ్రయించింది. పేదలకు సేవ చేస్తున్నానంటూ యూట్యూబ్‌లో రీల్స్ చేస్తున్న హర్ష సాయి అనేక అరాచకాలకు పాల్పడ్డాడని ఆ యువతి ఆరోపించింది. కొన్నాళ్లుగా ప్రేమాయణం నడిపినట్టుగా నటించిన హర్షసాయి తనను పెళ్లి చేసుకుంటానంటూ నమ్మించి పలుమార్లు శారీరకంగా వాడుకుని, ఇప్పు డు తెలియదన్నట్టుగా వ్యవహరిస్తున్నాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పెళ్లి చేసుకునేందుకంటూ తన నుంచి రూ.2 కోట్ల నగదు తీసుకున్నాడని, ఇందుకు ఆయన తండ్రి రాధాకృష్ణ కూడా కారణమని పేర్కొన్నది. కేసు నమోదు చేసిన నార్సింగి పోలీసులు విచారణ చేపట్టి తదుపరి వివరాలు తెలుపుతామని చెప్పారు.

## మెడికల్ అడ్మిషన్లలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు

### హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) నిబంధనలకు అనుగుణంగా 2024-25 విద్యా సంవత్సరంలో ఎంబీబీఎస్, బీడీఎస్, మెడికల్ పీజీ అడ్మిషన్లలో ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు (ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్లు కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల హైకోర్టుకు తెలియజేసింది. దీంతో ఆ హామీని రికార్డుల్లో నమోదు చేసిన హైకోర్టు.. మెడికల్ కోర్సుల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలు కోసం కామారెడ్డి ఎమ్మెల్యే కటిపల్లి వెంకటరమణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ముగిసినట్టు ప్రకటించింది.

- వ్యాన్ బోల్తా.. చేపలు లూటీ



విజయవాడ నుంచి వరంగల్ వైపు చేపల లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ మంగళవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడలోని బస్టాండ్ వద్ద బోల్తాపడింది. రోడ్డుపై చేపలు చెల్లాచెదురుగా పడటంతో స్థానికులు, రోడ్డున వెళ్లేవారు అందినకాడికి పట్టుకెళ్లారు. దీంతో గంటన్నరపాటు ఆ ప్రాంతమంతా రద్దీగా మారింది. – మరిపెడ

## బాలికపై పీఈటీ లైంగికదాడికి యత్నం

### తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ఆందోళన

కామారెడ్డి, సెప్టెంబర్ 24: ఆరేండ్ల బాలికపై పీఈటీ అత్యాచారయత్నం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జీవదాన్ పాఠశాల పీఈటీ నాగరాజు.. అదే స్కూల్‌లో చదివే బాలికపై అత్యాచారయత్నానికి ఒడిగట్టాడు. భయపడిపోయిన బాలిక బడికి వెళ్లనని మారాం చేసింది. ఏమైందని తల్లిదండ్రులు అడిగితే విషయం చెప్పడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, బాలిక తల్లిదండ్రులు, బంధువులు స్కూల్‌కు వచ్చి ఆందోళన చేశారు. అక్కడున్న అద్దాలు, వస్తువులను ధ్వంసం చేశారు. డీఎస్పీ నాగేశ్వర్‌రావు, సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ఎంత చెప్పినా పట్టించుకోలేదు. ఆందోళనకారులు పోలీసులపై రాళ్లు విసిరారు. సీఐ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్సై రాజారాం, మరికొందరికి గాయాలయ్యాయి. దీంతో పోలీసులు లాఠీచార్జి చేశారు. పరిస్థితి చేయి దాటుతుండటంతో అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి అక్కడకు చేరుకుని నిరసనకారులతో మాట్లాడి శాంతింపజేశారు.



Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

# 'గేమ్ చేంజర్' సందడి



**రామ్‌చరణ్** నటిస్తున్న 'గేమ్ చేంజర్' డిసెంబర్ 20న ప్రేక్షకుల ముందుకురానుంది. శంకర్ దర్శకత్వంలో అగ్ర నిర్మాత దిల్‌రాజు నిర్మిస్తున్న ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామా నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నది. భారీ యాక్షన్ హంగులతో దర్శకుడు శంకర్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించింది. ఈ నేపథ్యంలో ఈ సినిమా గురించి ఆసక్తికరమైన పోస్ట్ చేశారు సంగీత దర్శకుడు తమన్. డిసెంబర్ 20న 'గేమ్ చేంజర్' ప్రేక్షకుల ముందుకొసున్నదని, ఇప్పటి నుంచి సినిమా రిలీజ్ వరకు వరుసగా అప్‌డేట్స్ ఉంటాయని తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పేర్కొన్నారు. తమన్ ట్వీట్‌తో రామ్‌చరణ్ అభిమానులు ఖుషీ అవుతున్నారు. తాజా సమాచారం ప్రకారం బుధవారం రెండో పాటను విడుదల చేయబోతున్నారని తెలిసింది. ఈ చిత్రంలో రామ్‌చరణ్ తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయంలో కనిపించనున్నారు. కియారా అద్వాణీ, అంజలి, సముద్రఖని, ఎస్.జె.సూర్య, శ్రీకాంత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఎస్.తిరుణావుక్కరసు, సంగీతం: తమన్, సంభాషణలు: సాయిమాధవ్ బుర్రా, నిర్మాతలు: దిల్‌రాజు-శిరీష్, దర్శకత్వం: శంకర్.




# సిరిమల్లె పువ్వులాంటి సినిమా

'ఇప్పుడంటే తెలుగు సినిమా భారీ తనానికి కేరాఫ్ అడ్రస్ అయ్యిందికానీ.. ఒకప్పుడు తెలుగు సినిమా అంటే కె.విశ్వనాథ్‌గారి సినిమాలు. పెద్ద వంశీగారి సినిమాలు. మనసుల్ని మెలిపెట్టే భావోద్వేగాలను వారి సినిమాల్లో చూశాం. అలాంటి సినిమాలు ఈ రోజుల్లో చేయడం కుదరదా అనుకుంటున్న టైమ్‌లో '96' డైరెక్టర్ ప్రేమ్‌కుమార్ రాసుకున్న కథను చదివాను. ఆనందంతో కన్నీళ్లొచ్చాయి. అన్నయ్యకి ఈ స్క్రిప్ట్ ఇచ్చాను. ఆయన చదివి ఎమోషన్ అయ్యారు. ఇలాంటి కథలు నీకే ఎలా దొరుకుతాయి? అన్నారు. ఇందులో మరోముఖ్యమైన పాత్రను అరవింద్‌స్వామి చేశారు. కమల్‌హాసన్ స్థాయిలో నటించారాయన. 'ఖైదీ'లా నైట్ షూట్ ఉండే కథ ఇది. డైరెక్టర్ ప్రేమ్‌కుమార్ ప్లాన్డ్‌గా షూట్ చేశారు. ఇప్పటివరకూ చూడని కజిన్స్ ఎమోషన్‌తో తెరకెక్కిన కథ ఇది. మాకంటే ఒకరోజు ముందు బ్రదర్ తారక్ 'దేవర' రాబోతున్నది. కచ్చితంగా పెద్ద హిట్ అవుతుంది. 'దేవర' వార్ ఫైర్ లాంటి సినిమా. మనది సిరిమల్లె పువ్వులాంటి బ్యూటిఫుల్ సినిమా. మనసుపెట్టి చేశాం. తప్పకుండా అందరికీ నచ్చుతుంది.' అని హీరో కార్తీ అన్నారు. కార్తీ, అరవింద్‌స్వామి ప్రధాన పాత్రధారులుగా రూపొందిన చిత్రం 'సత్యం సుందరం'. '96'ఫేం సి.ప్రేమ్‌కుమార్ దర్శకుడు. సూర్య, జ్యోతిక నిర్మాతలు. ఏషియన్ సురేశ్ ఎంటర్టైన్మెంట్స్ ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ నెల 28న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో కార్తీ మాట్లాడారు. ఈ సినిమా తనకెంతో ప్రత్యేమని, ఆర్య, జగడం సినిమాలకు దర్శకత్వశాఖలో పనిచేశానని, తన కెరీర్ టాలీవుడ్‌లోనే మొదలైందనీ దర్శకుడు ప్రేమ్‌కుమార్ గుర్తు చేసుకున్నారు. ఇంకా నటి శ్రీదివ్య, నిర్మాత సురేశ్‌బాబు, రచయిత రాకేందుమౌళిలతోపాటు అతిథులుగా విచ్చేసిన విశ్వక్‌సేన్, డైరెక్టర్ ప్రశాంత్ వర్మ కూడా మాట్లాడారు.

# అడుగు తడబడితే నీ వెనకాలే ఉంటానులే..



గోపీచంద్ కథానాయకుడిగా శ్రీను వైట్ల దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా చిత్రం 'విశ్వం'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, చిత్రాలయం స్టూడియోస్ పతాకాలపై టీజీ విశ్వప్రసాద్, వేణు దోనెపూడి నిర్మిస్తున్నారు. దసరా సందర్భంగా అక్టోబర్ 11న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్‌లో వేగం పెంచారు. మంగళవారం 'మొండితల్లి పిల్ల నువ్వు' అనే పాటను విడుదల చేశారు. చేతన్ భరద్వాజ్ స్వరపరచిన ఈ పాటను శ్రీహర్ష రచించారు. తల్లీకూతుళ్ల బంధాన్ని ఆవిష్కరిస్తూ ఈ పాట సాగింది. 'అడుగే తడబడితే..ఇదిగో నీ వెనకే ఉంటానులే..చిన్నారి తల్లి...కలలో భయపడకు..ఎపుడూ నీ కునుకై ఉంటానులే చిన్నారి తల్లి..మొండితల్లి పిల్ల నువ్వు' అంటూ ఎమోషనల్‌గా ఈ పాటను తీర్చిదిద్దారు. డాటర్ సెంటిమెంట్‌తో రూపొందించిన ఎమోషనల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇదని, గోపీచంద్ పాత్ర గత చిత్రాలకు భిన్నంగా ఉంటుందని చిత్ర బృందం పేర్కొంది. కావ్య థాపర్, వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కె.వి.గుహన్, సంగీతం: చైతన్ భరద్వాజ్, దర్శకత్వం: శ్రీను వైట్ల.

# సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'జటాధర'



సుధీర్‌బాబు హీరోగా నటిస్తున్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'జటాధర'. వెంకట్ కల్యాణ్ దర్శకుడు. సుధీర్ బాబు ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్నది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన పూర్వ నిర్మాణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో హైదరాబాద్‌లో రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుంది. మంగళవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సుధీర్‌బాబు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'శాస్త్రీయ, పౌరాణిక అంశాల కలబోతగా ఈ స్క్రిప్ట్‌ను సిద్ధం చేశాం. ఈ రెండు భిన్న ప్రపంచాలు తెరపై ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతాయి. అబ్బురపరిచే విజువల్స్‌తో ఈ సినిమాను రూపొందించబోతున్నాం' అన్నారు. భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నామని నిర్మాతలు ప్రేరణ అరోరా, శివివన్ నారంగ్, నిఖిల్ నంద, ఉజ్వల్ ఆనంద్ తెలిపారు.

# కాశీ నేపథ్య కథాంశం



శ్రీహర్ష, కషిక కపూర్ జంటగా నటిస్తున్న చిత్రం 'లైఫ్' (లవ్ యువర్ ఫాదర్). పవన్ కేతరాజు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కిషోర్ రాఠీ, మహేష్ రాఠీ, ఏ.రామస్వామి నిర్మించారు. చిత్రీకరణ పూర్తయింది. త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. దర్శకుడు మాట్లాడుతూ 'కొడుకు బాధ్యత చూసుకుంటూ తండ్రి పడే ఆరాటం, తండ్రి కోసం కొడుకు చేసే పోరాటమే ఈ సినిమా కథాంశం. కాశీ నేపథ్యంలో కథ నడుస్తుంది. ఈ సినిమాలో శివ తత్వాన్ని చూపించే ప్రయత్నం చేశాం. చక్కటి కుటుంబ కథా చిత్రంగా మెప్పిస్తుంది' అన్నారు. దైవిక అంశాలతో పాటు తండ్రీకొడుకు మధ్య ఉండే బంధాన్ని ఈ సినిమా ఆవిష్కరిస్తుందని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి మణిశర్మ సంగీతాన్నందించారు.

# సంక్రాంతి హంగామా?



హ్యాట్రిక్ హిట్స్ తర్వాత బాలయ్య నుంచి సినిమా రాలేదు. ప్రస్తుతం కె.ఎస్.రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో ఆయన ఓ చిత్రం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు 'వీరమాస్' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. సితార ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం నిర్మాణం దాదాపు తుదిదశకు చేరుకున్నది. ఈ సినిమా విడుదల తేదీ విషయంలో ఇప్పటివరకూ క్లారిటీ లేదు. అయితే.. అందుతున్న తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాను సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారట. త్వరలోనే అధికారిక ప్రకటన కూడా రానున్నది వినికిడి. బాలకృష్ణ 109వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. సంక్రాంతి విజయాలు బాలయ్యకు కొత్తకాదు. ఈ సినిమా సంక్రాంతి రిలీజ్ ఖాయమైతే నందమూరి అభిమానుల్లో పండగే. ఊర్వశీ రౌతేలా, ఛాందినీ చౌందరి కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంలో బాబీ డియోల్ విలన్‌గా కనిపించనున్న విషయం తెలిసిందే. థమన్ సంగీత దర్శకుడు.

# నా కల నెరవేరింది



**'యానిమల్'** సినిమాతో ఒక్కసారిగా యువతలో క్రేజ్ సంపాదించుకుంది బాలీవుడ్ భామ త్రిప్తి డిమ్రీ. ప్రస్తుతం ఈ అమ్మడికి వరుసగా భారీ ఆఫర్లొస్తున్నాయి. ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చిన 'బ్యాడ్ న్యూజ్' చిత్రం కూడా ఈ భామకు మంచి గుర్తింపు తీసుకొచ్చింది. త్రిప్తి డిమ్రీ కథానాయికగా నటించిన తాజా చిత్రం 'విక్కీ విద్యా కా వో వాలా వీడియో' చిత్రం అక్టోబర్ 11న విడుదలకానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషనల్ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమె ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. ఇప్పటివరకు తనకు సినిమాల్లో డ్యాన్స్ చేసే అవకాశం రాలేదని, ఈ సినిమాలో 'మేరే మెహబూబ్' అనే పాట ఆ లోటును తీర్చిందని ఆనందం వ్యక్తం చేసింది. 'నాకు డ్యాన్స్ అంటే చాలా ఇష్టం. అయితే ఇప్పటివరకు ఒక్క సినిమాలో కూడా డ్యాన్స్ చేసే అవకాశం దక్కలేదు. ఈ విషయం చాలా బాధపెట్టేది. 'విక్కీ విద్యా కా వో వాలా వీడియో' చిత్రంలో నాపై పాట ఉందని తెలియగానే పట్టరాని సంతోషమేసింది. కొరియోగ్రాఫర్ గణేష్ ఆచార్య ప్రోత్సాహంతో చాలా సులభంగా డ్యాన్స్ చేయగలిగాను. నేను తొలిసారి డ్యాన్స్ చేసిన ఈ పాట ఎప్పటికీ గుర్తుండిపోతుంది' అని త్రిప్తి డిమ్రీ ఆనందం వ్యక్తం చేసింది.

# ఆ ఆలోచనలోంచి ఈ కథ పుట్టింది



'డిఫరెంట్ జనరేషన్స్ నేపథ్యంలో సాగే సినిమా 'స్వాగ్'. వంశవృక్షాన్ని ఆవిష్కరిస్తూ తయారు చేసిన స్క్రిప్ట్ ఇది. సింగా అనే కేరక్టర్ ప్రజెంట్ జనరేషన్. 90'sకి సంబంధించిన కేరక్టర్ ఉంటుంది. అలాగే 70'sకి సంబంధించిన కేరక్టర్ ఉంటుంది. ఇంకా ముందుకెళ్తే.. మూల పురుషుడికి చెందిన పాత్ర ఉంటుంది. ప్రతి జనరేషన్‌లోనూ శ్రీవిష్ణునే కనిపిస్తున్నారు. నాలుగు పాత్రలకూ సమ ప్రాధాన్యం ఉంటుంది. అచ్చ తెలుగు అంశాలతో, రూటెడ్ కల్చర్‌తో ఈ సినిమా సాగుతుంది.' అని దర్శకుడు హసిత్ గోలి అన్నారు. శ్రీవిష్ణు హీరోగా ఆయన దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'స్వాగ్'. రీతూవర్మ కథానాయిక. మీరాజాస్మిన్, దక్ష నాగర్కర్ కీలక పాత్రధారులు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 4న విడుదల కానుంది. ఈ సందర్భంగా హసిత్ గోలి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 'పితృస్వామ్య వ్యవస్థ, పురుషాధిక్యతలపై స్త్రీల పోరాటాలు, తద్వారా నెలకొన్న లింగ విబేధాలు తరతరాలుగా ఉన్నవే. ఇవి కాలగమనంలో ఎలా మారుతూ వచ్చాయి? వాటి ప్రస్తుత రూపమేంటి? అనే ఆలోచన లోంచి ఈ కథ పుట్టింది. పేర్ల, విషయంలో పాత్రల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. కథానుగుణంగా యయాతి, భవభూతి లాంటి పేర్లు వాడాం. కథ విషయం కన్‌ఫ్యూజన్ లేకుండా అందరికీ అర్థమయ్యేలా స్క్రీన్‌ప్లే రాసుకున్నాను. ఇందులో ఫన్‌కి ఢోకా ఉండదు. ఇంటర్వెల్ బ్లాక్ ఆశ్చర్యపోయేలా ఉంటుంది' అని తెలిపారు హసిత్ గోలి. రీతూవర్మ, మీరా జాస్మిన్ పాత్రలు భిన్నంగా ఆసక్తికరంగా ఉంటాయని, వివేక్‌సాగర్ సంగీతం సినిమాకు ప్రధాన బలం అని హసిత్ గోలీ చెప్పారు.

# అగ్ర హీరోలు పారితోషికాలు తగ్గించుకోవాలి



అగ్ర హీరోలు భారీగా పారితోషికాలు డిమాండ్ చేయడం సినిమా విజయావకాశాలపై ప్రభావం చూపుతున్నదని తమిళ దర్శకుడు వెట్రిమారన్ అభిప్రాయపడ్డారు. రజనీకాంత్, విజయ్ వంటి అగ్ర హీరోల చిత్రాలకు ఓటీటీ సంస్థలు 120 కోట్లు చెల్లించి స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకుంటున్నాయని, దీనివల్ల సినీరంగంలో వ్యాపారపరమైన అంతరాలు పెరిగిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల 'డైరెక్టర్స్ అన్‌కట్' పేరుతో ముంబయిలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. 'అగ్ర హీరోల చిత్రాలకు 120 కోట్లు చెల్లిస్తాం అంటూ ఓటీటీ సంస్థలు తొలుత ఒత్తిడి తీసుకొస్తున్నాయి. దాంతో సినిమాల బడ్జెట్‌లు పెరిగిపోతున్నాయి. ఓటీటీ మార్కెట్‌ను చూసి అగ్ర హీరోలు రెమ్యునరేషన్ కూడా పెంచుతున్నారు. ఆ తర్వాత ఓటీటీ సంస్థలు 'మేము ఆ స్థాయిలో చెల్లించలేం' అంటూ చేతులెత్తేస్తున్నారు. అప్పటికే హీరోలతో రెమ్యునరేషన్ అగ్రిమెంట్స్ పూర్తయి ఉండటంతో నిర్మాతలపై భారం పడుతున్నది. ఓటీటీ సంస్థలు ఈ ధోరణిని మార్చుకోవాలి' అని వెట్రిమారన్ అన్నారు.

# భయాన్ని గౌరవించాలని చెప్పడమే 'దేవర' కథ

99శాతం సక్సెస్ రేట్ ఉన్న దర్శకుడు కొరటాల శివ. రచయితగా కెరీర్ మొదలుపెట్టి, దర్శకుడిగా మారి, వరుస విజయాలను అందుకొని టాలీవుడ్ టాప్ దర్శకుల్లో ఒకరిగా నిలిచారు కొరటాల. బ్లాక్‌బాస్టర్ 'జనతా గ్యారేజ్' తర్వాత ఎన్టీఆర్‌తో ఆయన చేసిన సినిమా 'దేవర'. నందమూరి కల్యాణ్‌రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె రెండు భాగాలుగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తొలిభాగం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో కొరటాల శివ విలేకరులతో ముచ్చటించారు.



- రెండ్రోజుల్లో 'దేవర' రిలీజ్ కాబోతున్నది. పరీక్ష రాసి, ఫలితాలకోసం ఎదురుచూసే విద్యార్థి మానసిక పరిస్థితి ఎలావుంటుందో ప్రస్తుతం నా మానసిక పరిస్థితీ అలాగే ఉంది. ఈ ఫీల్ నా ప్రతి సినిమా రిలీజ్‌కూ ఉండేదే. జవాబుదారీతనం వల్లే వచ్చే భయం ఇది. ఈ భయం వల్లే మనం చేసే పనిని చెక్ చేసుకొని మంచి ఫలితాలు పొందుతాం.
- 'దేవర' సినిమా కూడా భయం చుట్టూనే తిరుగుతుంది. ప్రతి ఒక్కరిలో భయం కామన్. దాన్ని గౌరవించాలని చెప్పడమే 'దేవర' కథ. భయం లేకుండా బతకాలనుకోవడం తప్పు. మితిమీరిన ధైర్యం మూర్ఖత్వం అవుతుంది. లా ఆఫ్ ల్యాండ్ అనేది ఒకటి ఉంటుంది. దాన్ని అందరూ పాటించాలి. అదే భయం అంటే. ట్రాఫిక్ సిగ్నల్ పడుతుంది. అందరం ఆగుతాం. ఎందుకు ఆగాలి? వెళ్లిపోవచ్చుగా? మనలో బాధ్యతతో కూడిన చిన్నపాటి భయం ఉంటుంది. అది మనల్ని ముందుకు వెళ్లనివ్వదు.. ఆపేస్తుంది. ఆ భయం మనిషికి అవసరం. మంచిది కూడా. అదే 'దేవర'లో చెప్పా.
- 'దేవర'ను సెట్స్ పైకి తీసుకెళ్లడానికి ఆరు నెలలు టైమ్ తీసుకున్నాం. సముద్రంపై ఎలా షూట్ చేయాలి?.. కుదరకపోతే సముద్రాన్ని ఎలా క్రియేట్ చేసుకోవాలి?.. ఇలాంటి విషయాలపై స్టడీ చేశాం. ఈ తరహా సినిమాలు ఇప్పటివరకూ ఎవరూ చేయలేదు. దాంతో మాకు సలహాలిచ్చే వాళ్లు కూడా లేరు. అందుకే.. అన్ని విషయాలపై అవగాహన పెంచుకొని సినిమా మొదలుపెట్టాం.
- ఎన్టీఆర్‌తో ప్రయాణం నాకెప్పుడూ ప్రత్యేకమే. ఏ విషయమైనా ఆయనతో డిస్కస్ చేసినప్పుడు మనసులోని భావాన్ని నిర్మొహమాటంగా చెప్పేస్తారు. లోపల ఒకటి పెట్టుకొని బయటకు మరొకటి చెప్పే తత్వం కాదు తనది. 'దేవర' లైన్ చెప్పినప్పుడు ఆయన స్పందించిన తీరుతోనే ఈ సినిమా నెక్ట్స్ లెవల్‌కి వెళ్లింది. ఎన్టీఆర్‌కోసం మా టీమ్ అందరం చివరి నిమిషం వరకూ ఎంత ఎఫర్ట్ పెట్టాలో అంతా ఎఫర్ట్ పెట్టాం. ఇందులో తారక్ ద్విపాత్రాభినయం చేశారు. ఈ కథ రాసుకున్నప్పుడే రెండు పాత్రలకు తారక్ అనుకునే రాసుకున్నాను. తండ్రి 'దేవర'.. కొడుకు 'వర'. తండ్రి పాత్రను మించేలా కొడుకు పాత్ర ఉంటుంది. అలాగే జాన్వీకపూర్, సైఫ్ ఆలీ ఖాన్ తమ పాత్రలను అర్థం చేసుకొని అద్భుతంగా నటించారు. వాళ్ల గెటప్స్ విషయంలోనూ ప్రత్యేక శద్ధ తీసుకున్నాం.
- 'దేవర' నరేషన్ నాలుగు గంటలుంది. పేపర్ మీద పెట్టినప్పుడు 6-7 గంటలు వస్తున్నది. సెకండ్ షెడ్యూల్ టైమ్‌లోనే ఈ కథను మూడు గంటల్లో చెప్పలేమని అర్థమైంది. దాంతో రెండు భాగాల్లో చేయాలని నిర్ణయించాం. ఇది బిజినెస్ కోసమో, సెన్సేషన్ కోసమో చేసింది కాదు. లక్కీగా 'దేవర'కు సాబు శిరిల్, రత్నవేలు, శ్రీకరప్రసాద్, అనిరుథ్ లాంటి లెజెండరీ టెక్నీషియన్స్ కుదిరారు. వారిలో ఎవరికీ స్పూన్ ఫీడింగ్ ఇవ్వాల్సిన పనిలేదు. అర్థం చేసుకొని అద్భుతమైన అవుట్‌పుట్ ఇచ్చారు. మొత్తంగా 'దేవర' ప్రేక్షకులందరికీ కన్నుల పండుగలా ఉంటుందని నమ్మకంతో చెప్పగలను.